www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 1-5-2026 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 24 సంచిక (Issue) : 54 | శ్రీ పరాభవనామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా.10:53 తదుపరి పాడ్యమి; నక్షత్రం: స్వాతి తె.4:35 తదుపరి విశాఖ; వర్జ్యం: ఉ.8:25-10:10; దుర్ముహూర్తం: ఉ.8:24-9:15, మ.12:37-1:28; అమృతఘడియలు: రా.6:56-8:41; రాహుకాలం: ఉ.10:30-12:00; సూర్యోదయం: 5:53; సూర్యాస్తమయం: 6:31 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


BHASHYAM
INTERNATIONAL SCHOOL
CROWNED WITH KNOWLEDGE · SINCE 1993
CAMBRIDGE
UNIVERSITY PRESS & ASSESSMENT
Centre of Excellence
Cambridge & CBSE Integrated Curriculum
Early Years - Grade XII
BHASHYAM INTERNATIONAL SCHOOL
A New Era of World-Class Education
Admissions Open 2026-27
Early Years - Grade 8
CONTACT: 9666414689
S.No. 147, Near Bhashyam Aditya Campus,
GORANTLA, GUNTUR - 522 034, A.P.
Scan to Locate Us


Nurturing Minds, Shaping Futures
Growing & Glowing CBSE stream with 24 branches in South India
WHAT MAKES US DIFFERENT
STATE-OF-THE-ART INFRASTRUCTURE
A modern learning environment with air-conditioned smart classrooms.
ACADEMIC EXCELLENCE
A CBSE curriculum enriched with modern pedagogy & real-world applications.
TECHNOLOGY INTEGRATED
Advanced digital tools, enhancing interactive and future-ready learning skills.
HOLISTIC DEVELOPMENT
Focus on academics, sports, arts, life skills and values.
GLOBAL PERSPECTIVE
Preparing students to be confident, responsible global citizens.
SAFE & NURTURING ENVIRONMENT
A secure, caring and inclusive campus where every child thrives.
Secondary Campus
Kindergarten Campus
Primary Campus
ADMISSIONS OPEN
2026-27
Nursery to Grade X
BHASHYAM
BLOOMS
the global school
ANDHRA PRADESH | TELANGANA | KARNATAKA
Globally Recognized by
TRINITY COLLEGE LONDON
CAMBRIDGE
brainfeed
Central Office : Ring Road, GUNTUR : Mobile : 98485 36968
Website : www.bhashyamblooms.com / www.bhashyamblooms.in
E-mail : blooms@bhashyam.in / Instagram : bhashyamblooms.guntur

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


శుక్రవారం | 1-5-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajahmahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

గుజరాత్ ఘనంగా..

వణికించిన బౌలర్లు

4 వికెట్ల తేడాతో బెంగళూరుపై విజయం



హోల్డర్ (2/29)



అర్షద్ (3/22)

అహ్మదాబాద్: గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్‌షోతో మురిపించింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో చిన్నస్వామి స్టేడియంలో ఎదురైన ఓటమికి తమ సొంత మైదానంలో బదులు తీర్చుకుంది. పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన ఆర్‌సీబీని బౌలర్లు స్వల్ప స్కోరుకే కట్టడి చేశారు. ఆ తర్వాత గిల్ (18 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 43), బట్లర్ (19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 39)ల దూకుడుకు మరో 25 బంతులుండగానే గుజరాత్ 4 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 19.2 ఓవర్లలో 155 పరుగులకు ఆలౌటైంది. దేవ్‌దత్ (24 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 40), విరాట్ (13 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 28) రాణించారు. పేసర్ అర్షద్‌కు మూడు.. రషీద్, హోల్డర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 15.5 ఓవర్లలో 6 వికెట్లకు 158 పరుగులు చేసి నెగ్గింది. తెవాటియా (27 నాటౌట్) రాణించాడు. భువనేశ్వర్‌కు మూడు, షెఫర్డ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హోల్డర్ నిలిచాడు.

గిల్, బట్లర్‌ల దూకుడు

స్వల్ప ఛేదనలో గుజరాత్ వికెట్లు కోల్పోయినా ఆరంభం నుంచే వేగం కనబరిచింది. ముఖ్యంగా ఓపెనర్ గిల్, బట్లర్ బౌండరీలతో ఎదురుదాడికి దిగారు. పేసర్ భువనేశ్వర్ మాత్రం కళ్లు చెదిరే బంతులతో మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. మరో ఓపెనర్ సుదర్శన్ (6) ఈసారి విఫలమైనా.. అటు గిల్ మాత్రం తొలి ఓవర్‌లో 4,6.. రెండో ఓవర్‌లో 4,4,6,4,6తో చెలరేగాడు. అయితే భువీ తన వరుస ఓవర్లలో ఓపెనర్లను పెవిలియన్‌కు చేర్చాడు. అయితే బట్లర్ 4,6తో పవర్‌ప్లేలో జట్టు 69/2తో నిలిచింది. స్పిన్నర్ సుయాష్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదిన బట్లర్‌ను తిరిగి భువీనే అద్భుత బంతికి బౌల్డ్ చేశాడు. కానీ 9 ఓవర్లలోనే స్కోరు 100 దాటడంతో జీటీకి ఇబ్బందిలేకుండా పోయింది. 11వ ఓవర్‌లో షారుక్ (8), సుందర్ (12)లను పేసర్ షెఫర్డ్ అవుట్ చేసినా.. తెవాటియా, హోల్డర్‌ల ధాటికి లక్ష్యం వేగంగా తగ్గింది. అప్పటికి ఆరు ఓవర్లలో 15 పరుగులే అవసరం కావడంతో ఆర్‌సీబీ చేసేదేమీ లేకపోయింది.

టైటాన్స్ బౌలర్ల కట్టడి

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు బ్యాటింగ్ ఇబ్బందికరంగా సాగింది. గుజరాత్ బౌలర్లు కచ్చితమైన లెంగ్త్‌తో బంతులు విసిరి పరుగులను కట్టడి చేశారు. చివరి ఐదు ఓవర్లలో కేవలం 26 పరుగులే చేయడంతో ఆర్‌సీబీ అతికష్టంగా 150 రన్స్ దాటింది. అయితే రబాడ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో ఓపెనర్ విరాట్ వరుసగా ఐదు ఫోర్లతో 21 రన్స్ అందించాడు. మరో ఓపెనర్ బెథెల్ (5)ను పేసర్ సిరాజ్ అవుట్ చేయగా, తర్వాతి ఓవర్‌లోనే విరాట్‌ను రబాడ పెవిలియన్‌కు చేర్చడంతో ఆర్‌సీబీ 35/2 స్కోరుతో నిలిచింది. అయితే దేవ్‌దత్ మాత్రం వచ్చీరాగానే బ్యాట్ ఝుళిపించాడు. ఐదో ఓవర్‌లో 6,4,4తో 14 రన్స్ సమకూర్చాడు. దీంతో పవర్‌ప్లేలో 59/2 స్కోరుతో ఫర్వాలేదనిపించింది. అటు రజత్ (19) చక్కటి టచ్‌లో కనిపించినా.. 8వ ఓవర్‌లో వివాదాస్పదరీతిలో నిష్క్రమించాడు. అర్షద్ ఓవర్‌లో పుల్ షాట్ ఆడగా.. బౌండరీ దగ్గర బంతిని హోల్డర్ అందుకున్నాడు. అయితే తను కిందపడే సమయంలో చేతిని నేలకు అనించినట్టుగా రీప్లేలో కనిపించడంతో ఆర్‌సీబీ అభ్యంతరం వ్యక్తపరిచింది. కానీ థర్డ్ అంపైర్ మాత్రం బంతి కింద అతడి చేతి వేళ్లున్నాయనే అంచనాతో అవుట్‌గా ప్రకటించాడు. మూడో వికెట్‌కు వీరి మధ్య 44 పరుగులు జత చేరాయి. అనంతరం జితేశ్ (1), డేవిడ్ (9), క్రునాల్ (4) వరుస ఓవర్లలో వెనుదిరగడంతో 97 రన్స్‌కే జట్టు 6 వికెట్లు కోల్పోయింది. అటు దేవ్‌దత్, షెఫర్డ్ భారీ షాట్లకు వెళ్లడంతో జట్టు కోలుకున్నట్టు కనిపించింది. కానీ ఈ ఇద్దరూ వరుస ఓవర్లలో అవుటవడంతో మళ్లీ తడబడింది. ఇక డెత్ ఓవర్లలో వెంకటేశ్ (12), భువనేశ్వర్ (15 నాటౌట్)లను నియంత్రించడంతో ఎక్కువగా సింగిల్స్‌కే పరిమితమయ్యారు. ఆఖరి ఓవర్‌లో చివరి 2 వికెట్లు కోల్పోగా మరో 4 బంతులుండగానే ఆర్‌సీబీ ఈ సీజన్‌లో తొలిసారి ఆలౌటైంది.

స్కోరుబోర్డు

బెంగళూరు: బెథెల్ (సి) రషీద్ (బి) సిరాజ్ 5, విరాట్ (సి) రషీద్ (బి) రబాడ 28, దేవ్‌దత్ (బి) రషీద్ 40, రజత్ (సి) హోల్డర్ (బి) అర్షద్ 19, జితేశ్ (సి) బట్లర్ (బి) హోల్డర్ 1, డేవిడ్ (సి) హోల్డర్ (బి) రషీద్ 9, క్రునాల్ (సి) హోల్డర్ (బి) అర్షద్ 4, షెఫర్డ్ (సి) సుదర్శన్ (బి) హోల్డర్ 17, వెంకటేశ్ (సి) సుదర్శన్ (బి) అర్షద్ 12, భువనేశ్వర్ (నాటౌట్) 15, హాజెల్‌వుడ్ (రనౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 19.2 ఓవర్లలో 155 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-34, 2-35, 3-79, 4-80, 5-91, 6-96, 7-126, 8-126, 9-155,10-155; **బౌలింగ్:** సిరాజ్ 4-0-38-1, రబాడ 4-0-44-1, హోల్డర్ 4-0-29-2, అర్షద్ 3.2-0-22-3, రషీద్ 4-0-19-2.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 6, గిల్ (సి) విరాట్ (బి) భువనేశ్వర్ 43, బట్లర్ (బి) భువనేశ్వర్ 39, సుందర్ (ఎల్బీ) షెఫర్డ్ 12, షారుక్ (సి) హాజెల్‌వుడ్ (బి) షెఫర్డ్ 8, తెవాటియా (నాటౌట్) 27, హోల్డర్ (సి) దేవ్‌దత్ (బి) సుయాష్ 12, రషీద్ (నాటౌట్) 7; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 15.5 ఓవర్లలో 158/6. వికెట్ల పతనం:** 1-42, 2-57, 3-92, 4-109, 5-111, 6-141; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-28-3, హాజెల్‌వుడ్ 4-0-56-0, సుయాష్ 3.5-0-44-1, షెఫర్డ్ 4-0-30-2.

పోరాడి నెగ్గిన భారత్

3-2తో స్లొవేకియాపై గెలుపు.. వరల్డ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్


మానవ్

లండన్: ఐటీటీఎఫ్ వరల్డ్ టీమ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్‌లో భారత జట్టు థ్రిల్లింగ్ విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-7లో జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-2తో స్లొవేకియాపై పోరాడి నెగ్గింది. తొలి గేమ్‌లో మానుష్ షా 8-11, 11-5, 11-8, 5-11, 6-11తో లుబోమిర్ పిస్తేజ్ చేతిలో ఓడగా.. ఆ తర్వాతి మ్యాచ్‌లో మానవ్ ఠక్కర్ 11-6, 11-8, 11-6తో జాకబ్ జెలింకాపై నెగ్గి 1-1తో సమం చేశాడు. కానీ, హర్మీత్ దేశాయ్ 14-16, 5-11, 9-11తో వాంగ్ యాంగ్ చేతిలో ఓడినా.. రివర్స్ సింగిల్స్‌లో మానవ్ 11-3, 15-13, 11-7తో పిస్తేజ్‌పై గెలిచి 2-2తో సమం చేశాడు. నిర్ణాయక మ్యాచ్‌లో మానుష్ షా 11-8, 11-8, 11-7తో జాకబ్ జెలంకాపై నెగ్గి.. భారత్‌కు విజయాన్నందించాడు. రెండు విజయాలతో భారత్ గ్రూప్ టాప్‌నకు చేరుకొంది.



వన్డేల్లోనూ చోటు గల్లంతు?

» పంత్‌పై ఐపీఎల్ ఎఫెక్ట్

న్యూఢిల్లీ : ఈసారి ఐపీఎల్‌లో వైఫల్యాల ప్రభావం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ జాతీయ జట్టు అవకాశాలపైనా తీవ్రంగా పడేలా ఉంది. టీ20 జట్టుకు పంత్‌ను ఇప్పటికే దూరం పెట్టగా.. తాజాగా వన్డేలనుంచి కూడా అతడిని దూరం పెట్టనున్నట్టు సమాచారం. 50 ఓవర్ల ఫార్మాట్‌లో పంత్‌కు బదులు రెండో వికెట్ కీపర్, బ్యాటర్‌గా సంజూ శాంసన్‌ను ఎంపిక చేయాలని కోచ్ గంభీర్, సెలెక్షన్ కమిటీ చైర్మన్ అగార్కర్ భావిస్తున్నారట. వన్డేలలో ప్రధాన కీపర్‌గా కేఎల్ రాహుల్ బ్యాధతలు నిర్వర్తిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచ కప్‌తో పాటు ఐపీఎల్‌లోనూ రాణిస్తున్న నేపథ్యంలో సెలెక్టర్లు సంజూ పట్ల మొగ్గు చూపుతున్నట్టు సమాచారం.

సెమీస్‌పై భారత్ గురి

చైనీస్ తైపీతో క్వార్టర్స్ నేడు

థామస్ కప్ ఫైనల్స్

హోర్సెన్స్ (డెన్మార్క్): థామస్ కప్‌లో భారత పురుషుల జట్టు సెమీస్ చేరాలన్న పట్టుదలతో ఉంది. శుక్రవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో బలమైన ప్రత్యర్థి చైనీస్ తైపీతో తలపడనుంది. గ్రూప్-ఎలో కెనడా, ఆస్ట్రేలియాపై నెగ్గిన భారత్.. చైనా చేతిలో ఓడి రెండో స్థానంలో నిలిచింది. కాగా, గ్రూప్-సీ టాపర్‌గా నిలిచిన తైపీ జట్టు అగ్రశ్రేణి ఆటగాళ్లతో బలంగా ఉంది. మరోవైపు భారత జట్టు కూడా సింగిల్స్, డబుల్స్‌లో మంచి ఫామ్‌లో ఉంది. ఆయుష్ శెట్టి జోరుమీదుండగా.. మూడో సింగిల్స్ బాధ్యతలను ప్రణయ్, శ్రీకాంత్ తీసుకోనున్నారు. రెండు మ్యాచ్‌ల్లో ఓడినా లక్ష్యసేన్‌ను ఏ మాత్రం తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు. డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ శెట్టిపై భారీ అంచనాలున్నాయి. ఇతర క్వార్టర్స్ మ్యాచ్‌ల్లో మలేసియాతో చైనా, జపాన్‌తో ఫ్రాన్స్, థాయ్‌లాండ్‌తో డెన్మార్క్ ఆడనున్నాయి.

స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు సహకరించండి

శాప్ చైర్మన్ రవి నాయుడు



న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరించాలని జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంథి మల్లికార్జునరావు (జీఎంఆర్)కు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, విజయనగరం ఎమ్మెల్యే విజయలక్ష్మి గజపతిరాజు విజ్ఞప్తి చేశారు. గురువారం జీఎంఆర్‌తో జరిగిన సమావేశంలో విజయనగరంలోని విజ్జి క్రీడా ప్రాంగణ అభివృద్ధిపై చర్చించారు. ఇక్కడ స్పోర్ట్స్ స్కూల్‌ను ఏర్పాటు చేసేందుకు సహకారం అందించాలని కోరారు. యువ క్రీడాకారులకు ఆధునిక శిక్షణ సదుపాయాలు అందించడంతో పాటు, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఉత్తరాంధ్రను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు తయారు చేసిన ప్రణాళికలను రవినాయుడు వివరించారు. అనంతరం, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమై ఉత్తరాంధ్రలో క్రీడా అభివృద్ధిపై చర్చించి.. సహకారం అందించాలని కోరారు.

నేటి మ్యాచ్

వేదిక	జైపూర్
రాజస్థాన్ X ఢిల్లీ	రా.7.30 నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	8	6	1	1	13	1.043
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	9	6	3	0	12	0.832
రాజస్థాన్	9	6	3	0	12	0.617
గుజరాత్	9	5	4	0	10	-0.192
చెన్నై	8	3	5	0	6	-0.121
ఢిల్లీ	8	3	5	0	6	-1.060
కోల్‌కతా	8	2	5	1	5	-0.751
ముంబై	8	2	6	0	4	-0.784
లఖ్‌నవూ	8	2	6	0	4	-1.106

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు

పరాగ్‌కు జరిమానా



న్యూఢిల్లీ: ఈ-సిగరెట్ వివాదంలో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్‌పై బీసీసీఐ జరిమానాతో సరిపెట్టింది. మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో పరాగ్ నిషేధిత ఈ-సిగరెట్ తాగుతూ కనిపించాడు. దీంతో అతడిపై మ్యాచ్ నిషేధం విధించే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అతిక్రమించాడనే కారణంతో మ్యాచ్ ఫీజులో 25శాతం జరిమానాతో పాటు ఓ డీమెరిట్ పాయింట్‌ను చేర్చారు. రియాన్ తన తప్పును అంగీకరించినట్టు బోర్డు పేర్కొంది.

ఇక ఫ్రాంచైజీ యజమానులు డుప్లెసి, క్లాసెన్, రోడ్స్

న్యూఢిల్లీ : దక్షిణాఫ్రికా క్రికెట్ త్రయం డుప్లెసి, హెన్రిచ్ క్లాసెన్, జాంటీ రోడ్స్ యూరోపియన్ టీ20 లీగ్ జట్టును కొనుగోలు చేశారు. కన్సార్టియంగా ఏర్పడిన ఈ ముగ్గురు ఆటగాళ్లు రోటర్‌డామ్ ఫ్రాంచైజీని సొంతం చేసుకున్నట్టు లీగ్ నిర్వాహకులు గురువారం ప్రకటించారు. కొత్తగా ఆవిర్భవించిన ఆరుజట్ల ఈ లీగ్ వచ్చే ఆగస్టు 26 నుంచి సెప్టెంబరు 20 వరకు ఆరు యూరప్ నగరాలలో జరగనుంది.



రూపాయి ధమాల్!

సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి రూపీ

ఇంట్రాడేలో రూ.95.34 వద్దకు డాలర్‌తో మారకం విలువ

చివరికి 4 పైసల లాభంతో రూ.94.84 వద్ద ముగింపు

ముంబై: ముడి చమురు భగ్గుమనడంతో భారత కరెన్సీ కంగారు పడింది. గురువారం నాడు ఫారెక్స్ మార్కెట్లో రూ.95.01 వద్ద ప్రారంభమైన డాలర్-రూపాయి మారకం విలువ.. ఒక దశలో 46 పైసలు క్షీణించి సరికొత్త ఆల్‌టైం రికార్డు కనిష్ఠ స్థాయి రూ.95.34 వద్దకు చేరుకుంది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ పీపా ధర ఒక దశలో 126 డాలర్లకు ఎగబాకడం, డాలర్ బలపడటం, యూఎస్ బాండ్ల రేట్ల పెరుగుదల, మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం, నెలాఖరు కావడంతో దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం ఇందుకు కారణమయ్యాయి. అయితే, ముడి చమురు మళ్లీ కాస్త దిగిరావడంతో మన కరెన్సీ కూడా కోలుకుంది. ఫారెక్స్ మార్కెట్లో ట్రేడింగ్ ముగిసేసరికి, డాలర్‌తో రూపాయి మారకం విలువ 4 పైసల లాభంతో రూ.94.84 వద్ద స్థిరపడింది. బుధవారం ట్రేడింగ్‌లో డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు 20 పైసల నష్టంతో రూ.94.88 వద్ద ముగిసింది.

రెండోసారి..: డాలర్-రూపీ మారకం విలువలో క్రితం ఆల్‌టైం రికార్డు కనిష్ఠం ఈ మార్చి 30న రూ.95.22 వద్ద నమోదైంది. ఆ తర్వాత ఎక్స్ఛేంజ్ రేటు రూ.95 స్థాయిని దాటటం మళ్లీ ఇదే మొదటిసారి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ముడి చమురు ధరలు పెరుగుతూ పోతుండటం, ఎఫ్ఐఐల నిరవధిక పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో రూపాయి మరింత ఒత్తిడికి లోను కానుందని ఫారెక్స్ వర్గాలు భావిస్తున్నాయి. ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటే రూపాయి పతనానికి కొంత మేర అడ్డుకట్ట పడవచ్చన్నారు. ముమ్ముందు సెషన్లలో డాలర్-రూపీ మారకం విలువ రూ.94.80 -95.60 శ్రేణిలో కదలాడవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు.

చమురు చుర్రు.. సూచీలు బేజారు

» సెన్సెక్స్ ఒక దశలో 1,238 పాయింట్లు పతనం

» 583 పాయింట్ల నష్టంతో 77,000 దిగువన ముగింపు

» మళ్లీ 24,000 దిగువకు నిఫ్టీ

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం మళ్లీ నష్టాల్లో పయనించాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు 2022 నాటి గరిష్ఠ స్థాయి 125 డాలర్లకు చేరడం, అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ట్రెండ్, విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ ఇందుకు కారణమయ్యాయి. ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1,237.5 పాయింట్ల వరకు పతనమై 76,258.86 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి మార్కెట్ మళ్లీ కోలుకుంది. దాంతో సూచీ 582.86 పాయింట్ల నష్టంతో 76,913.50 వద్ద ముగిసింది. నిఫ్టీ 180.10 పాయింట్లు కోల్పోయి 23,997.55 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.5.33 లక్షల కోట్లు తగ్గి రూ.463.29 లక్షల కోట్లకు (4.86 లక్షల కోట్ల డాలర్లు) జారుకుంది.

పసిడి పెరిగే.. వెండి తగ్గే: దేశీయంగా విలువైన లోహాలు మిశ్రమ ట్రెండ్‌ను కనబరిచాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర రూ.2,000 పెరిగి రూ.1,54,800కు చేరుకుంది. కిలో వెండి మాత్రం రూ.1,800 తగ్గుదలతో రూ.2,42,700కు జారుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 4,635.52 డాలర్లు, సిల్వర్ 73.69 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

నేడు మార్కెట్లకు సెలవు: మహారాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మే 1న (శుక్రవారం) స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈతో పాటు ఫారెక్స్, కమోడిటీ మార్కెట్లకు సెలవు. మార్కెట్లు మళ్లీ సోమవారం (4వ తేదీ) యధావిధిగా పనిచేస్తాయి.

లారస్ ల్యాబ్స్ ఆదాయంలో వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లారస్ ల్యాబ్స్ మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో అద్భుత ఫలితాలు సాధించింది. కంపెనీ ఆదాయం గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 5% పెరిగి రూ.1,812 కోట్లకు చేరగా నికర లాభం 19% వృద్ధితో రూ.279 కోట్లుగా నమోదైంది. చక్కని నిర్వహణాపరమైన సామర్థ్యం కారణంగా ఎబిటా మార్జిన్ 28.9% పెరిగినట్టు కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వీవీ రవికుమార్ తెలిపారు. మార్చితో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ మొత్తం ఆదాయం రూ.6,813 కోట్లు కాగా నికర లాభం 148% వృద్ధితో రూ.889 కోట్లుగా నమోదైంది. వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.1.20 రెండో మధ్యంతర డివిడెండు ప్రకటించింది. మార్చి త్రైమాసికంలో తాము ఆదాయంతో పాటు లాభంలో కూడా మంచి వృద్ధిని నమోదు చేశామని కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ సత్యనారాయణ చావా అన్నారు.

కేఫిన్ టెక్నాలజీస్ లాభంలో క్షీణత

టెక్నాలజీ ఆధారిత ఆర్థిక సర్వీసుల సేవలందించే కేఫిన్ టెక్నాలజీస్ మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో రూ.81.15 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.85.05 కోట్లతో పోల్చితే లాభం 4.6% తగ్గింది. ఆదాయం మాత్రం రూ.282.7 కోట్ల నుంచి రూ.347.3 కోట్లకు పెరిగింది. వాటాదారులందరికీ ఒక్కో షేరుకు రూ.12 డివిడెండ్‌ను కంపెనీ బోర్డు సిఫారసు చేసింది.

బిజినెస్

చైనా ఎఫ్‌డీఐపై ప్రభుత్వం పునరాలోచన

» త్వరలోనే నోటిఫికేషన్ జారీ!

న్యూఢిల్లీ: చైనా నుంచి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)పై కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది. విదేశీ కంపెనీల ఈక్విటీలో చైనా పెట్టుబడులు 10 శాతానికి మించకుండా ఉండే కంపెనీల నుంచి వచ్చే పెట్టుబడులను విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) కింద అనుమతించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య శాఖ (డీపీఐఐటీ) జాయింట్ సెక్రటరీ జై ప్రకాశ్ శివహరే చెప్పారు. అయితే ఈ వెసులుబాటు చైనా, హాంకాంగ్‌తో పాటు భారత్‌లో భూసరిహద్దు పంచుకుంటున్న దేశాల్లో నమోదైన చైనా కంపెనీలకు మాత్రం వర్తించదని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఏయే సబ్ సెక్టార్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన రెండు నెలల్లో పూర్తి చేయాలనే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు తెలిపారు. కొన్ని కీలక రంగాల్లో చైనా ఎఫ్‌డీఐపై కఠిన వైఖరి ఏ మాత్రం మంచిది కాదని పరిశ్రమ వర్గాల నుంచి వస్తున్న ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వం దీనిపై మెత్తబడినట్టు తెలుస్తోంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,50,660 ▼	1,38,100 ▼	2,60,000 ▼
విజయవాడ	1,55,000 ▲	1,43,000 ▲	2,47,000 ▲
విశాఖపట్నం	1,50,650 ▼	1,38,000 ▼	2,70,000 ▲
రాజమండ్రి	1,46,000 ▼	1,39,000 ▼	2,60,000 ▼
ప్రొద్దుటూరు	1,51,000 ▼	1,38,920 ▼	2,45,000 ▲
ముంబై	1,50,263 ▲	1,37,641 ▲	2,40,331 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	515
వరంగల్	527	గోదావరి	515
చిత్తూరు	583	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	113
వరంగల్	120	గుంటూరు	113
కరీంనగర్	120	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	105
కర్నూలు	120	నెల్లూరు	110
విశాఖపట్నం	119	అనంతపురం	110
గోదావరి	113		

పశ్చిమాసియా యుద్ధంతో ఎఫ్‌పీఐల బేజార్

జోరుగా షేర్ల అమ్మకాలు

4 నెలలు.. రూ.1.89 లక్షల కోట్లు



ముంబై: పశ్చిమాసియా యుద్ధం విదేశీ పోర్టుఫోలియో సంస్థల (ఎఫ్‌పీఐ)ను భయపెడుతోంది. ఈ భయంతో ఈ సంస్థలు పోలోమంటూ దేశీయ స్టాక్ మార్కెట్‌కు గుడ్‌బై చెబుతున్నాయి. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే ఎఫ్‌పీఐలు భారత స్టాక్ మార్కెట్ నుంచి 2,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.89 లక్షల కోట్లు) విలువైన పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. గత ఏడాది (2025) మొత్తం మీద ఈ సంస్థలు అమ్మిన 1,890 కోట్ల డాలర్లతో పోలిస్తే ఇది 110 కోట్ల డాలర్లు (సుమారు రూ.10,432 కోట్లు) మాత్రమే తక్కువ. అయితే ఈ అమ్మకాలు గత నాలుగు నెలల్లోనే జరగడం విశేషం. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు నిఫ్టీ 50 సూచీ 8.2 శాతం, సెన్సెక్స్ 9.8 శాతం నష్టపోయాయి.

మరింత హోరుగా!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్ని రంకెలు వేసినా.. ఎన్ని బెదిరింపులకు దిగినా ఇరాన్ జీ హుజూర్ అనడం లేదు. దీంతో గల్ఫ్ యుద్ధానికి ఇప్పట్లో తెరపడే సూచనలు కనిపించడం లేదు. మరోవైపు చమురు సెగ రోజురోజుకీ భయపెడుతోంది. ఈ యుద్ధానికి ముందు బ్యారల్ 70-75 డాలర్లు పలికిన బ్రెంట్ రకం ముడి చమురు ధర ఇప్పటికే 125 డాలర్లను తాకింది. ఈ యుద్ధం రావణ కాష్టంలా మరింత కాలం కొనసాగితే మన దేశ ఆర్థిక పునాదులూ బీటలు వారే ప్రమాదం కనిపిస్తోంది. అదే జరిగితే దేశీయ స్టాక్ మార్కెట్ నుంచి ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడులను మరింత భారీగా వెనక్కి తీసుకునే ప్రమాదం కనిపిస్తోంది. అదే జరిగితే నిఫ్టీ 50 సూచీ 20,000 పాయింట్ల దిగువకు వచ్చినా ఆశ్చర్యం లేదనే అంచనాలు వినిపిస్తున్నాయి.

2025-26లో.. రూ.314 లక్షల కోట్ల యూపీఐ లావాదేవీలు

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపు సేవలను అత్యంత సులభతరంగా మార్చిన యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగిన మొత్తం లావాదేవీల విలువ గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో రూ.314 లక్షల కోట్లు దాటింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అభివృద్ధి చేసిన యూపీఐ సేవలు 2016 ఆగస్టు 11న ప్రారంభమయ్యాయి. ఆ ఆర్థిక సంవత్సరం (2016-17)లో కేవలం రూ.0.07 లక్షల కోట్ల యూపీఐ లావాదేవీలు నమోదు కాగా.. గడిచిన పదేళ్లలో విలువ 4,000 రెట్లకు పైగా పెరిగింది. అంతేకాదు, 2016-17లో కేవలం 2 కోట్ల యూపీఐ లావాదేవీలు జరగగా.. 2025-26లో ఈ సంఖ్య 24,162 కోట్లు మించిపోయింది. అంటే, లావాదేవీలు 12,000 రెట్లకు పైగా పెరిగాయి. అంతేకాదు, యూపీఐ నెలవారీ లావాదేవీలు గత ఏడాది ఆగస్టులో తొలిసారిగా 2,000 కోట్ల మైలురాయిని దాటాయి. 2025 డిసెంబరులో ఆల్‌టైం రికార్డు స్థాయిలో 2,163 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. గత ఏడాది యూపీఐ ద్వారా మొత్తం 22,000 కోట్ల లావాదేవీలు జరిగాయి. రోజుకు దాదాపు 60 కోట్లన్నమాట.

'ఎంఎస్ఎంఈ'లకు చేయూత

» ప్రత్యేక పరపతి హామీ పథకం

న్యూఢిల్లీ: గల్ఫ్ యుద్ధంతో అల్లాడుతున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీల (ఎంఎస్ఎంఈ)ను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఈ సంస్థలు తీసుకునే రుణాల చెల్లింపులకు హామీ ఇచ్చే ప్రత్యేక రుణ హామీ పథకం తీసుకురానున్నట్టు పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహకాల శాఖ (డీపీఐఐటీ) అదనపు కార్యదర్శి అతీశ్ కుమార్ సింగ్ ఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో వెల్లడించారు. ఈ పథకం కొవిడ్ సమయంలో ప్రవేశ పెట్టిన అత్యవసర పరపతి హామీ పథకం (ఈసీఎల్‌జీఎస్) తరహాలోనే ఉంటుందన్నారు. కొత్తగా ప్రారంభించే పథకం ద్వారా ఎంఎస్ఎంఈలు ఎలాంటి హామీ లేకుండానే బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకోవచ్చు. ఇప్పటికే ఉన్న రుణ చెల్లింపులపైనా మారటోరియం ఉంటుందని సింగ్ చెప్పారు.

హైసియా ప్రెసిడెంట్‌గా బిపిన్ పెండ్యాల

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ పరిశ్రమల సమాఖ్య (హైసియా) నూతన అధ్యక్షుడుగా యాపెన్ ఇండియా జనరల్ మేనేజర్ బిపిన్ పెండ్యాల ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన హైసియా 34వ సర్వసభ్య సమావేశంలో 2026-28 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అన్ని పరిశ్రమలకు కృత్రిమ మేధ పునాదిగా మారుతున్న దశలో హైసియా సారథిగా ఎన్నిక కావడం పట్ల పెండ్యాల హర్షం ప్రకటించారు. హైసియా జనరల్ సెక్రటరీగా ట్రైడెన్స్ ఇంక్ సీఓఓ జితేంద్ర పుచ్చా, కోశాధికారిగా ఇన్ఫోసిస్ గచ్చిబౌలి క్యాంపస్ వైస్ ప్రెసిడెంట్ రఘు బొడ్డుపల్లి ఎన్నికయ్యారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 1-5-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

రూపాయి ధమాల్!

సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి రూపీ


ఇంట్రాడేలో రూ.95.34 వద్దకు డాలర్‌తో మారకం విలువ

చివరికి 4 పైసల లాభంతో 94.84 వద్ద ముగింపు

IV

టీమ్ ఏపీ సత్తా

మంత్రులు, అధికారుల వల్లే 'బిజినెస్ రిఫార్మర్' అవార్డు




'డిన్నర్ విత్ ద రియల్ విన్నర్స్' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, పాల్గొన్న అధికారులు

వ్యవస్థలను సరిచేయడం అసాధ్యమనే అనుకున్నా

- కానీ ఉద్యోగుల సహకారంతో గాడిలోకి
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అధికారులు అద్భుతంగా పనిచేశారు
- గూగుల్, ఆర్సెలార్ రాక మోదీ చలవే
- పెట్టుబడులతో పెద్దఎత్తున ఉద్యోగాలు
- తక్కువ ధరకే విద్యుదుత్పత్తికి యత్నం
- నేను, పవన్ ఇగోలకు పోవడం లేదు
- అధికారులు, ఉద్యోగులు కూడా పోవద్దు
- 'డిన్నర్ విత్ ద రియల్ విన్నర్స్'లో సీఎం చంద్రబాబు సూచన

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు మంత్రులు, అధికారులు, ఉద్యోగుల కృషి వల్లే వచ్చింది. వారే నిజమైన విజేతలు' అని సీఎం చంద్రబాబు వినమ్రంగా చెప్పారు. అందరూ సహకరించడం వల్లే అభివృద్ధి చేస్తున్నామని.. సంక్షేమం అందిస్తున్నామని తెలిపారు. తాను ముంబై వెళ్లి అవార్డు అందుకుని వచ్చిన సందర్భంగా మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులకు రాజధాని అమరావతిలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో

మిగతా 4వ పేజీలో...

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో

జంట ఆఫీసు టవర్లు

- 37 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం.. మంత్రివర్గ నిర్ణయం
- రూ.1208 కోట్ల వ్యయం..
- ఒక్కో టవర్ 43 అంతస్తులు
- ఎస్పీఎఫ్‌లో 385 కానిస్టేబుల్ పోస్టుల అప్‌గ్రేడ్
- రూ.124 కోట్లతో ఢిల్లీలో కొత్త ఏపీ భవన్
- పుట్టపర్తిలో డిఫెన్స్ పరిశ్రమకు 350 ఎకరాలు
- క్యాబినెట్ కీలక నిర్ణయాలు

4

వైసీపీ రాజకీయం.. విధ్వంసం అవినీతే!

- వారికి రాష్ట్రాభివృద్ధి గిట్టదు.. గొడ్డలి పార్టీ విమర్శలను దీటుగా తిప్పికొట్టండి
- రాజధాని నిర్మాణ వ్యయంపై దుష్ప్రచారం.. భారత్‌లోనే కాదు.. ఇతర దేశాల్లో కంటే ఇక్కడే తక్కువ.. ప్రజలకు సోదాహరణంగా చెప్పాలి.. ఏఐ, ఐటీని తప్పనిసరి చేద్దాం
- మంత్రులు కూడా పరిజ్ఞానం పెంచుకోవాలి.. లేదంటే వెనుకబడిపోతారు: సీఎం
- సిక్కోలు కాదు.. సింహపురిలో.. మారిన మహానాడు వేదిక



బ్రాండిక్స్ కంపెనీ

20 ఏళ్ల క్రితమే రూపాయికి

- బ్రాండిక్స్‌కు కేటాయించిన వైఎస్
- విశాఖలో వెయ్యి ఎకరాలు 20 ఏళ్ల లీజుకు..
- ఉపాధి తెస్తుందని ఉదారంగా భూవితరణ
- ఇప్పుడు అక్కడ 26 వేల మందికి ఉపాధి
- నాడు వ్యతిరేకించని విపక్షాలు
- నేడు ఐటీ దిగ్గజాలతో లక్షల మందికి ఉపాధి
- అయినా ఆ కంపెనీలకు 99 పైసలకు భూములిస్తే వైసీపీ గగ్గోలు


(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కార్పొరేట్ బడా కంపెనీలకు చౌకగా భూములను కేటాయిస్తోంది. ఫార్చ్యూన్-100 జాబితాలో ఉండే కంపెనీలకు 99 పైసలకే భూములు ఇస్తామని ప్రకటించింది. ఇన్ఫోసిస్‌కు ఇటీవలే ఆ రేటుకు 20 ఎకరాలు కేటాయించింది. దీనిని తప్పుబడుతూ, ప్రభుత్వం విలువైన భూములను దోచిపెడుతోందని వైసీపీ నేతలు గగ్గోలు పెడుతున్నారు. '99 పైసలకు భూములిస్తారా? ఈ విడ్డూరం ఎక్కడైనా ఉందా' అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అయితే, కాస్త వెనక్కి వెళ్లి చూస్తే, ఆ పార్టీ అధినేత జగన్ తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 20 ఏళ్ల క్రితమే ఎకరం రూపాయి చొప్పున బ్రాండిక్స్ అనే శ్రీలంక కంపెనీకి వెయ్యి ఎకరాలు ఇచ్చారు. లోదుస్తులు తయారుచేసి, విదేశాలకు ఎగుమతి చేస్తామని, 60 వేల మందికి ఉపాధి కల్పిస్తామని అప్పట్లో ఈ సంస్థ ముందుకు వచ్చింది. ప్రజల జీవన విధానం

మిగతా 4వ పేజీలో...

సింఘాల్ దోషి!

కల్తీ నెయ్యికి దారితీసిన పరిస్థితుల్ని ఈవోగా అనిల్‌కుమార్ అడ్డుకోలేకపోయారు



- ఆయన హయాంలోనే నెయ్యి రూల్స్ సడలింపు
- అయినా, బోర్డును ప్రశ్నించని సింఘాల్
- రాష్ట్ర ప్రభుత్వానికి దినేశ్‌కుమార్ నివేదిక
- ప్రొక్యూర్‌మెంట్ జీఎం,ఎఫ్ఏసీఏవోలదీ తప్పే
- టీటీడీకి సరఫరా, పంపిణీ లోపరహితంగా ఉండాలి
- బిడ్డింగ్‌లో నాణ్యతకే పెద్దపీట వేయాలి
- సర్కారుకు రిటైర్డు సీఎస్ సూచనలు
- సీబీఐ సిట్ నివేదికతో ఇప్పటికే సింఘాల్‌ను ఈవోగా తొలగింపు.. పోస్టింగ్ ఇవ్వని సర్కార్

టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంలో నాటి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సహా అధికారుల వైఫల్యాలను ఎత్తిచూపుతూ, వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ రిటైర్డు సీఎస్ దినేశ్‌కుమార్ ఏకసభ్య కమిషన్ నివేదిక ఇచ్చింది. నెయ్యి నిబంధనలు సడలించడం ద్వారా కల్తీ నెయ్యి దందాకు వైసీపీ హయాంలో తెరలేపిన కాలంలో సింఘాలే ఈవోగా ఉన్నా, అడ్డుకోలేకపోయారని తేల్చింది. ఆయనతోపాటు అప్పటి ప్రొక్యూర్‌మెంట్ జీఎం, ఎఫ్ఏసీఏవోలను కమిషన్ దోషులుగా నిర్ధారించింది.

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాలకు కల్తీ నెయ్యి సరఫరా విషయంలో నాటి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ దోషి అని సర్కారు నియమించిన రిటైర్డ్ చీఫ్ సెక్రెటరీ దినేశ్‌కుమార్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ నిర్ధారించింది. నెయ్యి టెండర్ల నిబంధనలను కఠినతరం చేసిన వ్యక్తే, వాటిని మరింత సులభతరం చేశారని వ్యాఖ్యానించింది. దానివల్లే అక్రమాలకు పెద్ద ఎత్తున ఆస్కారం ఏర్పడిందని, అక్రమార్కులు విజృంభించారని తేల్చింది. దినేశ్‌కుమార్ గురువారం సాయంత్రం అమరావతికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబును, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌ను కలిసి ఈ మేరకు నివేదికను సమర్పించారు. తిరుమల కల్తీ నెయ్యి సరఫరా విషయంలో సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణ జరిపిన సంగతి తెలిసిందే. అధికారుల వైఫల్యాలను ఎత్తిచూపుతూ, వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. వీటి ఆధారంగా అసలు కల్తీనెయ్యి కేసులో అధికారుల పాత్ర ఏంటి? ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవాలనే

మిగతా 6వ పేజీలో...

పదిలో పెరిగిన ఉత్తీర్ణత

85.25 శాతం విద్యార్థులు పాస్

- గతేడాది కంటే 4.15% ఎక్కువ
- 5,26,954 మంది ఉత్తీర్ణత
- 83.69% మందికి ఫస్ట్ డివిజన్
- మరోసారి అమ్మాయిలే టాప్
- అబ్బాయిల కంటే 5.22% ఎక్కువ
- బాలికలు 2,67,321(87.9%)
- అబ్బాయిలు 2,59,633(82.68%)
- మన్యం ఫస్ట్.. అల్లూరి లాస్ట్
- టాప్‌లో రెసిడెన్షియల్ స్కూళ్లు
- విశాఖ బాలిక జ్ఞానేశ్వరి 599 మార్కులతో స్టేట్ టాపర్
- 47 మందికి 598 మార్కులు
- 2161 స్కూళ్లలో 100% ఫలితాలు
- 16 పాఠశాలల్లో ఉత్తీర్ణత 0

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తీర్ణత పెరిగింది. గతేడాది కంటే ఈసారి 4.15 శాతం మెరుగుపడింది. గతేడాది 81.14% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది 85.25% పాసయ్యారు. మొత్తంగా 6,18,131 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయగా 5,26,954 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక ఈ ఏడాది కూడా బాలికలదే పైచేయి. అబ్బాయిలు 2,59,633 (82.68%) మంది, అమ్మాయిలు 2,67,321 (87.9%) మంది ఉత్తీర్ణత సాధించారు. అబ్బాయిల కంటే అమ్మాయిలు 5.22% ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతి పరీక్షల ఫలితాలను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ గురువారం ఎక్స్ ద్వారా



విశాఖకు చెందిన స్టేట్ టాపర్ కొత్తపల్లి జ్ఞానేశ్వరి(599)కి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

మిగతా 6వ పేజీలో...

విద్యలో విప్లవాత్మక మార్పులు రావాలి

- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా యూనివర్సిటీల్లో కోర్సుల రూపకల్పన జరగాలి
- లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీల్లో కొత్త కోర్సులు.. విదేశీ భాషలు నేర్పేందుకు ప్రత్యేక విభాగాలు
- విద్యార్థులు వైవిధ్యంగా ఆలోచించేలా ఏఐ సదస్సు.. నైపుణ్యాలపై స్కిల్ ఆడిట్ చేయండి
- విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖలపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

4

రాష్ట్రానికి రూ.1500 కోట్ల 'ఉపాధి' నిధులు

- ఈ ఏడాది ఫిబ్రవరి వరకు బిల్లులు క్లియర్
- ఏప్రిల్‌లో 3 కోట్ల పని దినాలు కల్పన
- మే నెలకు 6 కోట్ల లేబర్ బడ్జెట్ మంజూరు

లోపలి పేజీల్లో



మీ చట్టాలను మార్చండి

- అత్యాచార బాధితురాలి గర్భవిచ్ఛిత్తికి ఉన్న కాలపరిమితిని తొలగించండి
- '15 ఏళ్ల బాలిక 7 నెలల గర్భవిచ్ఛిత్తి' కేసులో కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన



3

అహ్మద్‌బాబూ.. ఇదేం పని?!

- వాణిజ్య పన్నుల శాఖలో ప్రతీకార చర్యలు
- 2022 నాటి ధర్నా కేసుపై నివేదిక కోరిన జీఏడీ
- అదే కేసులో 72 మందిపై అహ్మద్‌బాబు చర్యలు
- వార్షిక ఇంక్రిమెంట్‌లో కోత పెడుతూ ఉత్తర్వులు
- గతంలోనే ఆ మెమోను సస్పెండ్ చేసిన హైకోర్టు
- చర్యలు ఉపసంహరించుకున్న కూటమి ప్రభుత్వం
- ప్రధాన కమిషనర్ తీరుపై ఉద్యోగుల మండిపాటు

పురోగతిలోనే చాబహార్ ప్రాజెక్టు

» హోర్ముజ్‌లో భారత నౌకలకు ఆటంకాల్లేవు

» భారత్‌లో ఇరాన్ రాయబారి మొహమ్మద్ ఫతాలి వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: ఆంక్షలున్నప్పటికీ వ్యూహాత్మకంగా కీలకమైన చాబహార్ పోర్టు నిర్మాణ పనులు నిలకడగా కొనసాగుతున్నాయని భారత్‌లో ఇరాన్ రాయబారి డాక్టర్ మొహమ్మద్ ఫతాలి చెప్పారు. ఈ విషయంలో మీడియాలో వచ్చినవన్నీ ఊహాగానాలేనని ఒక ఆంగ్ల న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తోసిపుచ్చారు. ప్రత్యేకించి మధ్య ఆసియా, అఫ్ఘానిస్థాన్ దేశాలతో వ్యాపార వృద్ధి కోసం భారతదేశానికి చాబహార్ పోర్టు కీలకమైనదన్నారు. అంతర్జాతీయంగా ఒత్తిడి ఉన్నప్పటికీ ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యం తగ్గలేదని చెప్పారు. ఈ ఏడాది చివరినాటికి పనులు పూర్తవుతాయని భావిస్తున్నామన్నారు. అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా హోర్ముజ్ జలసంధి గుండా భారత్ సహా మిత్రదేశాల నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ కట్టుబడి ఉందని చెప్పారు. అయితే, నౌకాయాన నిబంధనలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సిక్కులు సహా ఇరాన్‌లో నివసిస్తున్న 10 వేల మంది భారతీయుల హక్కులు, భద్రతకు ఇరాన్ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

21% తగ్గిన రష్యన్ చమురు దిగుమతులు

» కమోడిటీ అనలిటిక్స్ సంస్థ కెప్లర్ వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: రష్యా నుంచి భారత్‌కు ముడిచమురు దిగుమతులు 21శాతం తగ్గాయి. చమురు కొనుగోళ్లపై ఆంక్షల మినహాయింపును అమెరికా నెల రోజుల పాటు పొడిగించినప్పటికీ ఈ ఏడాది మార్చిలో జరిపిన రికార్డు స్థాయి కొనుగోళ్లతో పోలిస్తే ఏప్రిల్‌లో 4.2 లక్షల బ్యారెళ్ల తగ్గుదల నమోదైంది. ఈ మేరకు కమోడిటీ అనలిటిక్స్ సంస్థ కెప్లర్ గణాంకాలు వెల్లడించాయి. ఉక్రెయిన్ యుద్ధ ప్రభావంతో రష్యాలోని ప్రధాన టెర్మినల్‌లో లోడింగ్ అంతరాయాల కారణంగా ఏప్రిల్‌లో రోజుకు 15.6 లక్షల బ్యారెళ్ల దిగుమతి మాత్రమే సాధ్యపడింది.

ఫైబర్ ఆప్టిక్ డ్రోన్లతో ఇజ్రాయెల్‌కు సవాల్

» ఉక్రెయిన్ శైలి టెక్నాలజీతో దెబ్బకొడుతున్న హిజ్బొల్లా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: ఇజ్రాయెల్ అత్యాధునిక రక్షణ వ్యవస్థలను సవాలు చేసేందుకు హిజ్బొల్లా ఉక్రెయిన్ తరహా ఫైబర్-ఆప్టిక్ డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తోంది. ఉత్తర ఇజ్రాయెల్‌పై దాడుల్లో కొత్త తరం ఫైబర్-ఆప్టిక్ నియంత్రిత డ్రోన్లను రంగంలోకి దింపింది. సాంప్రదాయ రేడియో తరంగాలకు బదులుగా డ్రోన్‌కు, ఆపరేటర్‌కు మధ్య ఉండే అతి సన్నని ఫైబర్-ఆప్టిక్ కేబుల్స్ ద్వారా వీటిని నియంత్రిస్తారు. ఈ డ్రోన్లు రేడియో సంకేతాలను ఉపయోగించవు కాబట్టి ఇజ్రాయెల్ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలు వీటిని జామ్ చేయలేవు. అలాగే చిన్నగా ఉండే ఈ డ్రోన్లు రాడార్లకు కూడా చిక్కవు. దీంతో ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలకు వీటిని అడ్డుకోవడం సవాల్‌గా మారింది. దక్షిణ లెబనాన్, సరిహద్దు పట్టణాల సమీపంలోని తమ సైనికులపై హిజ్బొల్లా ఈ డ్రోన్లను ఎక్కువగా ప్రయోగిస్తోందని ఇజ్రాయెల్ సైనిక అధికారులు చెబుతున్నారు. రష్యాతో యుద్ధం సందర్భంగా ఉక్రెయిన్ ఫైబర్-ఆప్టిక్ నియంత్రిత డ్రోన్లను ఉపయోగించింది. ఇప్పుడు ఇదే టెక్నాలజీతో... పేలుడు పదార్థాలను ఉపయోగించి స్థానికంగా తయారు చేసిన డ్రోన్లతో హిజ్బొల్లా ఇజ్రాయెల్‌పై దాడులు చేస్తోందని నిపుణులు భావిస్తున్నారు.

'బ్రహ్మోస్' చాలా ఖరీదు

» డ్రోన్లు, క్షిపణులకూ కొన్ని పరిమితులున్నాయి

» జాతీయ భద్రతా సదస్సులో ఎయిర్ మార్షల్ అశుతోశ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: ఆధునిక యుద్ధ వ్యూహంలో అత్యాధునిక డ్రోన్లు, క్షిపణులు కీలక పాత్ర పోషిస్తున్న మాట వాస్తవమే అయినా.. వాటికీ కొన్ని పరిమితులున్నాయని ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ ఎయిర్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ అన్నారు. బ్రహ్మోస్ క్షిపణి అత్యంత ఖరీదైందని వ్యాఖ్యానించారు. డ్రోన్లు, క్షిపణులు పరిమిత సామర్థ్యం కలిగిన సాధనాలని, వాటిని వ్యూహాత్మకంగా వాడాలని చెప్పారు. గురువారం జరిగిన ఏఎన్ఐ జాతీయ భద్రతా సదస్సు 2.0లో దీక్షిత్ మాట్లాడుతూ.. యుద్ధాలు గెలవాలంటే సాంప్రదాయ పోరాట విధానం, డ్రోన్లు, క్షిపణుల సమన్వయంతో కూడిన సంయుక్త పోరాట విధానం అవసరమని స్పష్టం చేశారు. సాంప్రదాయ యుద్ధ విమానాలను డ్రోన్లు, క్షిపణుల వంటి నూతన సాంకేతికతతో అనుసంధానం చేయాలని ఆయన అన్నారు.

కవిత పార్టీ టీఆర్ఎస్సే?!

» తెలంగాణ రక్షణ సేనకు ఈసీ ప్రాథమిక అనుమతి



హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించినట్టుగానే.. ఆమె పార్టీకి టీఆర్ఎస్ అనే సంక్షిప్త నామం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్టీ పేరుకు సంబంధించి కవిత ఐదు పేర్లను ప్రతిపాదించగా.. తెలంగాణ రక్షణ సేన పేరుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రాథమిక అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఈసీఐ పంపిన లేఖను కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధి గురువారం స్వయంగా అందజేశారు. తెలంగాణ ప్రజా జాగృతి అధ్యక్షురాలి హోదాలో కవిత తన కొత్త రాజకీయ పార్టీ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై స్పందించిన కేంద్ర ఎన్నికల కమిషన్ సెక్షన్ 29ఏ (ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951) ప్రకారం తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరుతో బహిరంగ నోటీసు (పబ్లిక్ నోటీస్) ఇచ్చేందుకు అనుమతించింది. పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా ఈసీఐ పంపిన లేఖలో కొన్ని నిబంధనలను విధించింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేసేలా రెండు జాతీయ, రెండు స్థానిక పత్రికల్లో వరుసగా రెండు రోజులు ప్రకటనలు ఇవ్వాలని సూచించింది. ఈ నోటీసు వెలువడిన 30 రోజుల్లోపు ఏవైనా అభ్యంతరాలు వస్తే స్వీకరిస్తామని, ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ తుది దశకు చేరుకుంటుందని అందులో పేర్కొన్నారు. ప్రకటనల క్లిప్పింగులతోపాటు పార్టీ నిబంధనావళి, ఇతర పత్రాలను నెలలోగా ఈసీకి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

అమెరికాకు గుండెపోటే!

ఆ ఆయుధం శత్రువులకు దగ్గర్లోనే ఉంది.. పూర్తిగా మా నియంత్రణలోనే హోర్ముజ్

» శత్రువులు దగ్గరికి వస్తే దాడులే..

» ఇరాన్ నేవీ కమాండర్ షహ్రామ్ ఇరానీ హెచ్చరిక

» ఆ ఆయుధం 'హూట్' సూపర్ టార్పెడో అనే అంచనాలు

టెహ్రాన్/వాషింగ్టన్/దుబాయ్, ఏప్రిల్ 30: అమెరికా, ఇరాన్ మధ్య చర్చల అంశం ఓ కొలిక్కి రాకపోవడం, హోర్ముజ్ జలసంధిలో అమెరికా దిగ్బంధం నేపథ్యంలో.. పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. అమెరికా, ఇరాన్ మధ్య పరస్పర హెచ్చరికలు, సవాళ్లు, విమర్శలు కొనసాగుతున్నాయి. ఇరాన్ త్వరలోనే తమ శత్రువులు భయపడే ఒక కొత్త రహస్య ఆయుధాన్ని ప్రయోగించబోతోందని ఆ దేశ నౌకాదళ కమాండర్ షహ్రామ్ ఇరానీ గురువారం పేర్కొన్నారు. ఆ ఆయుధం శత్రువులకు చాలా దగ్గరలోనే ఉందని, ఆ దాడితో శత్రువులకు గుండెపోటు రాకుండా ఉంటుందని ఆశిస్తున్నానని వ్యాఖ్యానించారు. హోర్ముజ్ జలసంధిని తెరవడంపై ఇరాన్ చేసిన ప్రతిపాదనలను ట్రంప్ తిరస్కరించిన అనంతరం ఈ ప్రకటన చేశారు. ఇరాన్ సామర్థ్యంపై శత్రువులు తప్పుడు అంచనాలు వేసుకున్నారని, ఇప్పుడది ఒక జోక్‌లా మారిపోయిందని షహ్రామ్ ఇరానీ పేర్కొన్నారు. తాము అమెరికా యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధ నౌకపై ఏడు సార్లు క్షిపణి దాడులు చేశామని.. దానితో కొంతకాలం పాటు ఆ యుద్ధనౌక ఆపరేషన్లు చేపట్టలేకపోయిందని చెప్పారు. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌పై 100 దశలుగా దాడులు చేశామన్నారు. హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తమ నియంత్రణలోకి తెచ్చుకున్నామని, శత్రువులు ఏమాత్రం దగ్గరగా వచ్చినా వెంటనే దాడులు చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. అమెరికా దిగ్బంధం ఉన్నా కూడా కొన్ని ఇరాన్ నౌకలు జలసంధిని దాటాయని ఆయన చెప్పారు.



ఇరాన్ నేవీ కమాండర్ షహ్రామ్ ఇరానీ

ఇక గల్ఫ్‌కు అమెరికా లేని భవిష్యత్తు: మొజ్తాబా ఖమేనీ

దేవుడి దయవల్ల ఇకపై గల్ఫ్ భవిష్యత్తు అంతా అమెరికా లేకుండా ఉంటుందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ వ్యాఖ్యానించారు. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా, ఇతర శత్రుదేశాల స్థానం సముద్రపు అడుగున మాత్రమేనని హెచ్చరించారు. ఈ మేరకు మొజ్తాబా ప్రకటనను ఇరాన్ అధికారిక టీవీలో యాంకర్ బిగ్గరగా చదివి వినిపించారు. ఇరాన్ జాతీయ సంపదగా అణు, క్షిపణి సామర్థ్యాలను కాపాడుకుంటామని మొజ్తాబా స్పష్టం చేశారు. "దేశంలో, విదేశాల్లో ఉన్న 9 కోట్ల మంది ఇరాన్ ప్రజలు నానో టెక్నాలజీ, బయో టెక్నాలజీ నుంచి అణు, క్షిపణి సామర్థ్యాల వరకు భద్రంగా కాపాడుకుంటారు. దేవుడి శక్తి, సాయంతో అమెరికా లేకుండా పర్షియన్ గల్ఫ్ ప్రాంతానికి అద్భుతమైన భవిష్యత్తు ఉంటుంది. పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్ సముద్ర ప్రాంతాల్లో ఇరుగుపొరుగు దేశాలన్నింటికీ ఒకే విధమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఎక్కడో వేల కిలోమీటర్ల దూరం నుంచి దురాశతో వచ్చే వారికి ఇక్కడ స్థానం లేదు. వారి స్థానం సముద్రం అడుగునే.." అని మొజ్తాబా పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా అవమానకరమైన పరాజయం పొందిందన్నారు. ఇప్పుడీ ప్రాంతంలో కొత్త అధ్యాయం మొదలవబోతోందని చెప్పారు.

బ్యారెల్ చమురు.. 125 డాలర్లు!

» హోర్ముజ్‌పై అనిశ్చితితో మార్కెట్లో చమురు మంటలు


» యుద్ధం మొదలైన నాటి నుంచి ఏకంగా 80% మేర పెరిగిన బ్రెంట్ క్రూడ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: హోర్ముజ్ జలసంధి తెరుచుకోవడంపై అనిశ్చితితో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలకు రెక్కలు వచ్చాయి. బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర స్పాట్ మార్కెట్లో గురువారం ఏకంగా 6.2శాతం పెరిగి 125.36 డాలర్లకు చేరింది. యుద్ధం మొదలవడానికి ముందున్న 70 డాలర్ల ధరతో పోలిస్తే.. ఇది ఏకంగా 80శాతం అధికం కావడం గమనార్హం. ఇక చమురు ఫ్యూచర్ మార్కెట్లో జూలైలో సరఫరా చేయాల్సిన బ్రెంట్ క్రూడ్ ధర కూడా బ్యారెల్‌కు 113.85 డాలర్లకు చేరింది. అంటే పశ్చిమాసియాలో ఇప్పట్లో పరిస్థితులు చక్కబడేలా లేవని మార్కెట్ వర్గాలు భావిస్తున్నట్టు నిపుణులు విశ్లేషిస్తున్నారు.

యుద్ధం కారణంగా అమెరికా ఖర్చు రూ.2.35 లక్షల కోట్లు!

ఇరాన్‌తో యుద్ధంలో అమెరికాకు వచ్చే లాభం విషయం అటుంచితే.. ఆ దేశానికి ఖర్చు తడిసి మోపెడవుతోంది. బిలియన్ల కొద్దీ డాలర్లు యుద్ధరంగంలో ఆవిరైపోతున్నాయి. ఇప్పటి వరకు యుద్ధంలో 25 బిలియన్ డాలర్ల మేర (భారత కరెన్సీలో సుమారు రూ.2.35 లక్షల కోట్లు) ఖర్చు అయినట్లు అమెరికా రక్షణశాఖ సీనియర్ అధికారి వెల్లడించారు.

ఆ ఆయుధం.. 'హూట్' సూపర్ టార్పెడోనా?



తాము బయటికి తీసే రహస్య ఆయుధం అమెరికాకు గుండెపోటు తెప్పిస్తుందన్న ఇరాన్ హెచ్చరికల నేపథ్యంలో.. ఆ ఆయుధం 'హూట్ సూపర్ టార్పెడో' అయి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. నౌకలు, జలాంతర్గాముల నుంచి ప్రయోగించే టార్పెడోలు అందరికీ తెలిసిందే. నీటిలో వాటి వేగం గంటకు 60-100 కిలోమీటర్ల మధ్య ఉంటుంది. అయితే తాము అభివృద్ధి చేసిన 'హూట్ సూపర్ టార్పెడో వేగం గంటకు 360 కిలోమీటర్ల వేగంతో బుల్లెట్‌లా దూసుకెళ్లి, శత్రువుల నౌకలు, జలాంతర్గాములను ధ్వంసం చేస్తుందని ఇరాన్ చెబుతోంది. 2006లో తొలిసారిగా ఈ టార్పెడోను ఇరాన్ పరీక్షించింది. హూట్ అంటే పర్షియన్ భాషలో తిమింగలం అని అర్థం. సాధారణంగా సముద్రాల్లో నీటి ఒత్తిడి, ఘర్షణ కారణంగా టార్పెడోల వేగం పరిమితంగా ఉంటుంది. అదే హూట్ టార్పెడో తన చుట్టూ ఒక గాలి బుడగను ఏర్పాటు చేసుకుంటుంది. దాని వల్ల నీటి ఘర్షణ తగ్గి.. టార్పెడో వేగంగా దూసుకెళ్లేందుకు వీలవుతుంది. దీనిని సూపర్ క్యావిటేషన్ అంటారు. ఇంతకు ముందు ప్రపంచంలో ఒక్క రష్యా మాత్రమే వీఏ-111 ష్కావల్ పేరిట ఈ తరహా 'సూపర్ క్యావిటేషన్' టార్పెడోను అభివృద్ధి చేసింది. రెండో దేశం ఇరాన్ కావడం గమనార్హం. 200 కిలోల వార్‌హెడ్ ఉన్న హూట్ టార్పెడో భారీ పేలుడు సృష్టించగలదు. అయితే దీని పరిధి కేవలం 15 కిలోమీటర్లే. పూర్తిస్థాయిలో రక్షణ ఉండే అమెరికా అబ్రహం లింకన్, గెరాల్డ్ ఫోర్డ్ వంటి యుద్ధ నౌకలకు అంత దగ్గరగా వెళ్లి ప్రయోగించడం చాలా కష్టం. దానికితోడు టార్పెడోల దాడులను తట్టుకునేలా ఆ నౌకలను నిర్మించారు. ఈ క్రమంలో హూట్ టార్పెడోలతో ఏ మేరకు నష్టం కలగనుందనేది ప్రశ్నార్థకమేనని రక్షణ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

లోకం తీరు



మీ చట్టాలను మార్చండి

» అత్యాచార బాధితురాలి గర్భవిచ్ఛిత్తికి ఉన్న కాలపరిమితిని తొలగించండి

» '15 ఏళ్ల బాలిక 7 నెలల గర్భవిచ్ఛిత్తి' కేసులో కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: బాధిత బాలికను గర్భాన్ని కొనసాగించాలని బలవంతం చేయకూడదని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. 20 వారాలు దాటిన తర్వాత కూడా అవాంఛిత గర్భాన్ని తొలగించుకునేందుకు అత్యాచార బాధితులకు అనుమతినిచ్చేలా చట్టాన్ని సవరించాలని కేంద్రానికి సూచించింది. 15ఏళ్ల బాలిక 7 నెలల గర్భవిచ్ఛిత్తికి అనుమతినిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల ఉత్తర్వులు జారీ చేయగా.. వాటిని రద్దు చేయాలంటూ ఎయిమ్స్ క్యూరేటివ్ పిటిషన్ వేసింది. ఈ దశలో అబార్షన్ చేస్తే బాలిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొంది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిల ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. 'అత్యాచారం కారణంగా గర్భం దాల్చినప్పుడు గర్భవిచ్ఛిత్తికి కాలపరిమితి లేకుండా మీ చట్టాన్ని సవరించండి. చట్టం సహజంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉండాలి. అటువంటి విచారణలు వారంలోపే పూర్తయ్యేలా ఉండాలి. విచారణ ముగిసేవరకు ఆ బిడ్డ ఎందుకు వేదనను భరించాలి?' అని కేంద్రాన్ని ఉద్దేశించి సీజేఐ ప్రశ్నించారు. ఎయిమ్స్ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. 'ఈ దశలో బాలికకు గర్భవిచ్ఛిత్తి సాధ్యం కాదు.. ఒకవేళ చేస్తే ఆమెకు జీవితాంతం ఆరోగ్య సమస్యలు వస్తాయి' అని వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'గర్భవిచ్ఛిత్తికి అనుమతించకపోతే అది ఆమె జీవితానికే మచ్చ అవుతుంది. ఆమె చదువుకోవాల్సిన వయసులో ఓ బిడ్డకు తల్లిని చేస్తే ఎలా..?' అని ప్రశ్నించింది. ఏదేమైనా గర్భాన్ని కొనసాగించాలా.. వద్దా..? అనేది నిర్ణయించుకోవాల్సింది సదరు బాలికేనని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఇరాన్‌పై మళ్లీ దాడి చేస్తే.. తీవ్ర పరిణామాలు తప్పవు

» మొత్తం ప్రపంచంపై విపరీత ప్రభావం

» ట్రంప్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరిక

» గంటన్నర పాటు ఫోన్‌లో మాట్లాడుకున్న నేతలు

మాస్కో/వాషింగ్టన్, ఏప్రిల్ 30: ప్రస్తుతమున్న పరిస్థితులలో ఇరాన్‌పై మళ్లీ దాడులు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. ఇరాన్‌తో కాల్పుల విరమణను స్వాగతించారు. అది సరైన చర్య అని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నివారణకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. గురువారం తెల్లవారుజామున ఇరువురు నేతలు గంటన్నర పాటు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఉక్రెయిన్-రష్యా యుద్ధం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉషకోవ్ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఇరాన్‌పై మళ్లీ దాడులు చేస్తే ఏర్పడే పరిణామాలు కేవలం గల్ఫ్ దేశాలపైనే కాకుండా మొత్తం ప్రపంచంపైనే విపరీత ప్రభావం చూపుతాయని ట్రంప్‌కు పుతిన్ స్పష్టం చేశారని తెలిపారు. ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయకుండా అమెరికా, ఇజ్రాయెల్ సంయమనం వహించాలని కోరినట్టు వెల్లడించారు. మరోవైపు పుతిన్‌తో చర్చల అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణకు రష్యా సిద్ధంగా ఉన్నట్టు పుతిన్ సంకేతాలు ఇచ్చారని తెలిపారు. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందన్నారు. నిజానికి కాల్పుల విరమణకు పుతిన్ ఎప్పటినుంచో సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు.

బాంబుల కంటే దిగ్బంధం బాగుంది

» ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిలిపేయాల్సిందే: ట్రంప్

» హోర్ముజ్ కాదు.. ట్రంప్ జలసంధి!

» మ్యాప్‌ను షేర్ చేసిన అమెరికా అధ్యక్షుడు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షేర్ చేసిన మ్యాప్

వాషింగ్టన్, ఏప్రిల్ 30: అమెరికా దిగ్బంధాన్ని తొలగిస్తే.. హోర్ముజ్ జలసంధిని తెరుస్తామని, అణు కార్యక్రమం అంశంపై చర్చలను తర్వాత చేపడదామని ఇరాన్ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. "ఇరాన్‌పై బాంబులు వేయడం కంటే దిగ్బంధం బాగుంది. ఇరాన్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇరాన్ అణు కార్యక్రమం నిలిచిపోవాల్సిందే. వారి వద్ద అణ్వస్త్రాలు ఉండకూడదు" అని యాక్సియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధాన్ని తప్పుపడుతూ వ్యాఖ్యలు చేసిన జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్‌పై మరోసారి మండిపడ్డారు. ఇరాన్ అణు ముప్పును తొలగించడానికి జరుగుతున్న ప్రయత్నాలను తప్పుబట్టే బదులు.. జర్మనీ ఎదుర్కొంటున్న వలస, ఇంధన సమస్యలపై దృష్టిపెట్టాలని సూచించారు. నాటోలో భాగంగా జర్మనీలో ఉన్న అమెరికా బలగాలను ఉపసంహరించుకోనున్నట్టు తెలిపారు.

ఇరాన్ చమురు ట్యాంకర్ల జప్తునకు సిద్ధం!

హోర్ముజ్ జలసంధికి ట్రంప్ జలసంధిగా పేరుపెట్టిన ఒక మ్యాప్‌ను ట్రంప్ ట్రూత్ సోషల్‌లో షేర్ చేశారు. అవసరమైతే హోర్ముజ్ దిగ్బంధాన్ని కొన్ని నెలలపాటు సాగించేందుకు ట్రంప్ సిద్ధమైనట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఇది ఆసక్తిగా మారింది. గతంలోనూ ట్రంప్ ఒకసారి హోర్ముజ్‌ను ట్రంప్ జలసంధి అంటూ పోస్టుపెట్టడం గమనార్హం. కాగా, అమెరికా అడ్డుకున్న రెండు ఇరాన్ చమురు ట్యాంకర్లను జప్తు చేసేందుకు ఆ దేశ న్యాయశాఖ సిద్ధమైనట్టు అధికారవర్గాలు తెలిపాయి. జప్తు ప్రక్రియ పూర్తయితే.. అమెరికా ఆ ట్యాంకర్లను, వాటిలోని చమురును స్వాధీనం చేసుకుంటుంది. సొంతంగా వినియోగించుకోవడానికి లేదా అమ్ముకోవడానికి చట్టపరంగా వీలుకలుగుతుంది.

ఇరాన్‌పై తీవ్రస్థాయిలో దాడికి ప్రణాళిక?

ఇరాన్‌పై అకస్మాత్తుగా, తీవ్రస్థాయిలో దాడి చేసేందుకు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. రక్షణ శాఖ అధికారులను ఉటంకిస్తూ యాక్సియోస్ వార్తాసంస్థ ఈ మేరకు కథనం ప్రచురించింది. స్వల్ప సమయంలోనే, అతి తీవ్రస్థాయిలో విరుచుకుపడాలని భావిస్తున్నారని.. సెంట్రల్ కమాండ్ చీఫ్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ఈ అంశంపై ట్రంప్‌కు నివేదిక అందజేయనున్నట్టు తెలిసిందని పేర్కొంది.

దగా జరగకుండా కాపలా కాయండి

» టీఎంసీ శ్రేణులకు మమత పిలుపు



న్యూఢిల్లీ/కోల్‌కతా, ఏప్రిల్ 30: పశ్చిమబెంగాల్‌లో బీజేపీకి అనుకూలంగా ఫలితాలు వస్తాయని మెజార్టీ ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేసిన నేపథ్యంలో, సీఎం మమతా బెనర్జీ తన పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. గురువారం పార్టీ నేతలు, కార్యకర్తలనుద్దేశించి ఓ వీడియో సందేశంలో మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో దగా జరగకుండా మే 4న కౌంటింగ్ కేంద్రాల వద్ద నిరంతరం నిఘా పెట్టి కాపలా కాయాలని పిలుపునిచ్చారు. ఎగ్జిట్‌పోల్ అంచనాలు టీఎంసీ కార్యకర్తల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు పన్నిన కుట్ర అని మండిపడ్డారు. గత ఎన్నికల్లోనూ ఎగ్జిట్‌పోల్స్ బీజేపీకి అనుకూలంగా వచ్చాయని, చివరకు ఫలితాలు భిన్నంగా వచ్చాయని ఆమె గుర్తుచేశారు.

స్ట్రాంగ్‌రూంలలో బీజేపీ అక్రమాలకు పాల్పడుతోంది: టీఎంసీ

ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగే అవకాశముందని మమత ఆందోళన వ్యక్తం చేసిన కొద్దిగంటల్లోనే.. టీఎంసీ నాయకులు కునాల్ ఘోష్, శశి పంజా కోల్‌కతాలోని ఈవీఎంలు భద్రపరిచిన నేతాజీ ఇండోర్ స్టేడియం ఎదుట ధర్నాకు దిగారు. ఈ కేంద్రంలోని స్ట్రాంగ్‌రూంలో ఈవీఎంలను బీజేపీ నేతలు ట్యాంపరింగ్ చేస్తున్నారంటూ ఆరోపించారు. పార్టీ ఏజెంట్లు ఎవరూ లేని సమయంలో.. బ్యాలెట్ బాక్సులను అక్రమంగా తెరిచారని, దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ దృశ్యాలు తమవద్ద ఉన్నాయని టీఎంసీ పేర్కొంది. కాగా, మమత గురువారం రాత్రి పొద్దుపోయాక, కోల్‌కతాలోని స్ట్రాంగ్‌రూం వద్ద ఆందోళన చేసి, ఎన్నికల కమిషన్ తీరు పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు తృణమూల్ ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్ల సమక్షంలోనే ఈవీఎం మెషీన్ల సీలింగ్ జరిగిందని స్పష్టం చేసింది.

బెంగాల్, అస్సాంలో బీజేపీ ప్రభంజనం

» తమిళనాడులో డీఎంకే, కేరళలో యూడీఎఫ్

» టుడేస్ చాణక్య అంచనా

» బెంగాల్ ఎగ్జిట్‌పోల్స్ ఇవ్వలేం : యాక్సిస్ మై ఇండియా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం సాధించే అవకాశాలు అధికంగా ఉన్నాయని టుడేస్ చాణక్య సంస్థ అంచనా వేసింది. అలాగే, తమిళనాడులో డీఎంకే పార్టీ అధికారం నిలబెట్టుకోనుందని, కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్, అధికార ఎల్‌డీఎఫ్ మధ్య గట్టిపోటీ నెలకొందని ఆ సంస్థ పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ 15 ఏళ్ల పాలనకు ప్రజలు చరమగీతం పాడనున్నారని ఇప్పటికే ఎగ్జిట్‌పోల్ నిర్వహించిన మెజారిటీ సంస్థలు ప్రకటించగా టుడేస్ చాణక్య సంస్థ కూడా గురువారం అదే విషయాన్ని వెల్లడించింది. బెంగాల్ అసెంబ్లీలోని మొత్తం 294 స్థానాల్లో బీజేపీ 192 సీట్లు గెలిచే అవకాశముందని ఆ సంస్థ ప్రకటించింది. టుడేస్ చాణక్య తన అంచనాలను విశ్లేషణ పేరుతో విడుదల చేసింది. టీఎంసీకి 100, ఇతరులకు 2 స్థానాలు లభిస్తాయని పేర్కొంది. బీజేపీకి 48%, తృణమూల్‌కు 38%, ఇతరులకు 14% ఓట్లు పడనున్నాయని తేల్చింది. బీజేపీ, టీఎంసీకి వచ్చే సీట్లలో 11 సీట్లు తగ్గడం కానీ పెరగడం కానీ ఉండవచ్చునని అంచనా వేసింది. బీజేపీకి ఎస్సీల్లో 67%, ఓబీసీల్లో 61%, ఎస్టీల్లో 53%, ముస్లింలలో 8% ఓట్లు పడ్డాయని పేర్కొంది. అదే తృణమూల్‌కు ముస్లింలలో 72%, ఎస్సీల్లో 22%, ఓబీసీల్లో 27%, ఎస్టీల్లో 40% ఓట్లు పడ్డాయని తెలిపింది. కాగా, పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి ఎగ్జిట్‌పోల్స్ అంచనాలను ఇవ్వలేమని యాక్సిస్ మై ఇండియా గురువారం ప్రకటించింది. బెంగాల్ ఓటర్లు సర్వేకు సహకరించకపోవడం వల్లే ఎగ్జిట్‌పోల్స్ ఇవ్వడం లేదని వెల్లడించింది. అస్సాంలో 125 సీట్లలో బీజేపీకి 102, కాంగ్రెస్‌కు 23, ఇతరులకు ఒక సీటు లభిస్తాయని టుడేస్ చాణక్య చెప్పింది. బీజేపీ, కాంగ్రెస్‌కు వచ్చే సీట్లలో 9 సీట్లు తగ్గడం కానీ, పెరగడం కానీ ఉంటుందని తేల్చింది.

డీఎంకేకు 125

తమిళనాడులోని 234 సీట్లలో డీఎంకే కూటమికి 125, అన్నాడీఎంకే కూటమికి 45, సినీనటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకేకు 63 సీట్లు, ఇతరులకు ఒక సీటు లభించనున్నట్లు టుడేస్ చాణక్య తేల్చింది. టీవీకేకు ప్రతిపక్ష స్థానం లభిస్తుందని అంచనా వేసింది. ముస్లింల్లో 64 శాతం, క్రైస్తవుల్లో 49%, బీసీల్లో 36%, ఎంబీసీల్లో 43% మంది డీఎంకేకు ఓటు వేశారని టుడేస్ చాణక్య చెప్పింది. డీఎంకే తర్వాత ఎస్సీలు, ముస్లింలు, క్రైస్తవులు అధికంగా టీవీకే పక్షాన నిలిచారని అంచనా వేసింది. టీవీకేకు ముస్లింలు 25 శాతం, ఎస్సీలు 34 శాతం, ఎంబీసీలు 27 శాతం, బీసీలు 29 శాతం క్రైస్తవులు 34 శాతం ఓట్లు వేశారని పేర్కొంది. మరోపక్క, కేరళలో యూడీఎఫ్ 69 సీట్లతో అధికారంలోకి వచ్చే అవకాశముందని, ఎల్డీఎఫ్‌కు 64 సీట్లు లభించనున్నాయని అంచనా వేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేరళలో ఈసారి బీజేపీకి ఏడు సీట్లు వచ్చే అవకాశముందని తెలిపింది. కేరళలోని ముస్లింలలో అధికంగా 62% మంది ఈ సారి కాంగ్రెస్‌కే ఓటు వేశారని, 33% ఎల్డీఎఫ్ వైపు మొగ్గు చూపారని టుడేస్ చాణక్య తెలిపింది.

రూ. 45 లక్షల కోసం ప్రియుడితో కలిసి తల్లిని చంపేసింది

» 17 ఏళ్ల బాలిక దుర్మార్గం.. జార్ఖండ్‌లో ఘటన

రాంచీ, ఏప్రిల్ 30: డబ్బుపై ఆశతో ప్రియుడితో కలిసి తల్లిని హత్య చేసిందో కూతురు. జార్ఖండ్ రాజధాని రాంచీలో ఈ ఘటన జరిగింది. హతురాలి పేరు నహీదా పర్వీన్. ఆమెకు దత్తత తీసుకున్న 17 ఏళ్ల కూతురు ఉంది. పర్వీన్ భర్త, విద్యుత్తు విభాగంలో పనిచేసేవారు. ఆయన నాలుగేళ్ల క్రితం చనిపోయారు. సర్వీసులో ఉండగా చనిపోవడంతో విద్యుత్తు విభాగం నుంచి పరిహారంగా పర్వీన్‌కు రూ.45 లక్షలు వచ్చాయి. ఈ డబ్బుకు పర్వీన్ కూతురును నామినీగా పెట్టారు. పర్వీన్ కూతురు బిహార్‌లోని గయాకు చెందిన 20 ఏళ్ల అర్బాజ్ ఖాన్ అనే యువకుడితో ప్రేమలో పడింది. ఆ బాలిక.. అర్బాజ్ అడిగనప్పుడల్లా అతడికి డబ్బులిచ్చేది. ఇది తెలిసి.. ఆమెను తల్లి మందలించింది. పర్వీన్‌ను అడ్డు తొలగించుకుంటే రూ.45లక్షలు తన సొంతం అవుతాయని, మానవీయ కోణంలో ఉద్యోగమూ రావొచ్చునని, అప్పుడు ప్రియుడితో కలిసి విలాసవంతమైన జీవితం గడపొచ్చునని ఆ బాలిక భావించింది. అర్బాన్‌తో కలిసి పర్వీన్ హత్యకు ప్రణాళిక రచించింది. ఇంట్లో పర్వీన్ నిద్రపోతున్నప్పుడు.. ఆ బాలిక, అర్బాజ్, ఆ యువకుడి ముగ్గురు స్నేహితులు కలిసి కాళ్లు, చేతులు కదలకుండా పట్టుకొని, ముఖమ్మీద దిండు పెట్టి.. ఊపిరాడకుండా చేసి చంపారు. హత్య అనంతరం.. ఆ బాలిక, బంధువులకు ఫోన్‌చేసి, తల్లి పర్వీన్ బాత్‌రూంలో జారిపడి ప్రాణాలు కోల్పోయిందని చెప్పింది. బంధువులొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. రెండ్రోజుల తర్వాత.. పర్వీన్ మెడమీద తనకు గాయాలు కనిపించాయని బంధువుల్లో ఒకరు, మిగతా వారికి చెప్పడంతో ఆమె మృతిపై అంతా అనుమానాలు వ్యక్తం చేశారు. పర్వీన్ బావ.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. పోలీసులు బాలికను అదుపులోకి తీసుకొని విచారించడంతో తానే హత్యచేయించినట్లు ఆమె అంగీకరించింది.

అహ్మద్‌బాబూ.. ఇదేం పని?!

- వాణిజ్య పన్నుల శాఖలో ప్రతీకార చర్యలు
- 2022 నాటి ధర్నా కేసుపై నివేదిక కోరిన జీఏడీ
- అదే కేసులో 72 మందిపై అహ్మద్‌బాబు చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ అహ్మద్‌బాబుకు, ఉద్యోగులకు మధ్య ప్రచ్ఛన్న యుద్ధం పతాక స్థాయికి చేరుకుంటోంది. అహ్మద్‌బాబును తప్పించాలని ఉద్యోగులు గత రెండు రోజులుగా ఉద్యమాలు చేస్తుండగా, 2023లోనే హైకోర్టు సస్పెండ్ చేసిన ఓ మోమోతో ముడిపడిన కేసును అడ్డంపెట్టుకొని అహ్మద్‌బాబు ప్రతీకార చర్యలకు దిగారు. ఒకేరోజు 72 మంది ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు కట్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం కలకలం రేపుతోంది. అహ్మద్‌బాబు తమపై తీవ్ర ప్రతీకార చర్యలకు దిగుతున్నారని, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని వాణిజ్య పన్నుల ఉద్యోగుల సంఘం నేతలు కోరుతున్నారు. వివరాలు.. తమకు పదోన్నతులు ఇవ్వాలని, సర్వీసు అంశాలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 2022 డిసెంబరు 27న వాణిజ్య పన్నుల ఉద్యోగులు కార్యాలయాల్లో పెద్ద ఎత్తున ధర్నాలు చేశారు. ఈ చర్యలను అప్పటి జగన్ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సంఘం గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో సంజాయిషీ ఇవ్వాలంటూ ఉద్యోగుల సంఘానికి 2023 ఏప్రిల్ 18న మెమో జారీ చేసింది. దీన్ని ఉద్యోగుల సంఘం హైకోర్టులో సవాల్ చేసింది. విచారణ అనంతరం ఈ మెమోను సస్పెండ్ చేయడంతో పాటు అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. కూటమి సర్కారు వచ్చిన తర్వాత ఉద్యోగుల సంఘం వినతి మేరకు జగన్ ప్రభుత్వంలో జారీ చేసిన మెమోను ఉపసంహరించుకుంది. ఈ మేరకు గతేడాది సెప్టెంబరు 10న జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్ రా వత్ మెమో జారీ చేశారు. అంతటితో ఆ కేసు ముగిసిపోయిం ది. ప్రభుత్వ ఆలోచనలకు తగినట్లుగానే ఈ అంశంపై తదుపరి చర్యలు తీసుకునేందుకు కీలక సమాచారం కోరుతూ జీఏడీ పలుమార్లు వాణిజ్య పన్నుల శాఖకు యూవో నోట్‌లు పంపించింది. చివరగా ఈ నెల 24న రావత్ మరో నోట్ పంపిస్తూ తాము అడిగిన అంశాలపై సమాచారం రావడం లేదని, ఇప్పుడైనా బదులివ్వాలని కోరారు. ఇన్నాళ్లుగా వాటిపై స్పందించని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు.. ప్రధాన కమిషనర్ వ్యవహారం రచ్చకెక్కిన తర్వాత ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు దిగడం చర్చనీయాంశంగా మారింది. అప్పటి మెమో నేపథ్యంలో జరిగిన విచారణ ఆధారంగా ఉద్యోగులపై అహ్మద్‌బాబు ఇప్పుడు చర్యలకు దిగారు. జగన్ ప్రభుత్వంలో ధర్నాలో పాల్గొన్నారని, సర్వీసు నిబంధనలు ఉల్లంఘించారనే అభియోగాలతో 72 మందికి ఒక వార్షిక ఇంక్రిమెంట్ కోతపెడుతూ ఉత్తర్వులు ఇచ్చారు. 2022లో జరిగిన ధర్నాకు మూలమైన మెమోను ప్రభుత్వమే ఉపసంహరించుకుంటే, నాటి విచారణను చూపి ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం ఏమిటని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇది ఉద్యోగులపై అహ్మద్‌బాబు ప్రతీకార చర్య అని మండిపడుతున్నాయి.

హజ్ యాత్రికులకు పకడ్బందీగా ఏర్పాట్లు

- అధికారులకు మంత్రి ఫరూక్ ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులకు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు, వసతులు కల్పించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. మే 4వ తేదీ నుంచి హజ్ యాత్రకు హైదరాబాద్, బెంగళూరు నుంచి బయలుదేరే యాత్రికులకు కల్పించిన ఏర్పాట్లపై మంత్రి ఫరూక్ గురువారం అమరావతి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఏపీ నుంచి ఈ ఏడాది 2000 మంది హజ్ యాత్రకు వెళ్లనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో ఏప్రిల్ 18, 19 తేదీల్లో రెండు విడతలుగా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 333 మంది వెళ్లారన్నారు. మిగతావారు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాలను ఎంచుకున్నట్లు వెల్లడించారు. వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం, మైనార్టీ మంత్రిత్వశాఖ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల్లోని విమానాశ్రయాల ద్వారా హజ్‌యాత్రకు వెళ్లేవారికి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు, వసతి, వైద్య సౌకర్యాల కల్పన పూర్తి చేయాలని మైనార్టీ శాఖ కార్యదర్శి శ్రీధర్‌కు సూచించామన్నారు. బెంగళూరు, హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రాల ద్వారా హజ్‌కు వెళ్లే ఏపీ యాత్రికులకు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి నోడల్ అధికారులను నియమించామన్నారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక సహాయక సేవలను ఏర్పాటు చేశామని తెలిపారు.

భారతీయ రిజర్వ్ బ్యాంక్/Reserve Bank of India
ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం/Andhra Pradesh Regional Office

భారతీయ రిజర్వ్ బ్యాంక్ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క బ్యాంకింగ్ లైసెన్సును రద్దు చేసింది

"భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) 24 ఏప్రిల్ 2026 తేదీన జారీ చేసిన ఉత్తర్వు ద్వారా, బ్యాంకింగ్ నియంత్రణ చట్టం, 1949 ('BR Act') లోని సెక్షన్ 22(4) ప్రకారం పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్కు మంజూరు చేసిన బ్యాంకింగ్ లైసెన్సును 24 ఏప్రిల్ 2026న వ్యాపార సమయం ముగిసినప్పటి నుండి అమలులోకి వచ్చేలా రద్దు చేసింది. కావున, బ్యాంకింగ్ నియంత్రణ చట్టం, 1949 లోని సెక్షన్ 5(b) లో నిర్వచించిన 'బ్యాంకింగ్' కార్యకలాపాలు గానీ, సెక్షన్ 6 లో పేర్కొన్న అదనపు వ్యాపారాలు గానీ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ వెంటనే నిలిపివేయవలసి ఉంటుంది. ఈ బ్యాంకును రద్దు చేయుటకు సంబంధించి RBI హైకోర్టులో దరఖాస్తు చేయనుంది. బ్యాంకును మూసివేసినా, తన వద్ద ఉన్న అన్ని డిపాజిట్ బాధ్యతలను పూర్తిగా చెల్లించేందుకు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్కు తగినంత నగదు నిల్వలు (లిక్విడిటీ) ఉన్నాయి.

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ లైసెన్సును రద్దు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ పేర్కొన్న కారణాలు:

i. బ్యాంకు, బ్యాంకింగ్ నియంత్రణ చట్టం (BR Act) లోని సెక్షన్ 22(3)(b) నిబంధనలను అనుసరించకపోవడం వలన బ్యాంకు వ్యవహారాలు బ్యాంకు మరియు దాని డిపాజిటర్ల ప్రయోజనాలకు హానికరంగా పరిణమించడం

ii. బ్యాంకు నిర్వహణ యొక్క సాధారణ స్వభావం డిపాజిటర్ల ప్రయోజనాలకు, అలాగే ప్రజా ప్రయోజనానికి విరుద్ధంగా ఉంది. అందువల్ల, బ్యాంకు BR Act లోని సెక్షన్ 22(3)(c) నిబంధనలను ఉల్లంఘించినట్లుగా పరిగణించబడుతుంది.

iii. BR Act లోని సెక్షన్ 22(3)(e) ప్రకారం, బ్యాంకు కొనసాగింపును అనుమతించడం ద్వారా ఎటువంటి ప్రయోజనం గానీ, ప్రజా ప్రయోజనం గానీ నెరవేరదు.

iv. బ్యాంకుకు జారీ చేసిన పేమెంట్స్ బ్యాంక్ లైసెన్సులో పేర్కొన్న షరతులను బ్యాంకు పాటించడంలో విఫలమై, BR Act లోని సెక్షన్ 22(3)(g) నిబంధనలను ఉల్లంఘించింది.

లోగడ, 11 మార్చి 2022 నుండి కొత్త వినియోగదారులను చేర్చుకోవడం (onboarding) నిలిపివేయాలని బ్యాంకును ఆదేశించడం జరిగింది. అనంతరం, 31 జనవరి 2024 మరియు 16 ఫిబ్రవరి 2024 తేదీలలో బ్యాంకుపై కొన్ని వ్యాపార పరిమితులు విధించబడ్డాయి. వాటి ప్రకారం, ప్రస్తుత వినియోగదారుల ఖాతాల్లో, ప్రీపెయిడ్ సాధనాలు, వాలెట్లు మొదలైన వాటిలో ఇకపై డిపాజిట్లు/క్రెడిట్లు/టాప్-అప్స్ వంటి బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహించడం నిషేధించబడింది.

(బ్రిజ్ రాజ్)
చీఫ్ జనరల్ మేనేజర్

పత్రికా ప్రకటన: 2026-2027/143

भारतीय रिज़र्व बैंक /Reserve Bank of India
आंध्र प्रदेश क्षेत्रीय कार्यालय /Andhra Pradesh Regional Office

भारतीय रिज़र्व बैंक ने पेटीएम पेमेंट्स बैंक लिमिटेड का लाइसेंस रद्द कर दिया

भारतीय रिज़र्व बैंक (आरबीआई) ने बैंककारी विनियमन अधिनियम, १९४९ (बीआर अधिनियम) की धारा २२(४) के अंतर्गत दिनांक २४ अप्रैल २०२६ के आदेश द्वारा पेटीएम पेमेंट्स बैंक लिमिटेड को जारी किया गया बैंकिंग लाइसेंस रद्द कर दिया है। यह आदेश २४ अप्रैल २०२६ को कारोबार की समाप्ति से प्रभावी होगा। परिणामस्वरूप, पेटीएम पेमेंट्स बैंक लिमिटेड को बैंककारी विनियमन अधिनियम, १९४९ की धारा ५(बी) में परिभाषित 'बैंकिंग' का कारोबार करने, या धारा ६ के तहत निर्दिष्ट किसी भी अतिरिक्त कारोबार को करने से तत्काल प्रभाव से प्रतिबंधित किया जाता है। आरबीआई, इस बैंक को बंद करने के लिए उच्च न्यायालय के समक्ष आवेदन करेगा।

पेटीएम पेमेंट्स बैंक लिमिटेड के पास बैंक के बंद होने की स्थिति में जमाराशि संबंधी अपनी संपूर्ण देनदारी चुकाने के लिए पर्याप्त चलनिधि मौजूद है।

भारतीय रिज़र्व बैंक ने निम्न कारणों से पेटीएम पेमेंट्स बैंक लिमिटेड का लाइसेंस रद्द किया:

(i) बैंक के कामकाज इस तरह से किए जा रहे थे, जो बैंक और उसके जमाकर्ताओं के हितों के लिए हानिकारक थे। अतः, बैंक, बीआर अधिनियम की धारा २२(३)(बी) का पालन नहीं कर रहा है।

(ii) बैंक के प्रबंधन का सामान्य स्वरूप जमाकर्ताओं के हितों के साथ-साथ जनहित के लिए भी हानिकारक है। अतः, बैंक, बीआर अधिनियम की धारा २२(३)(सी) के प्रावधानों का पालन नहीं कर रहा है।

(iii) बीआर अधिनियम की धारा २२(३)(ई) के अनुसार, बैंक को काम जारी रखने की अनुमति देने से कोई उपयोगी उद्देश्य या जनहित पूरा नहीं होगा।

(iv) बैंक ने उसे जारी किए गए पेमेंट्स बैंक लाइसेंस में निर्धारित शर्तों का पालन नहीं किया, जिसके परिणामस्वरूप उसने बीआर अधिनियम की धारा २२(३)(जी) के प्रावधानों का उल्लंघन किया।

इससे पहले, बैंक को ११ मार्च २०२२ से नए ग्राहकों को जोड़ने का काम रोकने का निर्देश दिया गया था। इसके बाद, ३१ जनवरी २०२४ और १६ फरवरी २०२४ को बैंक पर कुछ कारोबारी पाबंदियां भी लगाई गईं, जिनके तहत, अन्य बातों के साथ-साथ, मौजूदा ग्राहकों के खातों, प्रीपेड लिखतों, वॉलेट आदि में आगे कोई भी जमा/क्रेडिट/टॉप-अप करने की अनुमति नहीं दी गई।

(ब्रिज राज)
मुख्य महाप्रबंधक

प्रेस विज्ञप्ति: 2026-2027/143

సచివాలయం డిస్పెన్సరీలో మాక్ డ్రిల్

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచన మేరకు గురువారం అమరావతి సచివాలయంలోని డిస్పెన్సరీలో డాక్టర్లు, సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఏవైనా ఆయిల్స్, కెమికల్స్, యాసిడ్స్ శరీరంపై పడినప్పుడు కాలిన గాయాలతో వచ్చిన వారికి అత్యవసరంగా ఎలాంటి చికిత్స అందించాలన్న దానిపై మాక్ డ్రిల్ లో చూపించారు. కాలిన గాయాలతో అంబులెన్సులో వచ్చిన వారికి వెనువెంటనే ఎలాంటి చికిత్స అందిస్తారన్న దానిపై ఇక్కడ చూపించామని డాక్టర్ హదస్సా తెలిపారు. ప్రమాద పరిస్థితి నుంచి పేషెంట్ ప్రాథమికంగా కోలుకున్న తర్వాత జిల్లా ఆసుపత్రులకు పంపించే క్రమంలో ప్రతి దశలోనూ ఎలాంటి చికిత్స అందించాలన్న దానిపై డాక్టర్లు, సిబ్బందికి అవగాహన కల్పించామని ఆమె చెప్పారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ మాక్‌డ్రిల్‌లో డాక్టర్ జి.దివ్య సాయిశ్రీ, డాక్టర్ చింతి ఆనంద్, డాక్టర్ వి.ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

సునీత పిటిషన్‌పై విచారణ వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరింత లోతైన దర్యాప్తు చేయాలని ఆయన కుమార్తె సునీతా రెడ్డి సీబీఐ కోర్టులో వేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ 4కు వాయిదా పడింది. గురువారం సునీత పిటిషన్‌ను ఈ కేసులోని నిందితులందరికీ అందించినట్టు తెలపగా, తదుపరి విచారణను న్యాయస్థానం మూడ్రోజుల పాటు వాయిదా వేసింది. దీనిపై ఇప్పటికే సునీత సుప్రీం, హైకోర్టుల్లో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. గతంలో ఈ కేసు దర్యాప్తునకు పాక్షికంగా న్యాయస్థానం అనుమతించగా, సీబీఐ మూడో చార్జిషీట్‌ను దాఖలు చేసిన సంగతీ తెలిసిందే!

హైకోర్టు ఏజీపీలకు గౌరవ వేతనం పెంపు

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పనిచేస్తున్న అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లకు(ఏజీపీ) ప్రభుత్వం గౌరవ వేతనం (కన్వేయన్స్ అలవెన్స్ సహా) పెంచింది. రూ. 44 వేల గౌరవ వేతనాన్ని రూ.55 వేలకు పెంచుతూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వాసుదేవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

విజయవాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ఏ2గా ఉన్న దొంతిరెడ్డి వాసుదేవరెడ్డికి విజయవాడ ఏడో అదనపు జిల్లా జడ్జి కోర్టు ఝలక్ ఇచ్చింది. సీఐడీ తాజాగా నమోదు చేసిన కేసులో ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. న్యాయాధికారి అబ్రహం గురువారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. వైసీపీ ప్రభుత్వంలో వాసుదేవరెడ్డి బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగా పనిచేశారు. మద్యం కుంభకోణం కేసులో రెండో నిందితుడిగా ఉన్న ఆయనకు కొద్దిరోజుల క్రితమే బెయిల్ మంజూరవడంతో జైలు నుంచి బయటకు వచ్చారు. మద్యం రవాణాలో జరిగిన అవకతవకలపై తాజాగా సీఐడీ ఇప్పుడు కేసు నమోదు చేసింది. ఈ కేసులోనూ అరెస్టు చేస్తారని భావించి ముందస్తు బెయిల్ కోసం ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదప్రతివాదనలు ముగియడంతో కోర్టు తీర్పును వెలువరించింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

బెజవాడ కోర్టు న్యాయాధికారికి తప్పనిసరి రిటైర్మెంట్

- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విజయవాడ 14వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కమ్ అదనపు ఫ్యామిలీ కోర్టు జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న షేక్ ఇంతియాజ్ అహ్మద్‌కు తప్పనిసరి పదవీ విరమణ విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతియాజ్ అహ్మద్ సర్వీసు రికార్డును సమీక్షించిన హైకోర్టు.. సర్వీసులో కొనసాగడానికి ఆయన సరిపోరని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయనకు 2025 ఆగస్టు 31 నాటి నుంచి తప్పనిసరి పదవీ విరమణ విధిస్తూ ప్రభుత్వం గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఈ ఉత్తర్వులు ఇచ్చారు.

శ్రీహరికి కుప్పం కోర్టు బెయిల్

- వెంటనే అదుపులోకి తీసుకున్న గుంటూరు పోలీసులు



కుప్పం కోర్టు ఆవరణలో పూడి శ్రీహరి

కుప్పం, గుంటూరు, అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా కార్యదర్శి, జగన్ సీఎంగా ఉన్న సమయంలో చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ (సీపీఆర్వో)గా పనిచేసిన పూడి శ్రీహరికి కుప్పం కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. బెంగళూరులో ఉన్న ఆయనను పోలీసులు బుధవారం అరెస్టు చేసి కుప్పం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. సీఎం చంద్రబాబు ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో శ్రీహరిని రెండోసారి అరెస్టు చేసిన పోలీసులు ఆయనను రోజంతా విచారించారు. అనంతరం గురువారం కుప్పం కోర్టులో ప్రవేశపెట్టగా.. కోర్టు ఆయనకు బెయిలు మంజూరు చేసింది. అయితే అప్పటికే కోర్టు బయట వేచి ఉన్న గుంటూరు జిల్లా కొత్తపేట పోలీసులు శ్రీహరిని వెంటనే అదుపులోకి తీసున్నారు. సోషల్ మీడియాలో అనుచిత పోస్టుల వ్యవహారంపై గుంటూరులో నమోదైన కేసులో శ్రీహరికి అక్కడికక్కడే నోటీసులిచ్చి అరెస్టు చేశారు. గురువారం రాత్రి 11 గంటల తర్వాత గుంటూరులోని కొత్తపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం ఆయనను కోర్టులో హాజరు పరచనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

హైకోర్టులో శ్రీహరి పిటిషన్లు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో గుంటూరు జిల్లా నల్లపాడు, కొత్తపేట పోలీసులు నమోదు చేసిన కేసులు కొట్టివేయాలని కోరుతూ పూడి శ్రీహరి హైకోర్టులో రెండు క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే కుప్పం పోలీసులు అరెస్ట్ చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒకే ఘటనపై బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం సుప్రీం కోర్టు తీర్పులకు విరుద్ధమన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రావాలి: సీఎం

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేలా వినూత్న కోర్సులు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కోర్సుల రూపకల్పన జరగాలన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖలపై గురువారం సచివాలయంలో ఆయన సమీక్షించారు. యూనివర్సిటీలు ప్రస్తుతం అందిస్తున్న కోర్సులను పునర్నిర్మాణం చేయాలన్నారు. పరిశోధనలు, ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా మార్పులను అందిపుచ్చుకోవాలని సూచించారు. రాబోవు కాలంలో గేమ్ చేంజర్‌లు కానున్న లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలన్నారు. క్వాంటమ్ టెక్నాలజీపై మొదటగా కోర్సు ప్రారంభించిన ఆంధ్రా యూనివర్సిటీని సీఎం ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్రంలోని వర్సిటీలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్-200 యూనివర్సిటీలతో భాగస్వామ్యం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. యూనివర్సిటీల్లో విదేశీ భాషలను నేర్పేందుకు ఓ ప్రత్యేక విభాగం ఉండాలని సూచించారు.

విద్యార్థులకు అన్ని పోషకాలు అందాలి

విద్యార్థులకు అన్ని పోషకాలు అందేలా మధ్యాహ్న భోజన మెనూ రూపొందించాలని పాఠశాల విద్య అధికారులను సీఎం ఆదేశించారు. హాస్టళ్లు, గురుకులాల్లో కిచెన్ గార్డెన్లను అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థుల హాజరును తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకునేలా చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల ద్వారా అత్యుత్తమ టీచర్లతో వీడియోల ద్వారా పాఠాలు చెప్పిస్తే బోధనలో నాణ్యత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సాంకేతికత సాయంతో ఉత్తమ విద్యను అందించాలన్నారు. విద్యార్థులు వైవిధ్యంగా ఆలోచించేలా వారితో 'స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్' పేరుతో ఒక ఏఐ సదస్సు నిర్వహించాలని ఆదేశించారు. యువత ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఏ మేరకు నైపుణ్యాలు కలిగి ఉన్నారో ర్యాండమ్ స్కిల్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రముఖ కంపెనీలు, పరిశ్రమలతో అనుసంధానం చేసుకుని, యువతకు అత్యుత్తమ నైపుణ్యాలను అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎం సేతు ప్రాజెక్టు ద్వారా ఐటీఐలను హబ్ అండ్ స్పోక్ విధానంలో అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

బడుల్లో సదుపాయాల కల్పనపై దృష్టి: లోకేశ్

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో మార్పులు చేస్తున్నామని మంత్రి లోకేశ్ సమావేశంలో సీఎంకు వివరించారు. 'ఒక తరగతికి ఒక టీచర్' పాఠశాలలను పెంచేలా చర్యలు చేపట్టామన్నారు. పాఠ్యాంశాల్లో మార్పులతో పాటు బ్రిడ్జి కోర్సులు కూడా అమలు చేస్తున్నామన్నారు. బోధనా విధానాలపై అధ్యయనానికి ఉత్తమ టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపుతున్నామని చెప్పారు.

బాబును తిట్టండని మీ పార్టీ నేతలు చెప్పారా?

▸▸ అంబటిని ప్రశ్నించిన వేంపల్లె పోలీసులు

వేంపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి చంద్రబాబును తిట్టాలని మీ పార్టీ నేతలు ఎవరైనా చెప్పారా? సీఎం స్థాయి వ్యక్తిని దూషించడం తప్పని తెలియదా' అని పోలీసులు మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబును ప్రశ్నించారు. ఈ ఏడాది జనవరి 30న గుంటూరులో అంబటి సీఎంనుద్దేశించి అనుచితంగా మాట్లాడారంటూ కడప జిల్లా వేంపల్లె మండల టీడీపీ కన్వీనర్ రామమునిరెడ్డి వేంపల్లె పోలీసు స్టేషన్‌లో ఫిబ్రవరి 1న ఫిర్యాదు చేశారు. బీఎన్ఎస్ 352, 353 సెక్షన్ల కింద కేసు (క్రైం నంబర్ 25/2026) నమోదు చేశారు. విచారణకు రావాలని ఏప్రిల్ 14న అంబటికి నోటీసు జారీ చేశారు. ఆయన గురువారం ఉదయం 10:45కు స్టేషన్‌కు వచ్చారు. వేంపల్లె సీఐ టి.నరసింహులు, ఆర్కేవ్యాలీ సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ తిరుపాల్ నాయక్ ఆయన్ను న్యాయవాదులు, స్థానిక వీఆర్వో సమక్షంలో 2 గంటలపాటు విచారించారు. మొత్తం 18 ప్రశ్నలు అడిగారు. ముఖ్యమైన ప్రశ్నలకు లేదు, కాదంటూ ఆయన సమాధానాలు దాటవేసినట్లు సమాచారం. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాబోయేది జగన్ ప్రభుత్వమే. లోకేశ్ రెడ్‌బుక్‌కు కుక్కలు కూడా భయపడవని ఎప్పుడో చెప్పాను' అని అన్నారు.

జీఎన్ నాయుడి మృతిపై సీఎం సంతాపం

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త, రీజెన్సీ గ్రూప్ అధినేత జీఎన్ నాయుడు మరణం విచారకరమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తన పరిశ్రమల ద్వారా ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించిన ఆయన మరణం పారిశ్రామిక రంగానికి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

20 ఏళ్ల క్రితమే రూపాయికి..

(మొదటి పేజీ తరువాయి)

మెరుగుపడుతుందని భావించి, 2005లో ఉమ్మడి విశాఖ జిల్లాలోని అచ్యుతాపురం మండలంలో భూములను 20 ఏళ్లకు లీజు ఇచ్చారు. దీని కోసం ఏపీఐఐసీ 2007లో ప్రత్యేకంగా ఆర్థిక మండలి (ఏపీఎస్ఈజెడ్) ఏర్పాటుచేసింది. సుమారు రూ.230 కోట్లతో విద్యుత్, నీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించింది. అక్కడితో ఆగకుండా రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ తరపున లక్ష మంది మహిళలకు ఆధునిక మిషన్లపై ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చింది. నాడు ప్రతిపక్షాలు ఎవరూ ఆ నిర్ణయాన్ని తప్పుబట్టలేదు. స్వాగతించాయి. ఉపాధి అవకాశాలు వస్తాయని సంతోషించాయి. 2010లో బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీకి పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ పార్క్ హోదా ఇచ్చారు. ఇది జరిగి 20 ఏళ్లు అయింది. అక్కడ ఇప్పుడు 15కి పైగా కంపెనీల్లో 26 వేల మంది మహిళలు పనిచేస్తున్నారు. వారి కోసం 200 బస్సులు నడుస్తున్నాయి. ఇదంతా ప్రగతిగానే భావించారు. ఎవరూ విమర్శలు గుప్పించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్ తదితర సంస్థలకు ఎకరా 99 పైసలు చొప్పున భూములు కేటాయించింది. ఇవన్నీ కలిపినా వేయి ఎకరాలు లేవు. ఈ సంస్థలు వస్తే విశాఖలో ఐటీ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుంది. వందలాది అనుబంధ కంపెనీలు వస్తాయి. లక్షల ఉద్యోగాలు వస్తాయి. వలసలు తగ్గుతాయి. ఆ ఉద్దేశంతోనే ప్రభుత్వం తక్కువ రేటుకు భూములు ఇచ్చింది. ఇన్ఫోసిస్, టీసీఎస్ తదితర సంస్థలు ఆషామాషీ కావు. వారి పెట్టుబడులూ తక్కువ కాదు. ఇది తెలిసినా, రాజకీయం కోసం నానా యాగీ చేస్తూ, ప్రభుత్వాన్ని బద్నామ్ చేయాలని వైసీపీ నేతలు దుష్ప్రచారం సాగిస్తున్నారు.



క్యాబినెట్ భేటీలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. పాల్గొన్న మంత్రులు

సిక్కోలు కాదు.. సింహపురిలో!

మారిన మహానాడు వేదిక

అమరావతి/నెల్లూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పసుపు పండుగ వేదిక నెల్లూరుకు మారింది. 44వ మహానాడును ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం చెంతనే ఉన్న చాపురం వద్ద అనువైన స్థలాన్ని కూడా గుర్తించారు. అయితే ట్రాఫిక్ ఇబ్బందులు.. రాష్ట్రం నలుమూలల నుంచి తరలి వచ్చే పార్టీ శ్రేణులకు వసతికి తగిన సౌకర్యం లేకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వేదిక ఖరారుకు పార్టీ పెద్దలు తర్జనభర్జన పడ్డారు. మరోవైపు.. భోగాపురంలో ముస్తాబవుతున్న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి జూన్ లేదా జూలైలో ప్రధాని మోదీ రానున్నారు. ఆ సమయంలో భోగాపురంలో భారీ సభను నిర్వహించాలని నిర్ణయించారు. ఒకే ప్రాంతంలో రెండు భారీ సభలు నిర్వహించడం కంటే.. ఇతర ప్రాంతాలకు అవకాశమివ్వాలని నాయకత్వం భావించింది. గురువారం పార్టీ నేతలతో సీఎం నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో మహానాడు వేదికను మార్చాలని నిర్ణయించారు. నెల్లూరుకు పచ్చజెండా ఊపారు. రాష్ట్ర పార్టీ పరిశీలకులు శుక్రవారం స్థల పరిశీలన జరుపనున్నారు.

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో..

జంట ఆఫీసు టవర్లు

37 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం.. మంత్రివర్గ నిర్ణయం

ఎస్పీఎఫ్‌లో 385 కానిస్టేబుల్ పోస్టుల అప్‌గ్రేడ్.. న్యాయ విభాగాల్లో కొత్తగా 21 పోస్టులు

రూ.124 కోట్లతో ఢిల్లీలో కొత్త ఏపీ భవన్.. పుట్టపర్తిలో డిఫెన్స్ పరిశ్రమకు 350 ఎకరాలు

41 అంశాలపై క్యాబినెట్ కీలక నిర్ణయాలు.. ఆర్థిక మంత్రి పయ్యావుల వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీలో జంట ఆఫీసు టవర్లు (టీ1, టీ2), షెల్ అండ్ కోర్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్ వెనుక రూ.1208.41 కోట్ల వ్యయంతో 37 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో రెండు టవర్లు నిర్మిస్తారు. ఒక్కో టవర్ 43 అంతస్తులతో నిర్మించనున్నారు. అలాగే రాజధాని అమరావతి ప్రాంతంలోని కృష్ణానది కుడి గట్టుపై వరద నిరోధక (కరకట్ట) రోడ్డును పటిష్ఠపరచాలని క్యాబినెట్ నిర్ణయించింది. దీని నిర్మాణానికి ఉద్దేశించిన మూడు ప్యాకేజీలకు.. సవరించిన అంచనా ప్రకారం మొత్తం రూ.443.26 కోట్ల వ్యయానికి ఆమోదం తెలిపింది. పని పరిధి రిటైనింగ్ వాల్ నుంచి రెండు వైపులా ఎంబ్యాంక్‌మెంట్‌కు మార్చడానికి గతంలో పరిపాలనా ఆమోదం పొందిన రూ.1304.89 కోట్లను సవరించి.. తాజాగా టెండర్లు పిలవడానికి అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అనుమతించింది. మొత్తం 11 కిలోమీటర్ల కరకట్టలో కొత్తగా 4 కిమీ రోడ్డు నిర్మాణం చేపడతారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. 41 అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ వివరాలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాకు వెల్లడించారు.

- ఢిల్లీలోని 11.536 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.124.50 కోట్లతో నూతన ఏపీ భవన్ నిర్మాణానికి నిర్ణయం. నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్‌కు నిర్మాణ బాధ్యత అప్పగింత. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి ప్రతిబింబించేలా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణానికి ఆమోదం. దీనికి తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా ప్రజలే పేరు సూచించాలని వినతి.
- ఏపీ భవన్ అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ పోస్టు రద్దు.. ఆఫీస్ మేనేజర్ పోస్టు సెక్షన్ ఆఫీసర్ స్థాయికి అప్‌గ్రేడ్.
- అమరావతిలో ప్రభుత్వ కాంప్లెక్సుల్లో రాష్ట్ర సచివాలయం, హెచ్‌వోడీ కార్యాలయాలు, జీఏడీ టవర్లకు గ్లాస్ క్లాడింగ్, క్రౌన్, అట్రియం, కెనోపీ స్కైలైట్, కాలమ్ క్లాడింగ్, పీవీ ప్యానల్స్, బీఎంయూ పనుల కోసం కంబైన్డ్ పరిపాలన ఆమోదం కింద రూ.2,540 కోట్లతో టెండర్లు పిలిచేందుకు అమరావతి గ్రోత్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏజీఐసీఎల్)కు అనుమతి.
- అమరావతిలో శాసనసభ భవనానికి స్పైర్, పార్కింగ్ రింగ్, రూఫ్, అప్రోచ్ వంతెనలు వంటి పనులకు రూ.798 కోట్లకు పరిపాలనా ఆమోదం.
- అమరావతి జోన్-11 పరిధిలో ఉండవల్లిలో భూసమీకరణ పథకం కింద లేఅవుట్లలో రూ.580 కోట్లతో రోడ్లు, కాలువలు, మౌలిక వసతుల కల్పన.
- సీఆర్‌డీఏ సరిహద్దు లోపల ఎన్10-ఈ1 జంక్షన్ నుంచి ఎన్13-ఈ1 వరకు 220 కేవీ లైన్ల బ్యాలెన్స్ పనులకు యూజీ కేబుల్స్ ద్వారా రీరూటింగ్ చేయడానికి సవరించిన అంచనా రూ.1180.54 కోట్ల వ్యయానికి ఆమోదం.
- ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో 2000 బ్యాచ్‌కు చెందిన 385 మంది కానిస్టేబుళ్ల పోస్టులను హెడ్ కానిస్టేబుళ్లుగా అప్‌గ్రేడ్ చేయడానికి ఆమోదం.
- హైకోర్టు, జిల్లా న్యాయవ్యవస్థ, న్యాయ విభాగాల్లో కొత్తగా 21 పోస్టులు మంజూరు.. చీఫ్ కోర్టు మేనేజర్, ఐదుగురు సీనియర్ కోర్టు మేనేజర్లు, 15 మంది కోర్టు మేనేజర్ల నియామకానికి నిర్ణయం.
- శ్రీకాళహస్తిలోని ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్, 3 ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్లలో మంజూరైన 20 రెగ్యులర్ పోస్టుల స్థానంలో 6 రెగ్యులర్, 14 అవుట్ సోర్సింగ్ పోస్టులు. సామర్లకోట, శ్రీకాళహస్తిలో మంజూరైన రెగ్యులర్ పోస్టుల స్థానంలో ఏడాది పాటు 9 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు అవుట్ సోర్సింగ్ ద్వారా భర్తీ.
- ప్రకాశం జిల్లా రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి సంబంధించి వ్యత్యాస పనులకు ఆమోదం. డ్రెడ్జింగ్‌తో తీసిన మట్టిని తరలించే ప్రదేశం మార్పు వల్ల ప్రాజెక్టు వ్యయంలో మార్పు, డ్రెడ్జింగ్‌తో అదనపు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని రూ.354.23 కోట్ల ఖర్చుకు అనుమతి.
- నెల్లూరు, కాకినాడ, కర్నూలు, కడప క్లస్టర్లలో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు ఇంప్రూవ్‌మెంట్ చార్జీలపై 2% స్టాంప్ డ్యూటీ మినహాయింపు.
- రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల స్థిరాస్తులు, షాపు గదుల లీజు పునరుద్ధరణ, అద్దెల నిర్ణయాన్ని సరళీకరించడానికి చట్ట సవరణ.
- అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో మ్యుటేషన్ చార్జీలు ఏకరూపంలో ఉండేలా మున్సిపాలిటీల చట్టం, మున్సిపల్ కార్పొరేషన్ యాక్టు సవరణల ముసాయిదా బిల్లుకు ఆమోదం.
- 2025-26 రబీ సీజన్‌లో వరి సేకరణకు ఎన్సీడీసీ నుంచి రూ.1,800 కోట్ల మూలధన రుణం తీసుకోవడానికి మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వ హామీ.
- పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కుటుంబాల్లో ఎస్టీ, ఎస్టీయేతరులకు వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద ఇల్లు నిర్మాణ యూనిట్ ధర రూ.2.85 లక్షల నుంచి రూ.3.57 లక్షలకు పెంపునకు నిర్ణయం. ఆర్అండ్ఆర్ కాలనీ కాకుండా వేరే చోట ఇల్లు నిర్మించుకోవాలనుకునేవారికి ఇంటి స్థలం విలువ రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంపు.
- పోలవరం ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజీ-1 ఏజెన్సీకి పుష్కర ఎత్తిపోతల స్కీం మెయిన్ కాలువలో 12.885 కిలోమీటర్ల వద్ద డ్రెయిన్, సైఫన్ నిర్మాణం, 525 మీటర్ల పొడవున ఎస్కేప్ చానల్ తవ్వకం పనులు అదనంగా అప్పగింత.
- శ్రీసత్యసాయి జిల్లాలో హంద్రీ-నీవా సుజల స్రవంతి ఫేజ్-2లో సిమెంట్ కాంక్రీటు లైనింగ్‌తో పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌ను ఆధునికీకరించే పనికి రూ.309.92 కోట్లకు ఆమోదం.
- శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెం, అనకాపల్లి జిల్లా పూడిమడక, ప్రకాశం జిల్లా కొత్తపట్నంలో మూడు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి సవరించిన అంచనా రూ.1586.69 కోట్లకు ఆమోదం.
- ఏపీపీసీసీ, డిస్కంలు.. ఆర్ఈసీ నుంచి తీసుకున్న ఎంటీఎల్ రుణాలు రూ.7 వేల కోట్లకు కొన్ని షరతులతో ప్రభుత్వ హామీ పొడిగింపు.
- ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సెంట్రిక్ స్కూల్ స్థాపనకు తిరుపతి జిల్లా కురుకాల్వ గ్రామంలో 10.10 ఎకరాల ప్రభుత్వ భూమి
- ఆధునిక డంపింగ్ యార్డ్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం కడప మున్సిపల్ కార్పొరేషన్‌కు కడప జిల్లా కొలుముళ్లపల్లిలో 92 ఎకరాల ప్రభుత్వ భూమి.
- పారిశ్రామిక హబ్ ఏర్పాటుకు ప్రకాశం జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో 22.74 ఎకరాల ప్రభుత్వ భూమి ఏపీఐఐసీకి కేటాయింపు
- అసెప్టిక్ ప్యాకింగ్ యూనిట్ అప్‌గ్రెడేషన్, పండ్ల నుంచి పల్ప్ తీసే సదుపాయాల కోసం ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు చిత్తూరు జిల్లా మజర కొత్తపల్లెలో 13.71 ఎకరాల ప్రభుత్వ భూమి (ధర ఎకరం రూ.లక్షన్నర).
- టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి విజయనగరం జిల్లా కనపాక అయ్యన్నపేట, ప్రకాశం జిల్లా కొత్త మామిడిపాలెం, పార్వతీపురం మన్యం జిల్లా సుందరనారాయణపురం, రాజమండ్రి అర్బన్‌లో రెండెకరాల చొప్పున.. ఏలూరులో 1.61 ఎకరాలు, కర్నూలు జిల్లా కల్లూరులో ఒకటిన్నర ఎకరం ప్రభుత్వ భూమి కేటాయింపు. ఏడాదికి రూ.వెయ్యి చొప్పున లీజు పద్ధతిలో ఇవ్వడానికి నిర్ణయం.
- మచిలీపట్నంలో ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ ట్రస్టుకు ఒకటిన్నర ఎకరం ప్రభుత్వ భూమి రూ.37.56 కోట్లకు కేటాయింపు.
- పుట్టపర్తిలో డిఫెన్స్ పరిశ్రమకు 350 ఎకరాలు.

> - పారిశ్రామికవేత్తలు ప్రభుత్వం వెంట పడడం కాదు.. ప్రభుత్వమే పారిశ్రామికవేత్తల వద్దకు వెళ్లి మాట్లాడాలి. ఇలా చేయడం వల్లే అభివృద్ధి సాధించగలిగాం.
> - రాజకీయంగానూ, పరిపాలనా పరంగానూ నేను, పవన్ కల్యాణ్ ఎలాంటి ఇగోలకు వెళ్లకుండా ప్రజల కోసం పని చేస్తున్నాం. అధికారులు, ఉద్యోగులు కూడా విధి నిర్వహణలో ఇగోలకు పోకుండా రాష్ట్రం కోసం పనిచేయాలి.
>
> - సీఎం చంద్రబాబు



రాజధాని అమరావతిలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో 'డిన్నర్ విత్ ది రియల్ విన్నర్స్' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, నారాయణ, లోకేశ్, దుర్గేశ్, సత్యకుమార్, సీఎస్ సాయిప్రసాద్

టీమ్ ఏపీ సత్తా

(మొదటి పేజీ తరువాయి)

ఆయన 'డిన్నర్ విత్ ది రియల్ విన్నర్స్' పేరుతో విందు ఇచ్చారు. ఉత్తమ పనితీరు కనపరిచిన జిల్లా, మండల స్థాయి ఉద్యోగులను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గడచిన 22 నెలల్లో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని, అందుకు ప్రభుత్వ యంత్రాంగం చేసిన కృషిని వారితో పంచుకున్నారు. ప్రభుత్వ విధానాల రూపకల్పన, వాటి అమలు, ఫలితాలు సాధించడంలో మంత్రులు, అధికారులు, ఉద్యోగుల బృందం సాగించిన సమష్టి కృషిని అభినందించారు. రాజకీయాల్లో ఎన్నో విజయాలను చూశానని.. 2024 ఎన్నికల్లో వచ్చిన విజయాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధాని మోదీ అందించిన సహకారాన్ని కొనియాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

టీమ్ ఏపీ సహకారం..

22 నెలల క్రితం పాలన ప్రారంభించినప్పుడు వ్యవస్థలను సరి చేయడం సాధ్యం కాదేమోనని అనుకున్నా. కానీ టీమ్ ఏపీ సహకారంతో వ్యవస్థలను గాడిలో పెట్టగలిగాం.. ఆ టీమ్ వల్లే ఈ అవార్డు వచ్చింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ప్రవేశపెట్టాం.. అధికారులు అద్భుతంగా పని చేశారు. నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో చాలా మంది ప్రధానులను చూశాను. సరైన సమయంలో సరైన ప్రధానిగా మోదీ నిలిచారు. గూగుల్ ఏపీకి రాగలిగిందంటే ఆయనే కారణం. అది వచ్చేందుకు నిబంధనలు సవరించారు. ఆర్సెలార్ మిట్టల్ ఉక్కు కర్మాగారం స్థాపనకూ ప్రధాని చొరవే కారణం. ఆ సంస్థ కోరిన విధంగా ముడి సరుకు రవాణాకు పైప్‌లైను ఏర్పాటుకు అనుమతులివ్వాలని కేంద్ర అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రానికి పెట్టుబడులు.. తద్వారా ఉద్యోగాలు పెద్దఎత్తున వస్తున్నాయి. గూగుల్ పెట్టుబడులను మించి పెట్టుబడులు పెట్టడానికి రిలయన్స్ ముందుకొచ్చింది. గూగుల్ 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడితే.. రిలయన్స్ 17 బిలియన్ డాలర్లతో వస్తోంది. విద్యుత్ కొనుగోళ్ల చార్జీలను గతేడాది యూనిట్‌కు 30 పైసల చొప్పున తగ్గించాం. ఈ ఏడాది ఇంకో 30 పైసలు తగ్గించాలన్న లక్ష్యం పెట్టుకున్నాం. రాజకీయంగా నష్టం జరుగుతుందని చెప్పినా, ప్రజలకు మేలు చేయడానికి గతంలో విద్యుత్ సంస్కరణలు చేపట్టాం. ఇప్పుడు 'వన్ నేషన్-వన్ గ్రిడ్' వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రధాని మోదీ దేశానికి అతి పెద్ద మేలు చేశారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు 'స్వయం' బ్రాండ్‌ను ఏర్పాటు చేశాం. రాష్ట్ర ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండ్ రావాలి.

టీమ్‌గా పనిచేస్తాం.. స్వర్ణాంధ్ర సాధిస్తాం!

గత 22 నెలల పాలనలో ఏపీ సాధించిన విజయాలు మరే రాష్ట్రం సాధించలేదు: లోకేశ్

గుంటూరు(రాజధాని) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గత 22 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో ఏపీ సాధించిన విజయాలు మరే రాష్ట్రం సాధించలేదని మంత్రి లోకేశ్ అన్నారు. మంత్రులు, అధికారులు ఒక టీమ్‌గా పనిచేసి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాలను సాధించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. 'డిన్నర్ విత్ ద రియల్ విన్నర్స్' కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 మధ్య పనిచేసిన టీమ్ అంతా ఇక్కడ ఉందని, అయితే ఇప్పుడే మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని, అందుకు కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు అని పేర్కొన్నారు. చాలా త్వరగా ఫలితాలు రావాలని కోరుకునే నాయకుడు, వేగంగా మార్పులు తీసుకురావాలనుకునే సంస్కరణవాది చంద్రబాబు అని ప్రశంసించారు. కుటుంబాన్ని నిలబెట్టడానికి తండ్రి ఎలా కష్టపడతారో అదేవిధంగా చంద్రబాబు కూడా కష్టపడ్డారని, ఆయనను ఆంధ్రప్రదేశ్ తండ్రిగా చూస్తానని అన్నారు. 'ఇప్పుడు మంత్రులుగా చంద్రబాబు 4.0లో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాం. సీఎంగా ఇది ఆయనకు నాలుగో పర్యాయం. కొత్త ఆలోచనలు, కొత్త విధానాలు తీసుకొచ్చినప్పుడు ఆయన ఎప్పుడూ మాకు మద్దతు ఇచ్చారు. దీనికి మంచి ఉదాహరణ లిఫ్ట్ పాలసీ. ఫార్చ్యూన్ 500 కంపెనీలకు 99 పైసలకే భూమి కేటాయించాలనే ప్రతిపాదనను తీసుకువచ్చినప్పుడు.. ఆయనను ఒప్పించడానికి 30 నిమిషాలు పట్టింది. కానీ ఒకసారి ఒప్పుకున్న తర్వాత.. ఆ నిర్ణయం వల్ల గూగుల్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టీసీఎస్ లాంటి కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌కు రావడానికి మార్గం సుగమమైంది. ఆయనతో కలిసి పనిచేయడం అద్భుత అనుభవం' అని లోకేశ్ అన్నారు.

2024-29 పాలన గురించి గొప్పగా చెప్పుకునేలా పని చేస్తాం

'నా వ్యక్తిగత లక్ష్యం ఒక్కటే.. 1995-99 నాటి పాలన కంటే.. 2024 నుంచి 2029 వరకు ప్రభుత్వ కాలం గొప్పదని చంద్రబాబు స్వయంగా చెప్పాలి. మంత్రులుగా మేమంతా ఆయన విజన్‌తో ప్రేరణ పొందుతున్నాం. శాఖల మధ్య పోటీగా కాకుండా.. ఒక టీమ్‌గా పనిచేస్తాం. మన లక్ష్యం ఒక్కటే.. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం' అని లోకేశ్ స్పష్టం చేశారు. 'ఈగో కాదు.. ఫలితాలే ముఖ్యం. 75 ఏళ్ల వయసులో నాలుగోసారి సీఎంగా చేస్తున్న వ్యక్తికే అహంకారం లేకపోతే.. మనకు ఉండాల్సిన అవసరం లేదు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ ఇప్పుడు అత్యవసరం. 800 ప్రాజెక్టులను ట్రాక్ చేసి, గ్రౌండింగ్ చేయడం చాలా పెద్ద విషయం. గత 22 నెలల్లో ఏపీ సాధించిన విజయాలు మరే రాష్ట్రం సాధించలేదు. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. మనం చరిత్ర సృష్టించడానికే ఇక్కడ ఉన్నాం. భారతదేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయి. 50 శాతం ఎప్పుడు సాధిస్తారని సీఎం అడిగారు. చంద్రబాబు డైరెక్షన్‌లో పని చేయడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం. మేమంతా ఒక టీమ్‌గా, ఎలాంటి ఈగో లేకుండా ఒకరినొకరం ప్రోత్సహించుకుంటూ లక్ష్యాలను చేరుకుంటాం' అని తెలిపారు.

పెట్టుబడుల కోసం పరుగులు పెట్టిస్తున్నారు: మంత్రులు

పెట్టుబడులు రాబట్టే విషయంలో చంద్రబాబు తమను పరుగులు పెట్టిస్తున్నారని పరిశ్రమల మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. పట్టిసీమను ఒట్టిసీమ అనివిమర్శించారని, కానీ అదే పట్టిసీమ రూ.50 వేల కోట్ల సంపదను సృష్టించిందని.. దటీజ్ చంద్రబాబు అంటూ మంత్రి నిమ్మల ప్రశంసించారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ సింగపూర్‌కు అధ్యయనం కోసం వెళ్లినప్పుడు తిరిగొచ్చాక చంద్రబాబు ఏం అడుగుతారోననే భయంతో ఆ దేశంలో ఏడు రోజులపాటు క్లాసులకు అటెండ్ అయ్యామన్నారు. మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ రిఫార్మర్ అనే పదానికి రాజకీయాల్లో నిజమైన నిర్వచనం సీఎం చంద్రబాబు అని అన్నారు.

వైసీపీ రాజకీయం.. విధ్వంసం, అవినీతే!

▸▸ వారికి రాష్ట్రాభివృద్ధి గిట్టదు: సీఎం

▸▸ గొడ్డలి పార్టీ విమర్శలను తిప్పికొట్టండి

▸▸ క్యాబినెట్ సహచరులతో చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి,, మంత్రుల సింగపూర్ పర్యటన.. చివరకు పెట్రోల్, డీజిల్ ఇబ్బందులపైనా గొడ్డలిపార్టీ వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలను గట్టిగా తిప్పికొట్టాలని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. గురువారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఎజెండా అంశాలు ముగిశాక.. తాజా రాజకీయ పరిణామాలపై ఆయన మంత్రులతో చర్చించారు. వైసీపీ నేతలకు విధ్వంస.. విమర్శ.. అవినీతి తప్ప రాష్ట్రాభివృద్ధి పట్టదని, అభివృద్ధి అంటేనే వారికి గిట్టదని సీఎం మండిపడ్డారు. అమరావతి నిర్మాణాలపై గొడ్డలి పార్టీ విమర్శలను దీటుగా ఎదుర్కోవాలన్నారు. 'నిర్మాణ ఖర్చులపై దుష్ప్రచారాలను తిప్పికొడుతూ వాస్తవాలను సోదాహరణగా ప్రజలకు చెప్పాలి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న నిర్మాణం వ్యయం.. మన దేశంలోనే కాదు.. ఇతర దేశాల నిర్మాణ ఖర్చుల కంటే తక్కువ. అన్నీ పరిశీలించాకే నిర్మాణ ధరలను నిర్ణయించాం. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం. ఇక్కడ నిర్మాణాలు పూర్తయిన తర్వాత ప్రపంచం నలుమూలల నుంచి ప్రతి ఒక్కరూ వాటిని చూడడానికే ఇక్కడకు వస్తారు' అని వ్యాఖ్యానించారు. రాష్ట్రాభివృద్ధిని గుడ్డిగా వ్యతిరేకిస్తూ విమర్శలు చేయడమే వైసీపీ నేతల లక్ష్యమని, వారి దుష్ప్రచారాలపై అప్రమత్తంగా ఉంటూ ఎక్కడికక్కడ నియంత్రించాలని మంత్రులకు సూచించారు. ఇటీవల తలెత్తిన పెట్రోలు, డీజిల్ సమస్యపైనా వాస్తవాలేమిటో ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో అత్యుత్తమ విధానాలు అమలు చేసేందుకు అధ్యయనం కోసం మంత్రులు చేపట్టిన సింగపూర్ యాత్రను కూడా తప్పుపట్టడం గొడ్డలి పార్టీకే చెల్లిందని విమర్శించారు. మంత్రుల బృందం అధ్యయనాలపై వ్యక్తిగతంగా తనకు నివేదికలు అందజేయాలని సూచించారు. సింగపూర్ అభివృద్ధి చెందిన తీరు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆ దేశం అనుసరిస్తున్న సుపరిపాలన విధానాలను తెలుసుకుని మన దగ్గర అమలు చేయడమే మంత్రుల పర్యటన ఉద్దేశమన్నారు.



భవిష్యత్ ఏఐ, ఐటీదే..

భవిష్యత్ మొత్తం కృత్రిమ మేధ (ఏఐ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)దేనని, ఒక స్థాయి ఉద్యోగాల నియామకాల్లో ఏఐ, ఐటీని తప్పనిసరి చేయాలని, ఈ విషయాన్ని మంత్రులందరూ అధ్యయనం చేసి, తగిన సూచనలు చేయాలని సీఎం కోరారు. వాటిపై పరిజ్ఞానం పెంచుకోకపోతే మంత్రులు కూడా వెనుకబడిపోతారని తెలిపారు. జలధార, జల హారతి కార్యక్రమంలో మంత్రుల భాగస్వామ్యం ఉండేలా చూడాలని మంత్రి నిమ్మల రామానాయుడికి ఆయన సూచించారు. పెరుగుతున్న ఎండలు, ఉష్ణోగ్రతలపై ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం ఇస్తూ అప్రమత్తం చేయాలని, మంత్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పీఎం సూర్యఘర్ లక్ష్యాల కోసం ఇంకా బాగా పనిచేయాలని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సూచించారు. ఈ సందర్భంగా సూర్యఘర్ కనెక్షన్ల లక్ష్యాలను మంత్రి సీఎంకు వివరించారు.

ఒక దశలో గూగుల్ రాలేమంది..

గూగుల్ డేటా సెంటర్‌ను తీసుకొచ్చే క్రమంలో చోటుచేసుకున్న పరిణామాలను సీఎం ప్రస్తావించారు. అమెరికా పర్యటనలో లోకేశ్ గూగుల్ ప్రతినిధులను కలిసి ఒప్పించిన తీరును వివరించారు. కేంద్ర ప్రభుత్వ పాలసీలతో ఉన్న సమస్యల వల్ల ఒకానొక దశలో గూగుల్ పెట్టుబడి పెట్టలేమని చెప్పిందన్నారు. కేంద్రంతో ఉన్న సఖ్యత వల్ల విధానాల్లో మార్పులు కూడా చేయించి.. గూగుల్ రాష్ట్రానికి తక్కువ కాలంలోనే వచ్చేలా జరిగిన కృషిని తెలియజేశారు. పుట్టపర్తి వద్ద ఏరోస్పేస్ డిఫెన్స్ క్లస్టర్‌కు వేగంగా అనుమతులు రావడం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగమని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఇందుకు కృషి చేసిన పరిశ్రమల కార్యదర్శి యువరాజ్‌ను కొనియాడారు.

4న వంద పరీక్షా కేంద్రాల్లో ఏపీ లాసెట్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): లా కోర్సుల్లో ప్రవేశానికి చేపట్టిన ఏపీ లాసెట్ ఈ నెల 4 వ తేదీ నిర్వహించనున్నట్టు తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ వీసీ ఉమ వెల్లడించారు. ఏపీలాసెట్ నిర్వహణ బాధ్యతను మహిళా విశ్వవిద్యాలయానికి ఉన్నత విద్యా మండలి బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మే 4వ తేదీ రెండు సెషన్లుగా ఏపీలాసెట్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మూడేళ్ల ఎల్ఎల్బీ ప్రవేశ పరీక్షను ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకూ, ఐదేళ్ల ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం ప్రవేశ పరీక్షను మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. 13 జిల్లాల్లో 100 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గుంటూరులో అత్యధికంగా 14 కేంద్రాలు, తిరుపతి జిల్లాలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 30,020 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరికి ఏప్రిల్ 20వ తేదీ నుంచే హాల్ టికెట్లు జారీ చేశామన్నారు. గతేడాది కంటే ఈ దఫా ఏపీ లాసెట్‌కు దరఖాస్తుల సంఖ్య పెరిగిందన్నారు. ఫలితాలను మే 20 లోపు విడుదల చేయడానికి ప్రయత్నిస్తామని వీసీ ఉమ తెలిపారు.

పాత కాంట్రాక్టర్లకే 'బాలసంజీవని'



వారికి అనుకూలంగా టెండర్ నిబంధనల రూపకల్పన.. గతేడాది బాలామృతంపై కూడా ఇదే ధోరణి

- కొందరు కోర్టుకెళ్లడంతో నాడు ఆగిన టెండర్లు
- ఐదారుగురు కాంట్రాక్టర్ల సేవలో మహిళాశిశు సంక్షేమశాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గర్భిణులకు పోషకాహారం అందించే బాలసంజీవని సరఫరా కాంట్రాక్టు టెండర్ల విషయంలో మహిళా శిశు సంక్షేమశాఖ పక్షపాత ధోరణి అవలంబిస్తోందన్న ఆరోపణలొస్తున్నాయి. గతంలో సరఫరా చేసినవారికే మళ్లీ టెండర్లు కట్టబెట్టేందుకు అనుకూలంగా నిబంధనలను రూపొందించారనే విమర్శలు వెల్లువెత్తాయి. గర్భిణులకు సరఫరా చేసే పోషకాహారాన్ని వివిధ వెరైటీలు సరఫరా చేసిన అనుభవం ఉన్న వారికి సాధారణంగా ఈ పథకం ద్వారా అర్హత కల్పించాల్సి ఉండగా, గత మూడేళ్లలో సరఫరా చేసిన వారినే మళ్లీ టెండర్లలో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొనడం ఆశ్చర్యం కలిగిస్తోంది. 2023-24, 2024-25, 2025-26 సంవత్సరాల్లో ఏడాదికి 2347 టన్నుల బాలసంజీవని ఉత్పత్తి, సరఫరా చేసిన అనుభవముండాలంటూ నిబంధన పెట్టారు. బాలసంజీవనిలోని ఆరు సరుకుల్లో కనీసం మూడింటిని గత మూడేళ్లలో ప్రభుత్వ సంస్థలకు సరఫరా చేసి ఉండాలని పేర్కొన్నారు. బిడ్డర్లకు గత మూడేళ్లలో ఏడాదికి ఏపీలోని 5583 డెలివరీ పాయింట్లలో సరఫరా చేసిన అనుభవం ఉండాలన్నారు. దీంతో ఇతర రాష్ట్రాల్లో గర్భిణులకు పోషకాహారం సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఈ బిడ్లలో పాల్గొనే అవకాశం లేకుండా చేశారు. బిడ్ విలువలో 50 శాతం మేరకు ప్రభుత్వ సంస్థలకు సరఫరా చేసి ఉండాలని నిబంధనల్లో పేర్కొన్నారు. తద్వారా రాష్ట్రంలో బాల సంజీవని సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు తప్ప ఏ ఇతరులకు ఈ టెండర్లు దక్కే అవకాశం లేకుండా చేశారు. రాష్ట్రంలో గతేడాదికి ఐదారుగురు కాంట్రాక్టర్లు జోన్ల వారీగా బాలసంజీవని ద్వారా గర్భిణులకు పోషకాహారాన్ని సరఫరా చేస్తున్నారు. తాజాగా ఈ ఏడాదికి సరఫరా చేసేందుకు పిలిచిన టెండర్లలో గతంలో సరఫరా చేసినవారే పాల్గొనేలా నిబంధనలు రూపొందించడంపై ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఏడాదికి రూ.167 కోట్ల బాలసంజీవని సరఫరా...

బాలసంజీవని ద్వారా రాష్ట్రంలో గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఏడాదికి రూ.167 కోట్ల విలువైన పోషకాహారం అందిస్తున్నారు. జోన్-1 కింద ఉత్తరాంధ్ర జిల్లాల్లో సరఫరా చేసేందుకు రూ.39.16 కోట్లు, జోన్-2 కింద గోదావరి జిల్లాల పరిధిలో రూ.37.65 కోట్లు, జోన్-3 పరిధిలో రూ.37.34 కోట్లు, జోన్-4లో రాయలసీమ పరిధిలో రూ.53.12 కోట్ల మేరకు బిడ్లు వేసుకోవాలని టెండర్లు పిలిచారు. బాలసంజీవని కింద ఒక్కో గర్భిణికి నెలకు రాగి పిండి 2 కేజీలు, బెల్లం 250 గ్రాములు, వేరుశనగ చిక్కీ 250 గ్రాములు, ఒక కేజీ అటుకులు సరఫరా చేస్తారు. బాలసంజీవని ట్రైబల్ కింద గోధుమపిండి 2 కేజీలు, వేరుశనగ చిక్కీ 500 గ్రాములు, రాగిపిండి ఒక కేజీ, బెల్లం 500 గ్రాములు, ఎండు ఖర్జూరం 500 గ్రాములు నెలవారీగా సరఫరా చేయాల్సి ఉంది.

పోషకాహార నిపుణులు హెచ్చరించినా..

రాష్ట్రంలో 13.80 లక్షల మంది పిల్లలకు సరఫరా చేసే బాలామృతం విషయంలోనూ మహిళాశిశు సంక్షేమశాఖ గతేడాది సెప్టెంబరులో ఇదే విధంగా టెండర్ల ప్రక్రియను వివాదాస్పదంగా చేపట్టింది. అప్పటికే ఆ శాఖలో నాలుగు జోన్లలో గర్భిణులకు బాలసంజీవని సరఫరా చేసే కాంట్రాక్టర్లకే... పిల్లలకు బాలామృతం సరఫరా కాంట్రాక్టును కట్టబెట్టే ప్రయత్నాలు చేశారు. ఆ సంస్థలు మాత్రమే టెండర్లకు అర్హత కలిగి ఉండేలా నిబంధనలు రూపొందించారు. న్యూట్రిషన్ పౌడర్/హెల్త్ మిక్స్ తయారీలో అనుభవం లేని సంస్థలకు కూడా అవకాశం కల్పించడం వల్ల శిశువుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని పోషకాహార నిపుణులు హెచ్చరించినా టెండర్లలో మొండిగా ముందుకెళ్లారు. టెండర్ పొందిన తర్వాత 8 నెలల్లో కొత్త తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని నిబంధనలు పెట్టడం ద్వారా న్యూట్రిషన్ రంగంలో పేర్కొందిన జాతీయ స్థాయి సంస్థలు పోటీ నుంచి తప్పుకుని, అనుభవం లేని కొత్త సంస్థలకు అవకాశం కలిగేలా చేశారు. నాడూ 'ఆంధ్రజ్యోతి' కథనాలు రాసింది. కొంతమంది కాంట్రాక్టర్లు కోర్టుకెళ్లడంతో హైకోర్టు ఆ టెండర్లను నిలిపేసింది.

లోయలో పడిన ఆటో.. నలుగురు మృతి

పాలకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. పాలకొండ మండలం జంపరకోట గ్రామానికి చెందిన గిరిజనులు గురువారం సీతంపేట మండలం పుబ్బాడ వెళ్లి వస్తుండగా మీనకోట-జంపరకోట గ్రామాల మధ్య ఘాట్‌రోడ్డులో ఆటో అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో పాలకొండ మండలం డోలమడ గ్రామానికి చెందిన అక్కుపల్లి రమణ(30)తో పాటు ఉర్లకశాంతి (30), కొండగొర్రి శ్రావణి(25) అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఆరికలక్ష్మి(55) పాలకొండ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది.

తెనాలిలో ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్మన్, హైకోర్టు సీజే



జస్టిస్ రామసుబ్రహ్మణియన్‌కు స్వాగతం పలుకుతున్న జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప తెనాలిలోని తన నివాసంలో గురువారం ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ రామసుబ్రహ్మణియన్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ హాజరయ్యారు. 15 మందికి పైగా హైకోర్టు న్యాయమూర్తులు కూడా పాల్గొన్నారు. వారికి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, తహసీల్దార్ గోపాలకృష్ణ స్వాగతం పలికారు. కాగా.. తెనాలి వచ్చిన జస్టిస్ రామసుబ్రహ్మణియన్ పెదరావూరులోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం వరకు ఆయన తెనాలిలోనే ఉంటారని, శుక్రవారం కూడా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి నివాసంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని శక్రవారం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళతారని అధికార వర్గాలు వెల్లడించాయి.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- తక్షణమే మంత్రివర్గ ఉప సంఘం సమావేశం నిర్వహించాలి
- ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి తక్షణమే మంత్రివర్గ ఉపసంఘం సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించి స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేసినట్టు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. 2004కు ముందు నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉద్యోగులందరికీ యాక్ట్ 57 ద్వారా పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2004కు ముందు నోటిఫికేషన్, 1-9-2004 తర్వాత నియమితులైన ఐఏఎస్, ఏపీఎస్ అధికారులకు కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఓపీఎస్ వర్తింపజేసినందున తక్షణమే రాష్ట్రంలోనూ అదే విధానం అమలు చేయాలని కోరారు. పబ్లిక్ సెక్టార్, గురుకులాలు, సొసైటీల ఉద్యోగులకు కూడా పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు.


ఉగ్రవాద మైనర్‌కు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బెనెక్స్ కామ్ గ్రూపు ద్వారా సామాజిక మాధ్యమాల్లో ఉగ్రవాద సంస్థలకు చెందిన నేతల ప్రసంగాల వీడియోలను, ఉగ్రవాద సాహిత్యాన్ని ప్రచారం చేసిన కేసులో 16 ఏళ్ల బాలుడికి జువనైల్ జస్టిస్ బోర్డు రిమాండ్‌ను పొడిగించింది. అతనికి ఏడో తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ గురువారం ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతం అతడు బాలల సంరక్షణ కేంద్రంలో ఉన్నాడు. అతని బెయిల్ పిటిషన్‌పై విచారణను నాలుగో తేదీకి వాయిదా వేసింది. ఈ బాలుడిని వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కొత్తపేట పోలీసులు దాఖలు చేసి పిటిషన్‌పై విచారణ కూడా అదే తేదీకి వాయిదా పడింది.

పోలీసుల అదుపులో అత్యాచార నిందితుడు

రెంటచింతల, ఏప్రిల్ 30 : విశాఖ-హైదరాబాద్ రైలులో మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు బగిడిని విజయవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైలు ఏసీ బోగీలో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్న బగిడి ఘటన జరిగిన రోజు కూపేలో ఎవరూ లేకపోవడాన్ని గమనించాడు. బోగీ మెట్ల వద్ద దంపతులు కూర్చొని ఉండటం చూసి ఆ మహిళను కూపేలోకి తీసుకెళ్లాడు. నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఒకరోజు తర్వాత రెంటచింతల పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది.

పదిలో పెరిగిన ఉత్తీర్ణత



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

పది ఫలితాల్లో భాష్యం విద్యార్థుల సత్తా

గుంటూరు(విద్య), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో భాష్యం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. గుంటూరులోని మెయిన్ క్యాంపస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థి దినేష్ 600 మార్కులకు 598 మార్కులతో రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచినట్టు వెల్లడించారు. అదే విధంగా కె.సాయికార్తీక్ 597, ఎన్‌వీ.శ్రీశ్రావ్య 597, టి.లోకేష్ 597, బి.ఇ.శార్వీ 596, బి.వి.యశశ్రీ 596, ఎం.మనోజ్ఞ 596, జి.లోహితాశ్రీ 596, జె.ఎస్.సాయిఆదిత్య 596, కె.లాస్య 596 మార్కులు సాధించారని తెలిపారు. 590కి పైగా మార్కులు 214 మంది, 580కి పైగా 1108, 570కి పైగా 2293, 550కి పైగా 4253, 500కి పైగా 7515 మంది విద్యార్థులు సాధించారన్నారు. గణితంలో 100కు 100 సాధించిన విద్యార్థులు 1753, 95 ఆ పైగా 4824, 90 ఆ పైగా 6494 మంది, సైన్స్‌లో 100కు 100 సాధించిన విద్యార్థులు 464 మంది ఉన్నారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులను ఛైర్మన్ రామకృష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంత రావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు అభినందించారు.

కేశవరెడ్డి విద్యార్థుల విజయ విహారం



కేశవరెడ్డి

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పదో తరగతి ఫలితాల్లో మరే ఇతర విద్యాసంస్థకు సాధ్యం కాని రీతిలో నాలుగు స్టేట్ టాప్ 597 మార్కుల్లో రెండింటిని కైవసం చేసుకొని రికార్డ్ సృష్టించిన కేశవ రెడ్డి విద్యా సంస్థల విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ ఎస్ఎస్‌సీ ఫలితాల్లోనూ అదే ఒరవడి కొనసాగించారు. తమ విద్యార్థులు జె.అభిషక్త్ 597 మార్కులు, యం.ఆఫషీన్ ఫాతిమ 597 మార్కులు, బి.మోహిత్ రెడ్డి, యం.ప్రణీత, తనూజ చిత్ర, యం.హారిక, పి.లక్ష్మీ సౌమ్య, యు.సాఫియా ఫలిక్, ఎ.వెంకట ఫణీంద్ర రెడ్డి 596 మార్కులు సాధించి మరోసారి కేశవరెడ్డి విద్యా సంస్థల ఆధిక్యతను చాటారని ఫౌండర్ ఛైర్మన్ ఎన్.కేశవ రెడ్డి తెలిపారు. 595 ఆపైగా మార్కులు 11 మంది, 594 ఆపైగా 18 మంది, 593 ఆపైగా 29 మంది, 592 ఆపైగా 36 మంది, 591 ఆపైగా 46 మంది, 590 ఆపైగా మార్కులు 50 మంది విద్యార్థులు సాధించారని వెల్లడించారు. నిరంతర శ్రమ, 33 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ,స్టేట్ కరికులంతో కూడిన విధానాలను అనుసరించడం తమ విజయ రహస్యాలని చెప్పారు. ఈ ఘన విజయంలో పాలు పంచుకున్న విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కేశవ రెడ్డి అభినందనలు తెలిపారు.

శ్రీ విశ్వశాంతి విద్యార్థుల ప్రతిభ

విజయవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో శ్రీ విశ్వ శాంతి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. గురువారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఎస్.కె.షమీమ్ 596 మార్కులు సాధించాడు. సూరపనేని పావని 592 మార్కులు, జీహెచ్ఎస్.నాగ వెంకట్ 591 మార్కులు, కె.శ్రీశ్రిక 590 మార్కులు సాధించారు. 78 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. ఈ విజయాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, సంస్థ ఛైర్మన్ మాదల సుబ్రమణ్యేశ్వరరావు, డైరెక్టర్ మాదల సూర్య శేఖర్, చీఫ్ కో ఆర్డినేటర్ ఎస్.హరిహరనాథాచార్యులు అభినందించారు.

శ్రీ చైతన్య స్కూల్ ఆల్ టైమ్ రికార్డ్

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో స్టేట్ టాప్ మార్క్ 599తో శ్రీ చైతన్య స్కూల్ ఆల్ టైమ్ రికార్డ్ సృష్టించిందని డైరెక్టర్ సీమ తెలిపారు. రాష్ట్రంలో ఒకే ఒక్క విద్యార్థి 599 మార్కులు సాధించగా, ఆ విద్యార్థి శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి కావడం తమకు గర్వకారణమని చెప్పారు. అంతేకాకుండా 598 ఆ పైన మార్కులు 18 విద్యార్థులు సాధించారని.. 597 ఆ పైన 64 మంది, 596 ఆ పైన 139 మంది, 595 ఆ పైన 258 మంది, 590 ఆపైన 1,245 మంది, 580 ఆ పైన మార్కులు 4,352 మంది విద్యార్థులు సాధించారని వెల్లడించారు. శ్రీ చైతన్య స్కూల్ సగటు మార్కులు 521 సాధించిందని, మొత్తం ఉత్తీర్ణత శాతం 99 శాతంగా నమోదైందని ఆమె తెలిపారు. శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన సుమారు 100 బ్రాంచ్‌లు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయని పేర్కొన్నారు. ఫస్ట్ లాంగ్వేజ్‌లో 5997 మంది 100/100 మార్కులు సాధించారని, సెకండ్ లాంగ్వేజ్-608, ఇంగ్లిష్ 15, మాథ్స్- 4470, సైన్స్-1247, సోషల్-2367, వివిధ సబ్జెక్టుల్లో 14,703 మంది 100/100 మార్కులు సాధించారని తెలిపారు. ఈ గొప్ప విజయానికి కారణమైన విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధనా సిబ్బందిని ఆమె అభినందించారు.




విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ


నారాయణ చారిత్రక విజయం

విజయవాడ (భారతీనగర్), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు పది మంది 598 అత్యధిక మార్కులు సాధించి చరిత్ర సృష్టించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. గురువారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరచడంతో విజయవాడలోని నారాయణ స్కూల్‌లో విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ మాట్లాడుతూ 597 మార్కులు తొమ్మిది మంది, 596 మార్కులు 33 మంది, 595 మార్కులు 37 మంది, 594 మార్కులు 50 మంది, 593 మార్కులు 63 మంది, 592 మార్కులు 91 మంది, 591 మార్కులు 116 మంది, 590 మార్కులు 99 మంది సాధించారని వెల్లడించారు. నారాయణ విద్యాసంస్థల్లో గణితంలో 100కి 100 మార్కులు 2786 మంది, సైన్స్‌లో 100కి 100 మార్కులు 782 మంది, సంఘిక శాస్త్రంలో 100కి 100 మార్కులు 1284 మంది, తెలుగులో 100కి 100 మార్కులు 2432 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 520.7 సగటు మార్కులు సాగించిన ఏకైక విద్యాసంస్థ నారాయణ మాత్రమే అని స్పష్టంచేశారు. నారాయణ విద్యాసంస్థల కోర్ కమిటీ సభ్యురాలు రమా నారాయణ మాట్లాడుతూ రికార్డు స్థాయి మార్కులు సాధించడం, ఏటేటా నారాయణ ఫలితాలను నారాయణ విద్యార్థులే అధిగమించడం ఓ ఆనవాయితీగా మారిందని అన్నారు.

డా.కె.కె.ఆర్ గౌతమ్ విద్యార్థుల హవా



ఆర్.హేమశ్రీరెడ్డి



డి.మదీహ

గుడివాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో డా.కె.కె.ఆర్ గౌతమ్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని యాజమాన్యం తెలిపింది. తమ విద్యార్థి ఆర్.హేమశ్రీరెడ్డి 600 మార్కులకు 598 మార్కులు సాధించినట్టు వెల్లడించింది. అదే విధంగా డి.మదీహ 596, బి.నిహారిక 595, పి.ఆశ్రిత్ 595 మార్కులతో డా.కె.కె.ఆర్ గౌతమ్ స్కూల్స్ విజయ పతాకాన్ని ఎగురవేశారని పేర్కొంది. అంతేకాకుండా వివిధ బ్రాంచీల్లో 590 మార్కులు పైన సాధించిన వారు 61 మంది కాగా, 580 మార్కులు పైన సాధించిన వారు 303 మంది, 505 మార్కుల పైన సాధించిన వారు 1575 మంది ఉన్నారని చెప్పింది. స్కూల్స్ సగటు మార్కుల శాతం 87.01గా నమోదైనట్టు వివరించింది. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి స్కూల్స్ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేశారు. 16 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు. 2161 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. జిల్లాల వారీగా చూస్తే పార్వతీపురం మన్యం జిల్లా 96.07%తో టాప్‌లో నిలిచింది. అల్లూరి సీతారామ రాజు జిల్లా 57.12%తో చివరన ఉంది. మేనేజ్‌మెంట్ల వారీగా అయితే ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు 96.04% ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచాయి. ఇక పాసైన మొత్తం విద్యార్థుల్లో 83.69% మంది ఫస్ట్ డివిజన్‌లో ఉత్తీర్ణులయ్యారు. విశాఖపట్నానికి చెందిన జ్ఞానేశ్వరి 599 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలిచింది. 47 మంది విద్యార్థులకు 598 మార్కులు రావడం విశేషం.

ద్వితీయ భాషలో దాదాపు అందరూ పాస్

సబ్జెక్టుల వారీగా చూస్తే.. ద్వితీయ బాషా సబ్జెక్టులో దాదాపుగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఈ సబ్జెక్టులో 99.82% ఉత్తీర్ణత సాధించారు. ఆ తర్వాత ఇంగ్లిష్‌లో 98.65%, ప్రథమ భాషా సబ్జెక్టులో 93.95%, సోషల్‌లో 93.92%, గణితంలో 93.64%, సైన్స్‌లో 91.28% ఉత్తీర్ణత నమోదైంది.

ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు 96.04%

మేనేజ్‌మెంట్ల వారీగా ఉత్తీర్ణతను పరిశీలిస్తే.. ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు 96.04%తో టాప్‌లో ఉన్నాయి. 96.02%తో బీసీ సంక్షేమ పాఠశాలలు ఆ తర్వాతి స్థానంలో నిలిచాయి. ప్రైవేటు పాఠశాలలు 95.29%, మోడల్ 89.5%, సాంఘిక సంక్షేమ 89.41%, ఆశ్రమ్ పాఠశాలలు 70.09%, కేజీబీడీలు 88.81%, గిరిజన సంక్షేమ పాఠశాలలు 75.04%, జిల్లా పరిషత్ 78.09%, ఎయిడెడ్ 76.55%, మున్సిపల్ పాఠశాలలు 72.02%, ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలలు 69.63% ఉత్తీర్ణత సాధించాయి.

ఇతర మీడియాల్లోనూ మెరుగ్గా

తెలుగు మీడియంలో పరీక్షలు రాసిన 30,129 మందిలో 19,834 (65.83%) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు 86.28% ఉత్తీర్ణత సాధించారు. ఇక హిందీ మీడియంలో 85.71%, ఉర్దూలో 76.76%, కన్నడలో 76.82%, తమిళంలో 95.54%, ఒడియా మీడియంలో 98.43% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

0 శాతం.. 100 శాతం

రాష్ట్రవ్యాప్తంగా 16 పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీటిలో ఒక జడ్పీ పాఠశాల, రెండు ఎయిడెడ్, 11 ప్రైవేటు, రెండు ఆశ్రమ్ పాఠశాలలు ఉన్నాయి. ఈ మొత్తం పాఠశాలల్లో టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు 64 మంది మాత్రమే. మరోవైపు 2161 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. వీటిలో ప్రభుత్వ మేనేజ్‌మెంట్ స్కూళ్లు 12, జడ్పీ 399, మోడల్ 13, మున్సిపల్ స్కూల్ ఒకటి, ఏపీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు 11, సాంఘిక సంక్షేమ పాఠశాలలు 16, గిరిజన సంక్షేమ 15, కేజీబీవీలు 54, బీసీ సంక్షేమ 31, ఎయిడెడ్ 15, ప్రైవేటు 1,542, ఆశ్రమ్ పాఠశాలలు 52 ఉన్నాయి. గతేడాది 19 పాఠశాలల్లో సున్నా శాతం, 1681 బడుల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది.

పదేళ్ల ఉత్తీర్ణత వివరాలు.. శాతాల్లో

సంవత్సరం	బాలురు	బాలికలు	మొత్తం ఉత్తీర్ణత
2015	91.15	91.71	91.42
2016	94.3	94.77	94.52
2017	91.87	91.97	91.92
2018	94.41	94.56	94.48
2019	94.68	95.09	94.88
2022	64.02	70.7	67.26
2023	69.27	75.38	72.26
2024	84.32	89.17	86.69
2025	78.31	84.09	81.14
2026	82.68	87.9	85.25

2026లో ఉత్తీర్ణత వివరాలు

	హాజరు	ఉత్తీర్ణత	శాతం
బాలురు	3,14,018	2,59,633	82.68
బాలికలు	3,04,113	2,67,321	87.9
మొత్తం	6,18,131	5,26,954	85.25

84 శాతం మందికి ఫస్ట్ డివిజన్

ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో అత్యధికులు ఫస్ట్ డివిజన్‌లోనే పాసయ్యారు. మొత్తం 5,26,954 మంది ఉత్తీర్ణులైతే 4,40,995 (83.69%) మంది ఫస్ట్ డివిజన్‌లో పాసయ్యారు. 62,572(11.87%) మంది సెకండ్ డివిజన్‌లో, 23,387(4.44%) మంది థర్డ్ డివిజన్‌లో పాసయ్యారు. జిల్లాల వారీగా చూస్తే.. పార్వతీపురం మన్యం 96.07%తో టాప్‌లో నిలిచింది. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ 95.85%తో ఆ తర్వాతి స్థానంలో ఉంది. విజయనగరం 91.08%తో మూడో స్థానంలో, అల్లూరి సీతారామరాజు చివరన, కర్నూలు చివరి నుంచి రెండో స్థానంలో ఉంది.

మే 25 నుంచి సప్లిమెంటరీ

సప్లిమెంటరీ పరీక్షలు మే 25 నుంచి జూన్ 4 వరకు జరుగుతాయని పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. మే 1 నుంచి 9 వరకు ఫీజులు చెల్లించవచ్చు. ఫైన్‌తో 24 వరకు కట్టొచ్చు. అలాగే 1 నుంచి 7 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాలి. ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్ మార్కుల మెమోలు త్వరలో పాఠశాలలకు పంపుతారు.

ఫెయిలైన విద్యార్థులకు ఫోన్ కాల్స్: డైరెక్టర్

పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు భరోసానిచ్చేందుకు, తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా టీచర్ల ద్వారా ఫోన్ కాల్స్ చేయిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఫెయిలైన విద్యార్థులపై ఎక్కువ దృష్టి సారిస్తామన్నారు. పాఠశాలల వారీగా విద్యార్థుల జాబితాలు సేకరించి మండల లేదా పాఠశాల స్థాయిల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేస్తామని తెలిపారు. ఉత్తీర్ణత శాతం పెరగడం, బాలికల ఉత్తీర్ణత ఇంకా పెరగడం మంచి పరిణామమని అన్నారు. పరీక్షలకు ముందు పాఠశాల విద్యా శాఖ అమలు చేసిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక మంచి ఫలితాలకు దోహదం చేసిందన్నారు.

ఉత్తీర్ణత పెరగడం స్ఫూర్తిదాయకం: సీఎం

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం 72.8 నుంచి 78.2కు పెరగడం స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు చెబుతూ ఎక్స్‌లో పోస్టు చేశారు. బాలురు కంటే బాలికల ఉత్తీర్ణత 5.22% పెరగడం సంతోషకరమన్నారు. విద్యా శాఖ రూపొందించిన వంద రోజుల ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు వచ్చాయని ప్రశంసించారు. మంత్రి లోకేశ్, విద్యాశాఖ అధికారులు, టీచర్లు, సిబ్బందిని అభినందించారు.



ఆసుపత్రి నుంచి వచ్చి..

పట్టుదల, సంకల్పం ఉంటే సాధించలేనిదేమీ ఉండదని అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తెనుగుపూడి అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థి దుర్గాప్రసాద్ నిరూపించాడు. దుర్గాప్రసాద్ టెన్త్ పరీక్షల ముందు ప్రమాదవశాత్తూ మేడపై నుంచి కింద పడటంతో నడుము, వెన్నెముక దెబ్బతిన్నాయి. అయినా పరీక్షలు రాస్తానని పట్టుబట్టాడు. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడిని కుటుంబ సభ్యులు ఆటోలో పరీక్ష కేంద్రం వద్దకు తీసుకువచ్చి, అక్కడి నుంచి మోసుకుంటూ లోనికి తీసుకువెళ్లేవారు. విద్యార్థి ప్రమాదానికి గురైన విషయాన్ని జిల్లా అధికారులకు ప్రిన్సిపాల్ తెలియజేయడంతో సహాయకుడిని ఏర్పాటుచేశారు. తాజా ఫలితాల్లో దుర్గాప్రసాద్‌కు 439 మార్కులు వచ్చాయి.

4100 మంది.. 590 దాటారు

టెన్త్ ఫలితాల్లో ఏకంగా 4100 మంది విద్యార్థులకు 590 మార్కులు దాటాయి. ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో టాపర్లకు 596 మార్కులొచ్చాయి. బాపట్ల, కాకినాడ, కోనసీమ, నంద్యాల జిల్లాల్లో నలుగురు విద్యార్థులకు 596 మార్కులు వచ్చాయి.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాలను ఓపెన్ స్కూల్ సొసైటీ గురువారం విడుదల చేసింది. పదో తరగతిలో 24,949 మంది పరీక్షలు రాయగా, 6277 (25.12శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ పరీక్షలను 55,048 మంది రాయగా, 23,755(43.15శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. టెన్త్ ఉత్తీర్ణతలో 83.07 శాతంతో కోనసీమ జిల్లా టాప్‌లో నిలిచింది. 1.03 శాతంతో బాపట్ల చివరన ఉంది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతలో 79.55 శాతంతో కోనసీమ టాప్‌లో ఉండగా, 10.33 శాతంతో బాపట్ల చివరన నిలిచింది.

లోకేశ్‌కు అభినందనలు

పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. లోకేశ్ దార్శనికత, పక్కా ప్రణాళికతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పడిందన్నారు. కాగా విద్యావంతుడైన నాయకుడు విద్యాశాఖ బాధ్యతలు చేపడితే ఫలితాలు ఎంత అద్భుతంగా ఉంటాయో పదో తరగతి ఫలితాలు నిరూపిస్తున్నాయని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు.

సంక్షేమ గురుకులాల హవా

పదోతరగతి పరీక్షల ఫలితాల్లో సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు సత్తాచాటారు. 89 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 13,538 మంది పరీక్షలు రాయగా, 12,115 మంది పాసయ్యారు. ఇక మహాత్మా జ్యోతి రావు పూలే బీసీ గురుకుల పాఠశాలల విద్యార్థులు 96.02 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 5501 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 5274 మంది పాసయ్యారు. గత ఏడాది కంటే బీసీ గురుకులాల్లో ఉత్తీర్ణత 1.02 శాతం పెరిగింది. మంత్రులు డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, సవిత విద్యార్థులను అభినందించారు.

ప్రత్యేక పాఠశాలల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత

విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు టెన్త్ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తం 54 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులకు మంత్రి డోలా అభినందనలు తెలిపారు.



కొత్తపల్లి జ్ఞానేశ్వరికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

డాక్టర్ కావాలన్నదే లక్ష్యం

-స్టేట్ టాపర్ జ్ఞానేశ్వరి

పదో తరగతి పరీక్షల్లో విశాఖకు చెందిన కొత్తపల్లి జ్ఞానేశ్వరి 600 మార్కులకు 599 సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచింది. ఇంగ్లిష్ (99) మినహా మిగిలిన ఐదు సబ్జెక్టులలో 100కు 100 మార్కులు సాధించింది. ఎన్ఏడీ జంక్షన్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో చదివింది. జ్ఞానేశ్వరి తండ్రి శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం దిమిలి ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా, తల్లి విజయభారతి నేవల్ డాక్‌యార్డులో పనిచేస్తున్నారు. 'రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉంది. డాక్టర్ కావాలన్నదే నా ఆశయం. నాకు చిన్నతనం నుంచి వైద్యం అందించిన పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ బీవీ ఆదినారాయణ ప్రేరణ. ఎప్పుడైనా ఒత్తిడి అనిపిస్తే బొమ్మలు గీసే అలవాటుంది. ఎక్కువగా కథల పుస్తకాలు చదువుతుంటాను. స్టేట్ టాపర్‌గా నిలవడం వెనుక తల్లిదండ్రులు, స్కూలు టీచర్ల కృషి, ప్రోత్సాహం ఎంతో ఉంది' అని కొత్తపల్లి జ్ఞానేశ్వరి సంతోషం వ్యక్తం చేసింది.



తల్లి శిరీషతో తనయుడు హర్ష

తల్లీతనయుల ఉత్తీర్ణత

తిరుపతి జిల్లా రేణిగుంటకు చెందిన తల్లి, తనయుడు పదో తరగతి పరీక్షల్లో ఒకేసారి ఉత్తీర్ణులయ్యారు. రేణిగుంట పట్టణంలోని బుగ్గవీధికి చెందిన శిరీష బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్నారు. టెన్త్ మధ్యలో మానేసిన ఆమెకు రెండు దశాబ్దాల తర్వాత చదువుకోవాలని ఆసక్తి కలిగింది. చిన్నకుమారుడు శ్రీహర్షతో కలసి టెన్త్ పరీక్షలు రాశారు. తాజా ఫలితాల్లో ఇద్దరూ ఉత్తీర్ణులయ్యారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణానికి చెందిన తల్లీకుమారుడు బండారు లక్ష్మీలహరి, విజయ్ ఒకేసారి టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. బండారు లక్ష్మీలహరి ఏపీఓఎస్ఎస్ ద్వారా పదో తరగతి పరీక్షలు రాశారు. విజయ్ 562 మార్కులతో మంచి ప్రతిభ కనబరిచాడు. లక్ష్మీలహరి 500 మార్కులకు 360 మార్కులు సాధించారు.



తల్లీకుమారుడు లక్ష్మీ లహరి, విజయ్

- (ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



తండ్రి జిల్లా బాబుతో కూతురు చిట్టి

తండ్రీతనయ ఘనత

పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మల్లవరం గ్రామానికి చెందిన జిల్లా బాబు రావు(42), ఆయన కుమార్తె చిట్టి ఇద్దరూ పదో తరగతి పరీక్షల్లో ఒకేసారి పాసయ్యారు. జిల్లా బాబురావు పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీలో వెల్డర్‌గా పనిచేస్తున్నారు. 24 ఏళ్ల క్రితం 9వ తరగతి వరకు చదివారు. ఇన్నేళ్ల తర్వాత టెన్త్ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది చిట్టి పదో తరగతి పరీక్షలు రాయగా, బాబు రావు కూడా ఓపెన్ స్కూల్ ద్వారా ఫీజు చెల్లించి పదో తరగతి పరీక్షలు రాశారు. కుమార్తెకు 448 మార్కు లు రాగా, తండ్రికి 257 మార్కులు వచ్చాయి.



పూర్ణిమ

అమ్మ చనిపోయిన బాధలోనూ..

చిత్తూరు జిల్లా నగరి మున్సిపాలిటీ పరిధిలోని నెత్తంకండ్రిగకు చెందిన పూర్ణిమ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివింది. పబ్లిక్ పరీక్షల ప్రారంభానికి ముందురోజు ఆమె తల్లి మరణించింది. అంతటి దుఃఖంలోనూ పదో తరగతి పరీక్షలు రాసి 530 మార్కులు సాధించింది.

సింఘాల్ దోషి!

(మొదటి పేజీ తరువాయి)

అంశాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ దినేశ్‌కుమార్‌ను ఏకసభ్య కమిషన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 20న జీవో 458 జారీ చేసింది. 45 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే, విచారణ సంక్లిష్టంగా ఉండటంతో మధ్యలో కమిషన్ విచారణ గడువును పొడిగించారు. దినేశ్‌కుమార్ విచారణ ఇప్పుడు కొలిక్కివచ్చింది. అనేక అంశాలపై సమగ్ర పరిశీలన చేసి నివేదిక రూపొందించి ఆయన ప్రభుత్వానికి అందించారు. నిబంధనల సడలింపు వల్లే కల్తీనెయ్యి సరఫరాకు ఆస్కారం ఏర్పడిందని, ఇందులో నాటి టీటీడీ ఈవో, ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్ సింఘాల్ పాత్ర ఉందని విచారణ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిసింది. నిబంధనల సడలింపు ఉద్దేశ్యపూర్వకంగా చేసినా, చేయకపోయినా తప్పు అయితే జరిగిందని, దీని వల్లే కల్తీనెయ్యి సరఫరాకు అవకాశం ఏర్పడిందని ఆ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఈవోకు దిశానిర్దేశం చేయాల్సిన కొనుగోలు విభాగం వైఫల్యం ఉందని కూడా తెలిపినట్టు సమాచారం. నాటి కొనుగోలు విభాగం జనరల్ మేనేజర్, ఫైనాన్షియల్ అడ్వయిజర్ అండ్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎఫ్ఏసీఏవో) వైఫల్యాలు, తప్పులు ఉన్నాయని కూడా నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బాధ్యులైన అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని దినేశ్‌కుమార్ సిఫారసు చేసినట్లు తెలిసింది. టీటీడీలో నెయ్యి సహా ఇతర కీలకమైన పదార్థాల కొనుగోలు విధానం, టెండర్లు, నిబంధనలు మరింత కఠినతరం చేయాలని కమిషన్ సిఫారసు చేసినట్లు తెలిసింది. టెండర్ నిబంధనల ప్రకారం ఏది తక్కువ ధరకు లభిస్తే దాన్ని ఎంపిక చేయడం అన్ని అంశాల్లో సరైన పద్ధతి కాదని, అలా చేసినందువల్లే టీటీడీలో కల్తీనెయ్యికి ఆస్కారం ఏర్పడిందని కమిషన్ స్పష్టం చేసినట్లు తెలిసింది. తిరుమలకు సరఫరా అయ్యే నెయ్యి అత్యంత నాణ్యమైనదయి ఉండాలని, చీపెస్ట్, లోయెస్ట్ విధానాలను ప్రామాణికంగా తీసుకొని టెండర్లు నిర్వహిస్తే కల్తీ సరుకులు సరఫరా అయ్యే అవకాశం ఉందని ఈ ఉదంతం ప్రత్యక్షంగా నిరూపించిందని తెలిపింది. ఈ విధానంలో మార్పులు తీసుకొచ్చి, నాణ్యతగల నెయ్యి సరఫరానే ప్రామాణికంగా తీసుకొనేలా టెండర్ నిబంధనలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫారసు చేసింది. ఇంకా కొనుగోలు, పాలన, విజిలెన్స్, పర్యవేక్షణ వంటి అనేక అంశాల్లో సమూల మార్పులు తీసుకురావాలని, జవాబుదారీని తీసుకొచ్చేలా విధానాలు అమలు చేయాలని కమిషన్ సిఫారసు చేసినట్లు తెలిసింది.

ఇదీ నేపథ్యం... సీనియర్ ఐఏఎస్ అనిల్ కుమార్ సింఘాల్ తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే 2015, మే 6న టీటీడీ ఈవోగా నియమితులయ్యారు. ఆ తర్వాత 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక కూడా ఆయనే ఈవోగా కొనసాగారు. 2020, సెప్టెంబరు 30 దాకా ఆయనే ఆ పదవిలో ఉన్నారు. ఆ తర్వాత ఆయన స్థానంలోకి జగన్ ప్రభుత్వం ధర్మారెడ్డిని తీసుకొచ్చింది. నిజాయితీపరుడు, బాగా పనిచేస్తారు, సమర్థుడన్న పేరు అనిల్ సింఘాల్‌కు ఉంది. కానీ, ఆయన మౌనం, కీలక అంశాల్లో దేవస్థానం బోర్డు తీసుకునే నిర్ణయాలను అడ్డుకోలేకపోవడం, టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రతిపాదనలను వ్యతిరేకించి అడ్డుకోలేకపోవడమే ఇప్పుడు ఆయనను చిక్కుల్లో పడేసింది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో, (2019 తొలి నెలలు) సింఘాల్ ఈవోగా ఉన్న కాలంలోనే నెయ్యి కొనుగోలు టెండర్ నిబంధనలను కఠినరం చేశారు. అడ్డగోలు కంపెనీలు, పాల ఉత్పత్తి, సేకరణతో సంబంధం లేని సంస్థలు టెండర్లలో పాల్గొనకుండా కఠినమైన రూల్స్ తీసుకొచ్చారు. కానీ. జగన్ ప్రభుత్వం వచ్చాక, టీటీడీ ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉన్న సమయంలోనే, అంటే 2020లో నెయ్యి కొనుగోలులో ఉన్న కఠినమైన నిబంధనలను సడలించారు. అంటే, పారదర్శకత, జవాబుదారీ ఆశించి 2019లో తీసుకొచ్చిన కఠిన నిబంధనలను సడలించారన్నమాట! నెయ్యి సరఫరా చేసే కంపెనీలు పాల సేకరణే చేయాల్సిన అవసరం లేదన్నట్లుగా రూల్స్‌ను బోర్డులో ఆమోదించారు. ఆ తర్వాత అమలు చేశారు. వీటిని అడ్డుకొనే అధికారం ఈవోకు ఉంది. ఎందుకంటే, అంతకుముందు ఏడాది, అంటే 2019లోనే కఠిన తరం చేసిన నిబంధనలను ఎందుకు ఇప్పుడు సులభతరం చేయాలని ప్రశ్నించే అధికారం ఈవోకు ఉంది. తీర్మానంలో డిస్సెంట్ (పూర్తి భిన్నాభిప్రాయం) వ్యక్తం చేసే అధికారం కూడా ఉంది. కానీ ఈవో నుంచి ఎలాంటి వ్యతిరేకతా లేదని సీబీఐ సిట్ తేల్చింది. దీంతో నాటి పాలకమండలి కోరుకున్నట్లుగానే నెయ్యి కొనుగోలు నిబంధనల సడలింపు సజావుగా సాగిపోయిందని సిట్ చెప్పింది. సింఘాల్‌పై తగు చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది.

కిం కర్తవ్యం?: సీబీఐ సిట్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 1న టీటీడీ ఈవోగా అనిల్ సింఘాల్‌ను తప్పించింది. అదేరోజున 'ఆంధ్రజ్యోతి' 'జగన్ ఖాతాలో మరో బలి' శీర్షికన వార్తను ప్రచురించింది. ఇప్పటి వరకు సింఘాల్‌కు పోస్టింగ్ లేదు, వెయిటింగ్‌లోనే ఉన్నారు. దినేశ్‌కుమార్ విచారణ నివేదిక వచ్చాక ఆయనకు పోస్టింగ్ ఇవ్వాలని సర్కారు భావించింది. అయితే, ఈవోగా సింఘాల్ ఉండగా జరిగిన నిబంధనల సడలింపు వల్లే కల్తీనెయ్యి సరఫరాకు ఆస్కారం ఏర్పడిందని, ఆయన సరైన శ్రద్ధ, బాధ్యతగల పర్యవేక్షణ చూపలేదని దినేశ్ కుమార్ కమిషన్ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. కల్తీనెయ్యి కేసులో ఆయన పాత్ర ఉందని ఇప్పుడు దినేశ్‌కుమార్ నివేదిక ఇవ్వడంతో సింఘాల్‌పై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకోనుందన్న ఉత్కంఠ నెలకొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 1-5-2026 | పేజీలు: 8 + 10 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 24 | సంచిక (Issue) : 54 | శ్రీ పరాభవనామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా.10:53 తదుపరి పాడ్యమి; నక్షత్రం: స్వాతి తె.4:35 తదుపరి విశాఖ; వర్జ్యం: ఉ.8:25-10:10; దుర్ముహూర్తం: ఉ.8:24-9:15, మ.12:37-1:28; అమృతఘడియలు: రా.6:56-8:41; రాహుకాలం: ఉ.10:30-12:00; సూర్యోదయం: 5:53; సూర్యాస్తమయం: 6:31 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వాణిజ్య లబ్ధి..!

న్యూజిలాండ్‌తో భారతదేశం కుదుర్చుకున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందంమీద పలు అనుమానాలు, విమర్శలు ఉన్నప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఈ తరహా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలకు ఇది కొనసాగింపు. దేశాలన్నీ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో) నియమ నిబంధనలకు లోబడి చేసుకొనే వ్యాపారానికి పలుకారణాల రీత్యా ఉల్లంఘనలు, వ్యతిరేకతలతో ఆ వ్యవస్థ బలహీనపడుతున్న తరుణంలో, ఓ రెండు దేశాలు తమ అవసరాలు, ప్రయోజనాలకు లోబడి కొన్ని రంగాలకు మాత్రమే పరిమితమైన ఎఫ్‌టీఏలను కుదుర్చుకోవడం పెరిగింది. కేవలం ఐదువిడతల చర్చలతో, తొమ్మిది నెలల్లోనే భారత్–న్యూజిలాండ్ ఈ ఒప్పందానికి రావడం విశేషం. భారత్ అతివేగంగా కుదుర్చుకున్న ఎఫ్‌టీఏల్లో ఇదీ ఒకటి.

న్యూజిలాండ్ పార్లమెంట్ ఆమోదంతో ఈ ఏడాదిలోనే అమలులోకి రాబోతున్న ఈ స్వేచ్ఛావాణిజ్యాన్ని ఉభయదేశాలు చరిత్రాత్మకమైన ముందడుగుగా అభివర్ణించాయి. దిగుమతి సుంకాన్ని న్యూజిలాండ్ పూర్తిగా రద్దుచేయడం వల్ల భారత వ్యవసాయ ఉత్పత్తులు, మందులు, తోలు, ఆభరణాలు, వస్త్రాలు తదితర రంగాలు లాభపడతాయి. సిరామిక్స్, కార్పెట్లు, ఆటోమొబైల్ విడిభాగాల ఎగుమతులు జోరందుకుంటాయి. వీసా నిబంధనల్లో మూడేళ్ళ మినహాయింపుతో ఐటీ, హెల్త్‌కేర్, ఇంజనీరింగ్ రంగాల్లో భారతీయ నిపుణులకు న్యూజిలాండ్‌లో తాత్కాలిక ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయట. న్యూజిలాండ్ మద్యం పరిమిత సుంకంతో భారత్‌కు దిగుమతి అయితే, ఇక్కడ తయారైన వైన్ సుంకాలు లేకుండా అక్కడకు ఎగుమతి అవుతుంది. ఇక, దాదాపు అరవైశాతం న్యూజిలాండ్ ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను సున్నా చేసింది. గొర్రె మాంసం, ఉన్ని, బొగ్గు, కలప ఉత్పత్తులు వంటివి అందులో కొన్ని. యాపిల్, కివి, అవకాడో, బ్లూబెర్రీ వంటి పండ్లు, తేనె, కొన్ని రకాల పాల ఉత్పత్తులు మంచి రాయితీతో దిగుమతి అవుతాయి. రాబోయే ఏడేళ్ళలో సముద్ర ఉత్పత్తులపై మనం భారీ రాయితీలు ఇవ్వాల్సి ఉందట. ఈ ఎఫ్‌టీఏతో ఇరుదేశాల మధ్య వస్తుసేవల వాణిజ్యం ఐదు బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా.

ఈ ఒప్పందంతో మన రైతులు, యువత, మహిళలు, ఎంఎస్ఎంఈలు, చేతివృత్తుల నిపుణులు, స్టార్టప్ కంపెనీలు, నవీన ఆవిష్కర్తలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రధాని సంతోషిస్తున్నారు. ఇక్కడి రైతుల, చిన్నతరహా పరిశ్రమల ప్రయోజనాలకు నష్టంచేకూర్చే అంశాలు ఇందులో లేవని ప్రభుత్వం చెబుతోంది. 140కోట్ల మంది భారతీయులకు న్యూజిలాండ్‌కు చెందిన పలురకాల ఉత్పత్తులను అందించగలిగే అద్భుత అవకాశం తమకు దక్కిందని, అనేక రంగాలకు చెందిన తమ ఉత్పత్తిదారులకు ఈ ఒప్పందంతో ప్రయోజనం చేకూరుతుందని ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ ఆనందిస్తున్నారు. ఇక, భారత ప్రభుత్వం వివరణలు ఇచ్చినా ఈ ఒప్పందంపై విమర్శలు తప్పడం లేదు. దేశ పాడిపరిశ్రమకు, మరీ ముఖ్యంగా యాపిల్ రైతులకు హానికరమైన రీతిలో ఈ ఒప్పందం జరిగిందని ఏఐకేఎస్ వంటివి విమర్శిస్తున్నాయి. ముఖ్యంగా సున్నా సుంకంతో న్యూజిలాండ్ యాపిల్ దిగుమతి కావడం వల్ల, దేశంలో యాపిల్ ఉత్పత్తిమీద ఆధారపడిన లక్షలాది రైతు కుటుంబాలు దెబ్బతింటాయనీ, న్యూజిలాండ్ అధికారులు తమ దేశంలో చేస్తున్న ప్రకటనల ప్రకారం 80శాతం ఉత్పత్తులు భారత్‌లోకి కారుచవుకగా ప్రవేశిస్తాయని ఆ సంఘాల ఆరోపణ. ఒప్పందానికి సంకల్పించడం నుంచి సంతకాలు చేయడం వరకూ సాగే మొత్తం ప్రక్రియలో ఏ దశలోనూ వివరాలు బయటకు తెలియకపోవడం ఇటువంటి వాదనలకు తావిస్తుంది. ఒప్పందంపై సంతకాలు జరిగిన అనంతరం కూడా పూర్తి సమాచారం వెల్లడికాకపోతే మరోదేశం పాలకులు, అధికారులు, మీడియా ప్రచారం చేసే అంశాలకు విలువ, విశ్వాసం ఏర్పడతాయి. యూరోపియన్ యూనియన్, యూకె వంటి పెద్ద పెద్ద భాగస్వాములతో వాణిజ్య ఒప్పందాల కోసం ఏళ్ళతరబడి మంతనాలు సాగడం తెలిసిందే. అమెరికాతో అయితే వ్యవహారం ఇప్పటికీ కొలిక్కిరాలేదు. తాము చొచ్చుకుపోయేందుకు వీలుగా భారతదేశం తన మార్కెట్ పూర్తిగా తెరిచి ఎర్రతివాచీతో స్వాగతం పలకాలని ఈ పెద్దదేశాలు దబాయిస్తుంటాయి. మారిషస్, అరబ్ ఎమిరేట్స్, ఒమాన్ వంటి దేశాలతో ఇటీవల కుదిరిన ఎఫ్‌టీఏలు పరిమాణం రీత్యా పెద్దవి కాకున్నా వాణిజ్యం కోసం మనం పెద్దదేశాల మీద ఆధారపడే అవసరాన్ని తగ్గిస్తాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దెబ్బకు ప్రపంచ వాణిజ్యక్రమం మారిపోతున్న తరుణంలో ఇటువంటి ఎఫ్‌టీఏలు తప్పడం లేదు.

అంతంలేని ఆయుధప్రేమ.. అంతేనయా!

ఆయుధంతో అన్నీ సాధించాలనే లక్ష్యం ఉన్నవారు చివరకు దానికే బలి అవుతారని మనం తరచూ వింటూంటాం. హింసతో అంతిమంగా దేన్నీ సాధించలేమని చెప్పటానికి ఇట్లాంటి హితబోధనలు 20వ శతాబ్దంలో బాగా ప్రాచుర్యం పొందాయి. రాజకీయాధికారాన్ని పొందటానికి ప్రజాస్వామ్యం శాంతిమార్గాన్ని ఏర్పరచిందనీ, సమాజంలో సమూల సంస్కరణలను అమల్లో పెట్టాలనుకునే వారందరూ ఆ మార్గంలోనే నడవాలనటంలో అమెరికా పాలకులే ముందంజలో ఉన్నారు. ఆ తరహా బోధనలకూ, హితోక్తులకూ అనుగుణంగా అమెరికా వ్యవహరిస్తోందా? అని ప్రశ్నించుకుంటే జవాబు భయానకంగా ఉంటుంది. తుపాకీ సంస్కృతికి వందలేళ్ల నుంచి పెద్దపీట వేసిన దేశం 21వ శతాబ్దంలోనూ దాన్ని వదిలించుకోలేకపోతోంది. ఏప్రిల్ 25న శ్వేతసౌధంలో విలేఖరులకు ఇచ్చే విందు సమావేశంలో జరిగిన కాల్పుల ఘటన అమెరికా తుపాకీ సంస్కృతికి ఒక మచ్చుతునక మాత్రమే. అయినా ఆ సంస్కృతికి స్వస్తిచెప్పటానికి అవసరమైన చర్యలను అమెరికా పాలకులు తీసుకోలేకపోతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నూ, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌నూ ఇతర మంత్రులనూ కాల్పులబారిన పడకుండా కాపాడటం తన సమర్థతకు గీటురాయిగా రహస్య పోలీసు విభాగం ప్రకటించుకుంది. అదే సమర్థతను అన్ని సందర్భాల్లోనూ ప్రదర్శించిన దాఖలాల్లేవు. అమెరికా చరిత్రలో నలుగురు అధ్యక్షులు తుపాకీ గుళ్లతో ప్రాణాలను కోల్పోయారు. నల్లజాతి ప్రజలకు సమానహక్కులు ఉండాలని పోరాడిన మార్టిన్ లూథర్ కింగ్ సైతం తుపాకీ సంస్కృతికి బలైపోయారు. మార్టిన్ లూథర్ కింగ్ వల్లే పౌరసమానత్వం అమెరికాలో సాధ్యమైంది. 1964 నాటి పౌరహక్కుల చట్టం అమెరికా చరిత్రలోనే ఒక కీలక మలుపు లాంటిది. రంగు, జాతి, లింగం, మతంతో ప్రమేయం లేకుండా పౌరహక్కుల్లో అందరికీ సమానత్వం లభించే పరిస్థితి అంతకుముందు అమెరికాలో లేదు.

దేశాధినేతల మరణాలకే కారణమైన తుపాకీ సంస్కృతి ప్రజల జీవితాల నుంచి జారిపోకుండా దాన్ని పదిలంగా కాపాడటానికి పెద్ద లాబీనే అమెరికాలో పనిచేస్తోంది. అమెరికాలో పరిశ్రమాధిపతులూ, పెట్టుబడిదారులూ తమ ప్రయోజనాలను కాపాడుకోటానికీ పెంచుకోటానికీ రాజకీయనేతలను బహిరంగంగానే ప్రభావితం చేస్తారు. కోట్ల డాలర్లను అందుకోసం కుమ్మరిస్తారు. తమ తరఫున పనిచేయటానికి లాబీయింగ్ చేసే సంస్థలతో ఒప్పందాలనూ కుదుర్చుకుంటారు. ఎంతగా లాబీయింగ్ చేసినా తక్షణావసరం లేని పిస్టళ్లనూ, రివాల్వర్లనూ, హ్యాండ్‌గన్లనూ ప్రజలు ఎందుకు కొంటున్నారన్న ప్రశ్న తలెత్తుతుంది. నిరంతర అభద్రత అనేది ఇప్పటి అమెరికన్ల జీవితాల్లో కనపడదు. అసాధారణ నేరాలు జరిగే పరిస్థితులూ అక్కడలేవు. కనీసం సరిహద్దు ప్రాంతాల్లో అటువంటివి ఎక్కువ జరుగుతున్న దాఖలాల్లేవు. అయినా ప్రపంచంలో ఎక్కడా లేనట్లుగా అక్కడి ప్రజలు ఆయుధాలను కొంటూనే ఉంటారు.



తుపాకులను ఉంచుకోవటం ధీరోదాత్తలక్షణంగా, వీరోచిత వారసత్వం కొనసాగింపుగా, వ్యక్తి స్వతంత్రతకు నిదర్శనంగా ప్రజల సంస్కృతిలో, ఆలోచనల్లో నాటుకుపోయేలా చేయటంలో అక్కడి ఆయుధ పరిశ్రమల లాబీ విజయవంతమైంది. అలా అవ్వటానికి కథలనూ, కవిత్వాలనూ, సినిమాలనే కాదు.. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని సాంస్కృతిక రూపాలనూ ఉపయోగించుకున్నారు. తుపాకీని ప్రయోగించటం, పేల్చటం పురుష లక్షణంగా, కుటుంబ సంరక్షకుడికి ఉండాల్సిన నేర్పరితనంగా, సాహస గుణానికి ప్రతీకగా ప్రజలు భావించేలా చేయగలిగారు. కౌబాయ్‌ల జీవితాల చుట్టూ అల్లిన కథలూ గాథలూ అందులో భాగమే. సినిమాలను ఉపయోగించుకుని కౌబాయ్‌ల తుపాకీ సాహస విన్యాసాలపై చాలా ఆసక్తిని కలిగించారు.

సంస్కృతి అనేది ఒక్క ఏడాదిలో ఏర్పడదు. దానికి దశాబ్దాల, శతాబ్దాల కాలం కావాల్సి వస్తుంది. తుపాకీ కలిగి ఉండటం అన్నది సంస్కృతిలో ప్రధానభాగం కావటం అమెరికాలో ఆషామాషీగా జరగలేదు. దానికి శతాబ్దాల చరిత్ర ఉంది. అమెరికా ఖండంలో స్థానికజాతులతో యుద్ధాలు, వాళ్ల భూములను ఆక్రమించుకోవటాలు, వాళ్ల నుంచి నిరంతరం రక్షించుకోవాలన్న అవసరాలు అక్కడి చరిత్రలో ఒకనాడు ప్రధానమైనవి. వీటితో పాటు తుపాకుల తయారీ ఒక పరిశ్రమగా పాదుకున్న తర్వాత దానికి ఇంటాబయటా నిరంతరం మార్కెట్‌ను విస్తరించుకోవాల్సిన ఆధునిక వ్యాపార అవసరమూ ఏర్పడింది. ఈ రెండు కారణాలు అమెరికాలో తుపాకీ సంస్కృతి బలపడటానికీ కొనసాగటానికీ కీలకంగా పని చేశాయి. ఇంకా చేస్తున్నాయి కూడా.

అమెరికా స్వాతంత్ర్యం ప్రకటించుకున్న నాటికి 13 వలస రాష్ట్రాలే ఉన్నాయి. బ్రిటన్ నుంచి అమెరికా స్వాతంత్ర్యాన్ని ఖాయపరిచిన 1783 ప్యారిస్ ఒప్పందం నాటికి ఆ రాష్ట్రాల కింద 2.3 మిలియన్ చదరపు కిలోమీటర్ల భూభాగమే ఉండేది. ప్రస్తుత అమెరికా విస్తీర్ణం 9.8 మిలియన్ చదరపు కిలోమీటర్లు. ఇంత విస్తీర్ణంలో అమెరికా అజమాయిషీ వ్యాప్తిచెందటానికి దశాబ్దాలు పట్టింది. 1783 నుంచి 1959 వరకూ అది కొనసాగింది. ఆ దశను ప్రధానంగా పశ్చిమ విస్తరణగా పేర్కొంటారు. అట్లాంటిక్ సముద్రాన్ని అంటి ఉన్న రాష్ట్రాల నుంచి పసిఫిక్ సముద్రం వరకూ అమెరికా విస్తరించటం మామూలుగా, ప్రశాంతంగా జరగలేదు. ఆ విస్తరణ కాలంలో స్థానిక జాతులతో, ప్రజలతో అనేక యుద్ధాలు చేయాల్సి వచ్చింది. కానీ ఆనాటి అన్ని సంఘర్షణలూ, యుద్ధాలూ చరిత్రలోకి ఎక్కలేదు. ఎందుకంటే పరాజితుల సంపూర్ణచరిత్రలు విజేతల జ్ఞాపకాల్లోకి చేరవు. విజయానికి తోడ్పడ్డ ఘటనలకే అవి పరిమితం అవుతాయి. పశ్చిమ విస్తరణ కాలంలో చిన్నవీ పెద్దవీ కలిసి 100కు పైగా యుద్ధాలు, సంఘర్షణలు జరిగాయని మాత్రమే ఇప్పటివరకూ తెలుస్తోంది. ఇక స్థానిక జనాభా గురించిన లెక్కలు కూడా కచ్చితమైనవి లేవు. ఉన్నవన్నీ అంచనాలు మాత్రమే. వాటి ప్రకారం 1783 నాటికి 60 లక్షల నుంచి 150 లక్షల మంది స్థానిక జాతుల ప్రజలు ఉండేవారు. పశ్చిమ విస్తరణలో భాగంగా యుద్ధాల వల్లే గాక ఇతరత్రానూ జీవన విధ్వంసం జరిగింది. యూరపు నుంచి వలస వచ్చిన వారి ద్వారా సంక్రమించిన వ్యాధులు కూడా స్థానిక ప్రజల మరణాల్లో కీలకపాత్రనే పోషించాయి. 50 రాష్ట్రాల అమెరికా భౌగోళిక రాజకీయ పటం స్పష్టంగా రూపుదిద్దుకున్న నాటికి (1959) స్థానికప్రజలు చాలావరకూ సమిధలైపోయారు. 4లక్షల మంది మాత్రమే నామమాత్రంగా మిగిలారు. అమెరికా స్వాతంత్ర్య ప్రకటన నాటికి ఉన్న 13 రాష్ట్రాలు మినహా మిగిలిన 37 రాష్ట్రాల భూభాగాల గురించి అప్పటికి తెలిసింది చాలా తక్కువ. కొత్త ప్రాంతాల్లో ప్రతిఘటించే స్థానిక ప్రజలను లొంగదీసుకోవటంతో పాటు ఇతరత్రానూ తుపాకులు అవసరమయ్యాయి. జంతువుల వేట, అడవుల్లోకి చొచ్చుకువెళ్లటం లాంటివి కూడా ఆయుధాలను అనివార్యం చేశాయి. స్వాతంత్ర్య ప్రకటన నాటికే కొత్త ప్రాంతాల్లోకి విస్తరించటం అత్యవసరంగానూ గుర్తించారు. ఆఫ్రికా నుంచి బానిసలుగా కొనుక్కుని వచ్చిన నల్లజాతి ప్రజలను అదుపులో పెట్టుకోటానికి కూడా తుపాకులు కావాల్సి వచ్చాయి. అందుకే తుపాకులను ఉంచుకోవటాన్ని మౌలిక హక్కుల్లో భాగం చేశారు. 1791లో రాజ్యాంగానికి చేసిన రెండో సవరణలో భాగంగా రూపొందిన బిల్ ఆఫ్ రైట్స్‌లో తుపాకీని చేతబట్టే హక్కు ఒక ప్రధాన నిబంధనగా చేరింది.

విచ్చలవిడి తుపాకీ కాల్పుల్లో అమాయకులైన పిల్లలూ, పెద్దలూ అమెరికాలో మరణించినప్పుడల్లా ఆయుధాలపై పరిమితులు విధించటానికి చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ప్రభుత్వాలు ఆ దిశగా వేద్దామనుకున్న ప్రతి అడుగునూ తుపాకీ పరిశ్రమ లాబీ అడ్డుకుంది. వ్యక్తిస్వేచ్ఛ, ఆత్మరక్షణ అనేవి రాజ్యాంగహక్కు అనీ ఆయుధాలపై నిషేధం విధించటం దాన్ని హరించటమేనంటూ యాగీ చేసింది.

అమెరికా పౌరుల చేతుల్లో ప్రస్తుతం 39 కోట్ల వివిధ రకాల గన్‌లు ఉన్నాయి. అంటే ప్రతి 100 మందికి 120 ఆయుధాలు ఉన్నాయి. ఎవరిదగ్గర ఎన్ని గన్లు ఉన్నాయని స్పష్టంగా తెలుసుకోటానికి ఇప్పటికీ నేషనల్ రిజిస్ట్రీ అనేది లేదు. సమగ్ర సమాచార సేకరణకు చాలా రాజకీయ వ్యతిరేకత ఉంది. వ్యక్తిగత గోప్యతా హక్కు పరిరక్షణ పేరుతో కూడా సమాచారాన్ని రాబట్టటం లేదు. ఏటా పౌరులకు అమ్మే తుపాకీల వ్యాపార విస్తృతి చూస్తే ఆశ్చర్యపోతాం. 15 నుంచి 25 బిలియన్ డాలర్ల (రూ. 2.37 లక్షల కోట్ల వరకూ) వరకూ ఏటా ఈ వ్యాపారం ఉంటుంది. గత 30 ఏళ్లలో 11 లక్షల మంది తుపాకీ కాల్పులకు బలైపోయారు. వాళ్లలో తుపాకులతో ఆత్మహత్యలు చేసుకున్నవారు 60శాతం వరకూ ఉన్నారు. క్షణికావేశానికి లోనైనప్పుడు ఆయుధాలు అందుబాటులో ఉండటం హత్యలకూ, ఆత్మహత్యలకూ దారి తీయటం ఎక్కువవుతుంది. మనోవైకల్యంతో విపరీతపోకడలకు లోనయ్యే వారికి ఆయుధాలు తేలికగా దొరకటంతో తాము ఏంచేస్తున్నారో తెలియని పరిస్థితిలో ఊరూపేరూ తెలియని వారి ప్రాణాలుతీసిన ఘటనలూ చాలా ఉన్నాయి.


■ రాహుల్ కుమార్

అమెరికాకు ఇప్పుడు సరిహద్దు విస్తరణ లేదు. స్థానిక జాతుల నుంచి భూములను ఆక్రమించుకునే అవసరమూ లేదు. ఆనుపానులు తెలియని ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటుచేసుకుని వ్యవసాయ క్షేత్రాలను అభివృద్ధి చేయాల్సిన అగత్యమూ లేదు. గతంలో లాగా ఎక్కడికక్కడ ప్రజలు సాయుధులుగా ఉండి నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితీ లేదు. ఆయుధాలు అవసరమైన ఒకనాటి సమాజం ఛాయలే ఇప్పుడు లేవు. అయినా అమెరికాలో ఆయుధప్రేమ ఇప్పటికీ బలంగానే ఉంది. ఆయుధంలేని జీవితంలో లోపం ఉందనే విపరీత భావనను ఆ సమాజం దాటలేకపోవటానికి గన్ పరిశ్రమ లాబీయింగే ప్రధానకారణం. లాభాల కోసం సమాజం ఎటుపోయినా పర్వాలేదనే పోకడ స్వేచ్ఛా వాణిజ్యానికి పెద్దపీట వేసే చోట సహజంగానే ఉంటుంది. దాన్ని కట్టడి చేయటానికి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం గన్ లాబీయింగ్‌కు దాసోహం అంటోంది. ప్రజలు కావాలంటున్నారు కాబట్టి ఆయుధాలను ఉత్పత్తి చేస్తున్నామని తుపాకీ తయారీ కంపెనీలు చేసుకునే సమర్థనల్లో ఎంత డొల్లతనం ఉందో 'ద గన్నింగ్ ఆఫ్ అమెరికా' పుస్తకంలో పమేలా హాగ్ ఎండగట్టారు. ఇబ్బడిముబ్బడిగా తుపాకీలను తయారుచేసి ఆ తర్వాత ప్రజలు వాటిని కొనేలా కృత్రిమ అవసరాన్ని సృష్టించారు. అందుకే అమెరికాలో ఆయుధప్రేమ అన్ని హద్దులనూ దాటింది. అది కలగచేసే విపరీతాలనూ తెచ్చిపెట్టే లాభాలనూ వ్యక్తి స్వేచ్ఛకు నిదర్శనంగా భావించే ధోరణి ఆ సమాజంలో చెల్లుబాటు అవ్వటానికీ అదే కారణం. అదుపులేని ఆయుధప్రేమకు ఎంతటి మూల్యాన్నైనా చెల్లించటానికి ఈ రోజుకూ అమెరికా సిద్ధంగానే ఉంది! మనుషుల ప్రాణాలకంటే తుపాకీ అమ్మకాలే అక్కడ విలువైనవి! సాక్షాత్తూ దేశాధ్యక్షుడే గన్ చేతబట్టిన ఫోటోపోజుతో ప్రపంచం ముందు తనను తాను ప్రదర్శించుకోవటం అమెరికా ఆయుధ దాహానికి నిలువుటద్దంగాక మరేమిటి?

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)


> **అమెరికా పౌరుల చేతుల్లో ప్రస్తుతం 39 కోట్ల వివిధరకాల గన్‌లు ఉన్నాయి. అంటే ప్రతి 100 మందికి 120 ఆయుధాలు ఉన్నాయి. ఎవరిదగ్గర ఎన్ని గన్లు ఉన్నాయని స్పష్టంగా తెలుసుకోటానికి ఇప్పటికీ నేషనల్ రిజిస్ట్రీ అనేది లేదు. ఏటా పౌరులకు అమ్మే తుపాకీల వ్యాపార విస్తృతి 15 నుంచి 25 బిలియన్ డాలర్లు (రూ. 2.37 లక్షల కోట్ల వరకూ) ఉంటుంది.**

> **ఇబ్బడిముబ్బడిగా తుపాకీలను తయారుచేసి ఆ తర్వాత ప్రజలు వాటిని కొనేలా కృత్రిమ అవసరాన్ని సృష్టించారు. అందుకే అమెరికాలో ఆయుధప్రేమ అన్ని హద్దులనూ దాటింది. అది కలగచేసే విపరీతాలనూ తెచ్చిపెట్టే లాభాలనూ వ్యక్తి స్వేచ్ఛకు నిదర్శనంగా భావించే ధోరణి ఆ సమాజంలో చెల్లుబాటు అవ్వటానికీ అదే కారణం. అదుపులేని ఆయుధప్రేమకు ఎంతటి మూల్యాన్నైనా చెల్లించటానికి ఈ రోజుకూ అమెరికా సిద్ధంగానే ఉంది! మనుషుల ప్రాణాలకంటే తుపాకీ అమ్మకాలే అక్కడ విలువైనవి! సాక్షాత్తూ దేశాధ్యక్షుడే గన్ చేతబట్టిన ఫోటోపోజుతో ప్రపంచం ముందు తనను తాను ప్రదర్శించుకోవటం అమెరికా ఆయుధ దాహానికి నిలువుటద్దంగాక మరేమిటి?**

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు నిజం కాదా?

వన్యప్రాణి సంరక్షణ చట్టం–1972 కింద ఈ ఏడాది మార్చి 9న భజనలాల్ శర్మ నేతృత్వంలోని రాజస్థాన్ ప్రభుత్వం జారీ చేసిన ఒక నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం స్టే విధించింది. ఈ నోటిఫికేషన్ జాతీయ చంబల్ ఘరియల్ అభయారణ్యం సరిహద్దులను మార్చింది. చంబల్ నదికి ఇరువైపులా ఉన్న 732 హెక్టార్ల భూమిని ఆంక్షల నుంచి విముక్తి చేసింది. చట్టంలోని నిబంధనలను గాలికి వదిలేసి ఈ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది.

పోలీసుల కంటే మెరుగైన ఆయుధాలు కలిగి ఉండి, తమకు అడ్డువచ్చిన వారిని నిర్భయంగా చంపేస్తున్న ఇసుక తవ్వకాల మాఫియాయే 'చంబల్ ఆధునిక బందిపోట్లు' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇటీవల వ్యాఖ్యానించాల్సి వచ్చింది. చంబల్ నది లోతుల్లోకి తవ్వకాలు జరుపుతూ, జాతీయ చంబల్ ఘరియల్ అభయారణ్యంలోని సున్నితమైన ప్రవాహ జీవావరణ వ్యవస్థను నాశనం చేస్తున్న ఇసుక తవ్వకందారులు ఏ మాత్రం బలహీనులు కారని, వారి వద్ద ఆయుధ సంపత్తి ఉందని మధ్యప్రదేశ్ ప్రభుత్వం పదేపదే చేస్తున్న వాదనకు ప్రతిస్పందనగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చింది.



"మన సహజ వనరులను మనం కాపాడుకోలేమని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం అత్యంత విచారకరమైన విషయం. మనకు సంప్రదాయకంగా తెలిసిన దోపిడీ అనేది గతం. ఇప్పుడు ఆధునిక దోపిడీదారులు, ఈ మైనింగ్ మాఫియాలు" అని జస్టిస్ మెహతా వ్యాఖ్యానించారు. "మైనింగ్ మాఫియా చేతిలో ఎంత మంది సబ్–డివిజనల్ మేజిస్ట్రేట్లు, పోలీసులు, అటవీ అధికారులు చంపబడ్డారో చూడండి... కానీ నివారణ నిర్బంధం అనే చట్టం ఒకటి ఉందని రాష్ట్రం మరిచిపోయింది" అని జస్టిస్ మెహతా అన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులే ఇసుక దోపిడీ గురించి నిస్సంకోచంగా వ్యాఖ్యానించారంటే బయటి ప్రపంచంలో ఈ దోపిడీ ఎంత విశృంఖలంగా జరుగుతోందో తేలిగ్గా ఊహించుకోవచ్చు. మానవాళికి ఎంతో ప్రాణప్రదమైన నీటి వనరులను కాపాడేది ఇసుక. ఈ సత్యానికి సమాధి కట్టి నీటి వనరులను హరించివేయటం అంటే మానవుల జీవనానికి సమాధి కట్టడమే కదా! రాజస్థాన్ ప్రభుత్వం 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని అడ్డం పెట్టుకొని 'చంబల్ ఆధునిక బందిపోట్ల'కు చంబల్ ఘరియల్ అభయారణ్యంలో అపారంగా ఉన్న ఇసుక వనరులను దోచుకుపోవడానికి లైసెన్సులు జారీ చేసింది. దీనిని బట్టి ఆ రాష్ట్ర ప్రభుత్వానికి జల వనరులపై ఆధారపడిన ప్రజల జీవితాలను కాపాడటం కంటే బందిపోట్లను పెంచి పోషించే బడా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను కాపాడటమే ముఖ్యమని తేటతెల్లం కావడం లేదా!

'చంబల్ ఆధునిక బందిపోట్ల' ఆగడాలు రాజస్థాన్‌కే పరిమితం కాదు. దాదాపు అన్ని రాష్ట్రాలలో ఈ దోపిడీ జరుగుతూనే ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలలో ఇసుక మాఫియా దోపిడీ గురించి రోజూ కథనాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఎందరో అధికారులు ఇసుక మాఫియా లారీ చక్రాల కింద ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ లైసెన్సుడు దోపిడీ ఫలితంగా మనకు అపారంగా ఉన్న జలవనరులు నానాటికీ అడుగంటిపోయి మారుమూల ప్రాంతాలలోని గ్రామాల ప్రజలు గుక్కెడు మంచినీళ్ల కోసం మైళ్ళకొలది నడిచి వెళ్లాల్సిన దుస్థితిలో ఉన్నారు. అంతేకాదు విజయవాడ లాంటి నగరాల పక్కన నదులు, కాలువలు ప్రవహిస్తున్నా 200, 300 అడుగుల లోతున బోర్లు వేస్తే గాని నీరు దొరకని పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి.

ఈ దోపిడీకి అడ్డుకట్ట వేసే విధంగా, మనకు సహజసిద్ధంగా అపారంగా ఉన్న జల వనరులను కాపాడుకోవడం కోసం ప్రజలు ఎక్కడికక్కడ ఉద్యమాలు సాగించాలి. రాజస్థాన్ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను తక్షణమే వెనక్కి తీసుకుని, సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన తీవ్ర వ్యాఖ్యలు నిజం కాకుండా చేయటానికి ఆచరణాత్మక చర్యలు చేపట్టాలి! జల వనరుల రక్షణ కోసం ప్రజలు సాగించే ఉద్యమాలకు వివిధ ప్రజా సంఘాలతో పాటు పౌరహక్కుల సంఘాలు వెన్నంటి నిలబడాలి.

● ముప్పాళ్ళ భార్గవశ్రీ
సీపీఐ ఎంఎల్ నాయకులు

నాలుగు కోడ్‌ల రద్దుకై ఉద్యమిద్దాం!

19వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా ప్రారంభమైన పారిశ్రామిక విధానం వల్ల కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయి. నిర్ణీత పని గంటలు, హక్కులూ లేకపోవటంతో పాటు, రోజులో 14 నుంచి 15 గంటల నిర్బంధ పని అమలయింది. ఈ దుర్భర పరిస్థితుల నుంచి బయటపడాలనే ఆలోచన కార్మికుల్లో ప్రారంభమైంది. 1886 మే ఒకటిన అమెరికా అంతటా సమ్మె సైరన్ మోగింది. 3 లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. పోలీసుల జరిపిన కాల్పుల్లో ఆరుగురు కార్మికులు నేలకొరిగారు. ఆ తర్వాత కూడా ఘర్షణ కొనసాగింది. చివరకు షికాగో నగర కార్మికుల ప్రాణ త్యాగం వల్ల అమెరికాలో 8 గంటల పని దినం అమలుకు చట్టం చేశారు.



భారతదేశంలోనూ అనేక కార్మిక పోరాటాలు జరిగాయి. పాలక ప్రభుత్వాలు సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరించాయి. 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను... వేతనాల కోడ్, సామాజిక భద్రత కోడ్, పారిశ్రామిక సంబంధాలు, భద్రత–ఆరోగ్యం–పని పరిస్థితుల అని నాలుగు కోడ్‌లకు చట్టబద్ధత కల్పించి వాటిని అమలు చేస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్నది. ఇంతకు ముందు కార్మికుల డిమాండ్లపై సమ్మె నోటీసు ఇవ్వటానికి 14 రోజుల వ్యవధి సరిపోయేది. ఇప్పుడు దాన్ని 60 రోజులకు పెంచారు. సమ్మెకు వ్యతిరేకంగా ట్రిబ్యునల్‌కు వెళ్లే అవకాశం యజమానులకు కల్పించారు. గతంలో 10 కంటే ఎక్కువ మంది పని చేసే సంస్థలను పరిశ్రమలుగా గుర్తించేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 20కి పెంచారు. విద్యుత్ సంస్థల్లో 40 మందికి పెరిగింది. ఏ సంఘానికైనా కార్మికుల డిమాండ్లపై చర్చించే అవకాశం ఇంతకు ముందు ఉంటే, ఇప్పుడు 51శాతం సభ్యత్వం ఉన్న సంఘాన్ని గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. నాలుగు కోడ్‌లు రాక ముందు పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలకు యజమానుల బాధ్యత ఉండేది. ఇప్పుడు కార్మికులే ప్రమాదాలకు బాధ్యత వహించాలి. ప్రమాదాలకు కారణమని కార్మికునికి 10వేల జరిమానా, జైలుశిక్ష విధించవచ్చు. యజమానులు కోరితే 10 నుంచి 12 గంటలు పనిచేయాలి. మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాయడమే కాకుండా ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించడం లేదా మూసివేయడం వల్ల లక్షలాది మంది కార్మికులు నిరుద్యోగులుగా మారుతున్నారు.

గత కార్మిక వర్గ ఉద్యమాలను అవగాహన చేసుకుని వర్గ దృక్పథంతో ఆర్థిక, రాజకీయ హక్కుల కోసం దీర్ఘకాలిక పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలి. అప్పుడు మాత్రమే మోదీ ప్రభుత్వ వెనక్కి తగ్గుతుంది. అందుకు మే డే నాంది పలకాలి.

○ బొల్లిముంత సాంబశివరావు
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆం.ప్ర. రైతు కూలీ సంఘం


శ్రామికుల జీవితాల్లో చంద్రోదయ కాంతులు

శ్రమ దోపిడికి వ్యతిరేకంగా ఎందరో కార్మికులు జరిపిన పోరాట ఫలితంగా కార్మిక లోకంలో చైతన్యం వెల్లివిరిసింది. ఆనాటి దోపిడి విధానాలను సమూలంగా మార్చుకుని కార్మికులు తమ హక్కులను సాధించుకున్న రోజు మే డే. ఈ రోజు కార్మికుల ఐక్యత, పోరాటాలకు నిదర్శనంగా నిలుస్తుంది. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర శ్రామికుల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది.

19వ శతాబ్దంలో అమెరికాలో పెట్టుబడిదారులు శ్రామికులతో బానిసల్లాగా పని చేయించి, అధిక లాభాలు పొందేవారు. కనీస వసతులైన తిండి, బట్ట, నివాసం వంటివి కల్పించకుండా రోజుకు 16 నుంచి 20 గంటలు పని చేయించేవారు. పని స్థలాల్లో సరైన గాలి, వెలుతురు ఉండేవి కావు. దాంతో కొందరు కార్మికులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయేవారు. ఈ పరిస్థితికి భిన్నంగా, శ్రమదోపిడీ నుంచి బయటపడేందుకు కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి పోరాడి సాధించుకున్న రోజే మే డే. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు ఇస్తూ ఎనిమిది గంటల పనిదినం అమల్లోకి వచ్చిన రోజు కార్మిక దినోత్సవం.

షికాగో పోరాటం కంటే ముందే భారతదేశంలో కలకత్తాలో కార్మికులు నిర్ణీత పని గంటల కోసం హౌరా రైల్వేస్టేషన్‌లో 1862లో సమ్మె చేశారు. అప్పటి వరకు రైల్వే కార్మికులు 10 గంటలు పని చేసేవారు. అయితే ఆ పోరాటం విస్తృత స్థాయిలో ప్రజాపోరుగా మారకపోవడంతో ఉద్యమ స్వరూపాన్ని అందుకోలేదు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం వల్ల అప్పటి నుంచే కార్మికవర్గంలో చైతన్యం పెరిగింది. 1923లో మొదటిసారిగా భారతదేశంలో మే డేను పాటించారు.

కార్మిక శక్తి లేనిదే సమాజం ముందుకెళ్ళదని నమ్మే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని శ్రామికుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. కార్మికుల సంక్షేమంపై చంద్రన్న ముద్ర స్పష్టంగా కనిపిస్తున్నది. అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ, ఇతర కార్మికులకు గతంలో అందించిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించిన ఘనత ఆయనకే దక్కుతుంది. ప్రసూతికి రూ.20 వేలు, వివాహానికి రూ.40 వేలు, సహజ మరణానికి రూ.60 వేలు, అంత్యక్రియలకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల్లో ఆధునిక నైపుణ్యాలు, జీవన ప్రమాణాలను పెంచే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నది.



నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖ కంపెనీలు ఎల్ అండ్ టి, ఎన్‌సీసీ, మిట్టల్ సహా వివిధ సంస్థల సహకారంతో వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. దీని ద్వారా రాష్ట్రంలోని కార్మికులు దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు పొంది, అధిక ఆదాయం ఆర్జించేలా అవకాశాలు మెరుగుపడతాయి. ఇది కూటమి ప్రభుత్వం ఘనతే. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ డేటాబేస్‌ను అనుసంధానించడంతో పాటు కార్మికులు లేటరల్ ఎంట్రీ ద్వారా వివిధ కోర్సులు అభ్యసించి ఉన్నత విద్యార్హతను సాధించేలా ప్రణాళిక రూపకల్పన జరుగుతున్నది. ఆధునిక పనిముట్లను కార్మికులకు అందించి నైపుణ్యాలు పెంచి అధిక ఆదాయాన్ని ఆర్జించే అవకాశం కల్పన దిశగా కసరత్తు సాగుతున్నది. రాష్ట్రంలోని 20 లక్షల మంది కార్మికులకు నైపుణ్యాలు పెంచేందుకు అనువుగా కార్యాచరణను కూటమి ప్రభుత్వం చేస్తున్నది. తరచు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి, యూనివర్సల్ హెల్త్ పాలసీతోపాటు కార్మిక శాఖ ద్వారా రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు.

కార్మిక, కర్షకులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ముందుకు వెళ్లడం ప్రస్తుతం అత్యంత అవసరం. కార్మిక వర్గం పక్షాన నిలబడి వారికి మేలు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. నాలా చట్టం రద్దు, ఉచిత ఇసుక విధానం, భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతులు సరళతరం చేయడం వంటి నిర్ణయాలతో ఇప్పటికే నిర్మాణ రంగాన్ని నిలబెట్టి లక్షల మంది జీవితాలకు భద్రత కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, అన్ని ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుతో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తూ కూటమి ప్రభుత్వం కార్మికుల ప్రభుత్వంగా, కష్టజీవుల ప్రభుత్వంగా మారింది. 140వ మే డే సందర్భంగా చంద్రన్న పాలనలో శ్రామికుల జీవితాల్లో మరిన్ని చంద్రోదయ క్రాంతులు ప్రసరించాలని ఆశిద్దాం.

■ వాసంశెట్టి సుభాష్
కార్మిక శాఖ మంత్రి



పెదరావూరు అభయహస్త సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని కేంద్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ రామ సుబ్రమణియన్ గురువారం సందర్శించారు. విద్యా గణపతి బాలాంబిక సమేత సర్వహితేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.

- తెనాలి



మునిసిపాలిటీలకు.. కాసుల వర్షం

కలిసొచ్చిన 5 శాతం పన్ను రాయితీ

ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందదండన్న ప్రభుత్వం పిలుపునకు.. మునిసిపాలిటీల్లో చెల్లింపుదారులు విశేషంగా స్పందించారు. రాయితీ వెసులుబాటు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పురపాలక సంఘాలకు కాసుల వర్షం కురిపించింది. ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో నెల రోజుల్లో దాదాపు రూ.128.38 కోట్ల పన్ను చెల్లించడం విశేషం. ఏప్రిల్ నెల మాత్రమే అమలు చేసిన రాయితీ పథకం గడువు గురువారంతో ముగిసింది. ఆరు నెలల్లో వసూలయ్యే పన్ను ఒక నెలలో వసూలు కావడం విశేషం.

● స్వచ్ఛందంగా రూ.128.38 కోట్ల చెల్లింపు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

పన్ను వసూలులో పురపాలక సంఘాలు గణనీయ వృద్ధిని సాధించాయి. పల్నాడు జిల్లాలో ఎనిమిది మునిసిపాలిటీల్లో మొత్తం వార్షిక డిమాండ్ రూ.66.62 కోట్లు కాగా 5 శాతం రాయితీ వల్ల రూ.20.73 కోట్లు అంటే 31.11 శాతం వసూలైంది. గుంటూరు జిల్లాలోని మునిసిపాలిటీ లు, గుంటూరు కార్పొరేషన్ వార్షిక పన్ను డిమాండ్ రూ.429.92 కోట్లు కాగా రూ.97.43 కోట్లు.. 22.66 శాతం పన్ను వసూలైంది. బాపట్ల జిల్లాలోని మూడు మునిసిపాలిటీలకు సంబంధిం చి వార్షిక డిమాండ్ రూ.26.52 కోట్లకు గాను.. రూ.10.22 కోట్లు అంటే 38.53 శాతం పన్ను వసూలైంది.

గుంటూరు కార్పొరేషన్‌లో గురువారం ఒక్క రోజే రూ. 3.50 కోట్లకు పైగా పన్ను చెల్లించడం గమనార్హం. నరసరావుపేట మునిసిపాలిటీ 14.60, చిలకలూరిపేట 14.90, సత్తెనపల్లి 11.30, పిడుగు రాళ్ళ 26.70, మాచర్ల 5.5, దాచేపల్లి 54.50, గుర జాలలో 87.40, గుంటూరు కార్పొరేషన్‌లో 16.50, పొన్నూరు 7.40, తెనాలి 22.50, మంగళగిరి, తాడేపల్లి 30.55, రేపల్లె 45.90, చీరాల 17.50, బాపట్ల 113.20 శాతం గత ఏడాది కంటే అధికం గా పన్ను వసూలైంది. బాపట్ల మునిసిపాలిటీలో గతేడాది కంటే.. 24.40 శాతం, వినుకొండలో 0.40 శాతం పన్ను వసూలు తగ్గింది. పెద్ద ఎత్తున పన్ను చెల్లించడంతో పురపాలక సంఘాలకు ఆర్థిక వెసులుబాటు కలిగింది. జీతాలు సకాలంలో చెల్లించి, ప్రగతి పనులను వేగవంతం చేసే అవకాశం ఏర్పడింది.

రాయితీపై పన్ను చెల్లింపు ఇలా ఉంది

మునిసిపాల్టీ	చెల్లింపు రూ.కోట్లలో
● నరసరావుపేట	6.04
● చిలకలూరిపేట	3.17
● వినుకొండ	3.06
● సత్తెనపల్లి	2.42
● పిడుగురాళ్ళ	2.70
● మాచర్ల	1.87
● దాచేపల్లి	0.83
● గురజాల	0.62
● చీరాల	5.26
● బాపట్ల	2.71
● రేపల్లె	2.25
● గుంటూరు	68.10
● తెనాలి	9.74
● పొన్నూరు	2.65
● మంగళగిరి,తాడేపల్లి	16.93

ఒక రోజు.. రూ.5.05 కోట్లు

● ముందస్తు పన్ను చెల్లింపుపై అద్భుత స్పందన

● గుంటూరులో రికార్డు స్థాయిలో రూ.69.27 కోట్లు వసూలు

గుంటూరు, గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నుపై ప్రభుత్వం కల్పించిన 5 శాతం రిబేటుని మున్సిపల్ ట్యాక్స్ పేయర్స్ పెద్ద సంఖ్యలో ఉపయోగించుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు గురువారం అర్ధరాత్రితో ముగిసింది. కాగా చివరి రోజు గురువారం ఎక్కువమంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. రాత్రి 10.30 గంటలకే రూ.5.05 కోట్లు నగరపాలకసంస్థకు చెల్లించారు. అర్ధరాత్రికి ఈ మొత్తం మరో రూ.50 లక్షలు దాటినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అధికారవర్గాలు తెలిపాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.331.07 కోట్లు డిమాండ్‌ని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో ఒక్క ఏప్రిల్‌లోనే రూ.69.27 కోట్లకు పైగా పన్ను వసూళ్లని నగరపాలకసంస్థ చేయగలిగింది. గత ఏడాది రిబేటు ఇచ్చిన ఏప్రిల్ నెలలో రూ.56.27 కోట్లు వసూలు జరిగాయి. ఇప్పుడు దాదాపుగా 20 శాతం అదనంగా రూ.70 కోట్ల వసూలవడం విశేషం. ఇందుకు సహకరించిన నగర ప్రజలు, మునిసిపల్ అధికారులకు నగరపాలకసంస్థ కమిషనర్ కే మయూర్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక పోరుకు.. మాస్టర్ ప్లాన్

పల్నాడు నుంచి 'సమన్వయ శంఖారావం'

○ సీనియర్ ఎమ్మెల్యే యరపతినేని నివాసమే వార్‌రూమ్

○ ఈ విధానం విజయవంతమైతే ఇతర జిల్లాలకు విస్తరణ

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ముందస్తు వ్యూహాలకు శ్రీకారం చుట్టింది. కేవలం పాలనపైనే ఆధారపడకుండా, కేడర్‌ను చైతన్యపరచడం, నేతల మధ్య సమన్వయం పెంచడం, బూత్ స్థాయి నిర్మాణాన్ని పటిష్ఠం చేయడం వంటి అంశాలపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే పరిపాలనలో ఉన్న (మిగతా 2వ పేజీలో)



గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు మెమొంటో అందజేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు జీవి ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, జూలకంటి బ్రహ్మారెడ్డి, చదలవాడ అరవిందబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు షేక్ జానీ సైదా

పదిలో.. 8వ స్థానం

● పెరిగిన ఉత్తీర్ణత.. దిగజారిన స్థానం

● ఉత్తీర్ణతలో విద్యార్థినులదే పైచేయి

● సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 30 (ఆంధ్ర జ్యోతి): పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యా ర్థులు మరోసారి అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ప్రధానంగా జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ మున్సిపల్ కార్పొరేషన్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మంది మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడంతో పాటు 500 నుంచి 550 పైగా మార్కులు సాధిం చి కార్పొరేట్ పాఠశాలల కు ధీటుగా నిలిచారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలకు జిల్లా నుంచి 27,012 మంది విద్యార్థులు హాజరయ్యారు వారిలో 24011 మంది(88.89శాతం) ఉత్తీర్ణత సాధించారు. 12607 మంది బాలురు (87.69శాతం), 11404 మంది(90.03శాతం) బాలికలు ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల్లో విద్యార్థినులు పైచేయి సాధించారు. గత ఏడాది జిల్లా రాష్ట్రస్థాయిలో 88.53 శాతం ఉత్తీర్ణతతో 4వ స్థానంలో నిలవగా ఈ ఏడాది 88.89 శాతం ఉత్తీర్ణతతో 8వ స్థానం లో నిలిచింది.

ఫలించిన వందరోజుల ప్రణాళిక

ఈ ఏడాది విద్యాశాఖ అమలు చేసిన వంద రోజుల ప్రణాళిక సత్ఫలితాలు ఇచ్చిం ది. దాదాపు మూడునెలల పాటు ప్రతిరోజు పరీక్ష నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తూ పరీక్షలకు విద్యాశాఖ సిద్ధం చేసింది. స్టడీ మెటీరియల్ ఇవ్వడంతోపాటు విద్యార్థులకు ఉదయం సాయంత్రం అల్పాహారం అందజేశారు. అంతేకాకుండా నిత్యం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ఉపా ధ్యాయులు, ప్రధానోపా ధ్యాయులు కృషి చేశారు. ఉత్తమ ఫలితాల సాధనాలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, క్షేత్రస్థాయి అధికా రుల సమష్టి కృషితో మెరుగైన ఫలితాలు సాధించామని డీఈవో డాక్టర్ సలీమ్‌బాషా పేర్కొన్నారు.

జన గణన.. నేటి నుంచి

● ఈ నెల 30 వరకు ఇళ్ల వద్దనే ● ప్రజల వ్యక్తిగత సమాచారం సురక్షితం ● అపోహలు అవసరం లేదన్న కలెక్టర్ సాయికాంత్‌వర్మ

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జనాభా గణన 2027 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి, కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ కోరారు. శుక్రవారం నుంచి ప్రారంభమ య్యే జనాభా గణనపై కలెక్టర్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జిల్లాలో 62,434 కుటుంబాలు స్వీయ గణనలో వివరాలు నమోదు చేసుకున్నా యని తెలిపారు. డిజిటల్ పద్ధతిలో జనాభా గణన జరుగుతుందని చెప్పారు. జిల్లాలో 3,803 హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లను ఏర్పాటు చేశామన్నారు. 4,046 మంది ఎన్యుమరేటర్లను, 720 సూపర్‌వైజర్లను నియమించామన్నారు. ఎన్యుమరేటర్లు అంకితభావంతో పని చేసి సరైన డేటా సేకరణ చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇళ్లను తమ ఎన్యూమరేషన్‌కి సంబంధించి హద్దులు సరి చూసుకుని శుక్రవారం నుంచి మే 30వ తేదీ వరకు ప్రతి ఇంటిని సందర్శించి, మ్యాప్ ఆధారంగా సరిహద్దులను గుర్తించి వారి మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. జనాభా గణన ప్రారంభించే ముందు ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతం లేఅవుట్‌ను సిద్ధం చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంద న్నారు. ఎన్యుమరేటర్స్ జనగణనకి వచ్చిన ప్పుడు ఐడీ కార్డులను పరిశీలించి వివరాలు తెలియ జేయాలని ప్రజలకు కలెక్టర్ సూచించారు. ప్రజలు ఇచ్చే వ్యక్తిగత సమాచారం చాలా సురక్షితంగా ఉంటుం దన్నారు. సరైన సమాచారం ఇవ్వడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, అంగన్ వాడీ కేంద్రాలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన తదితర ప్రణాళికలు రూపొందించడానికి వీలవుతుందన్నారు. జనాభా గణనలో వివరాలు ఇవ్వడం వల్ల ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు కోల్పోవడం జరగదని, ప్రజలందరూ ధైర్యంగా, ఖచ్చితమైన సమాచారాన్ని ఎన్యుమరేటర్లకు అందించాలని కోరారు. జనాభా గణనలో వచ్చే సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1855కు కాల్ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్‌అశోక్, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజా వలి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేషశ్రీ, మున్సిపల్ కమిషనర్‌లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సీఎస్ సాయిప్రసాద్, వేదికపై సీఎం చంద్రబాబు, మంత్రులు

అట్టహాసంగా 'డిన్నర్ విత్ రియల్ విన్నర్స్'

● బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ - 2025 అవార్డు నేపథ్యంలో సీఎం విందు

● మంత్రులు, ఉద్యోగులు, ఉన్నతాధికారులకు సన్మానం

● ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా, మండల ఉద్యోగులకూ ఆహ్వానం

● సీఎం పనితీరుపై లోకేశ్ ప్రశంసలు

4

అనుమతుల్లోనే.. ఆధునికీకరణ

● అడుగు ముందుకుపడని నల్లమడ డ్రెయిన్

● గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భూసేకరణ దశ దాటని వైనం

● తొమ్మిదేళ్లు పూర్తవుతున్నా ప్రారంభం కాని పనులు

● వరదలతో డ్రెయిన్‌కు గండ్లు.. రైతులకు ఇక్కట్లు

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నల్లమడ డ్రెయిన్ ఆధునికీ కరణ ప్రాజెక్టుకి పరిపాలన అనుమతి లభించి ఇంచుమించు తొమ్మిదేళ్లు అవుతుంది. అయితే ఇంతవరకు పనులు అడుగు ముందుకు పడ లేదు. గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో డ్రెయిన్‌ను 2.900 నుంచి 39.690 కిలోమీటర్ వరకు ఆధునికీకరణ కాలేదు. గతంలోనే డ్రెయిన్ సీ వాల్యూ 300 నుంచి ఆధునికీకరణలో 500లకు విస్తరించేందుకు నిర్ణయించారు. 2017 జనవరి 20న అప్పటి కూటమి ప్రభుత్వం రూ.180.60 కోట్లకు స్టేజ్-1 పరిపాలన అనుమతి మంజూరు చేసింది. ఇందులో రూ.180 కోట్ల ను భూసేకరణకు కేటాయించింది. బాపట్ల జిల్లాలో 17.40 కిలో మీటర్లు, గుంటూరు జిల్లాలో 15 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఆధు నికీకరణ చేపట్టాల్సి ఉన్నది. డ్రెయిన్ విస్తరణకు గుంటూరు జిల్లాలో 34.73 ఎకరాల ప్రభుత్వ, 128.83 ఎకరాల పట్టా భూమి, బాపట్ల జిల్లాలో 78.85 ఎకరాల ప్రభుత్వ, 194.06 పట్టాభూమి కలిపి మొత్తం 436.47 ఎకరాలను సేకరిం చాలి. బాపట్ల జిల్లా వరకు రూ.68.24 కోట్లు భూసేకరణకు అవసరమౌతాయి. గుంటూరు జిల్లాకి సంబంధించి ఇంకా ఆర్‌డీవో నష్టపరిహారం అంచనాను లెక్కించి నివేదించాల్సి ఉన్నది. బాపట్లలో జాయింట్ సర్వే పూర్తి కాగా గుంటూరులో ఇంకా కొనసాగుతోన్నది. స్టేజ్-2లో బెడ్‌విడ్త్‌ని 80 నుం చి 140 మీటర్లకు విస్తరించడం, సూర్యలంక వద్ద డిశ్చార్జ్ క్యూని 30 వేల క్యూసెక్కుల నుంచి 48,833 క్యూసెక్కులకు పెంచడం, యూటీ పాయింట్ వద్ద డిశ్చార్జ్ క్యూ 22,012 క్యూసెక్కుల నుంచి 36,600 క్యూసెక్కులకు పెంచేందుకు ప్రతిపాదించారు. ఈ స్టేజ్-2 పనులకు రూ.337.30 కోట్లు అవసరమని అంచనాలు రూపొందించి పరిపాలన అనుమతి కోసం నివే దించారు. రెండు జిల్లాల్లో భూసేకరణ పూర్తి అయితే తప్ప స్టేజ్-2 పనుల కు ఆమోదం లభించదు. అప్పటివరకు పనులు జరిగే పరిస్థితి లేదు. కాగా ఆధునికీకరణ ప్రాజెక్టు జాప్యం జరుగుతోండగా, మరోవైపు మరమ్మతులకు కూడా ఇరిగేషన్ శాఖ నిధులు మంజూరు చేయడం లేదు. అదేమంటే ప్రా జెక్టు మోడర్‌నైజేషన్‌లో ఉంది కదా అని పక్కన పెట్టేస్తున్నారు. దీనిపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోన్నారు. దీంతో ఎప్పుడో నిర్మించిన డ్రెయినేజి కట్టలు భారీ వరదల సమయంలో తెగి పొలాలను నీరు ముంచెత్తుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సంవత్సరమైన పనులు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. అయితే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఆశాజనకంగా లేకపోవడంతో అసంతృప్తి చెందుతున్నారు.

న్యాయశాఖలో గుంటూరుకు ప్రథమ స్థానం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణ చక్రవర్తి
● బదిలీపై వెళుతున్న న్యాయమూర్తులకు సత్కారం



బదిలీపై వెళ్తున్న నాలుగో అదనపు జిల్లా జడ్జి రుద్రపాటి శరత్‌బాబును సత్కరిస్తున్న న్యాయవాదులు

గుంటూరు(లీగల్), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాల న్యాయ శాఖల పనితీరులో గుంటూరు జిల్లాకు ప్రథమ స్థానం లభించిందని, దీనికి తన తోటి న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది సహకారం చాలా ఉందని జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.సాయికల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న అదనపు జిల్లా జడ్జిలను గుంటూరు బార్ అసోసియేషన్‌లో గురువారం ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మదిరె నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బి.సాయి కల్యాణ చక్రవర్తి పాల్గొని, మాట్లాడారు. న్యాయమూర్తులకు మానవతా దృక్పథం అవసరమని చెప్పారు. అవసరమైతే చట్ట పరిధి తో పాటు వివేకవంతంగా ఆలోచించాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ఆరు స్పెషల్ మ్యాజిస్ట్రేట్, పోక్సో కోర్టులను అదనంగా ఏర్పాటు చేయాలని హైకోర్టుకు నివేదిక పంపానని చెప్పారు. బదిలీపై వెళ్తున్న నాలుగో అదనపు జిల్లా జడ్జి రుద్రపాటి శరత్ బాబు, ఫ్యామిలీ కోర్టు జడ్జి చక్రపాణి, ఐదో అదనపు జిల్లా జడ్జి కె.నీలిమను ఆయన అభినందించారు. పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీగల దుర్గాప్రసాద్, ఇన్‌చార్జి ప్రభుత్వ న్యాయవాది ఎం.సురేష్ బాబు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు జీశాంత కుమార్, వి బ్రహ్మారెడ్డి, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మారంగి శ్రీకాంత్, వద్దపల్లి, జీవరత్నం జూపూడి రంగరాజు, బార్ అసోసియేషన్ కార్యదర్శి వీర మహేంద్ర బాబు ముగ్గురు న్యాయమూర్తుల సేవలను కొనియాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు రేవతి ఇతర కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులు శరత్‌బాబు, చక్రపాణి, నీలిమను ఘనంగా సత్కరించారు. అనంతరం ముగ్గురు న్యాయమూర్తులు.. కోర్టుల్లో కేసులు సామరస్య పూర్వకంగా పరిష్కరించేందుకు సహకరించిన న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెస్సీ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ మ్యాథ్స్, ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ అండ్ డైట్స్, ఒకేషనల్ ఫుడ్ ప్రోసెసింగ్ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఎంఏ హిందీ, ఉర్దూ, ఎకనామిక్స్ మొదటి సెమిస్టర్ ఫలితాలను పీజీ పరీక్షల నిర్వహణాధికారి ఆలపాటి శివప్రసాదరావు గురువారం విడుదల చేశారు. రీవాల్యుయేషన్‌కు ఈ నెల 11లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రీవాల్యుయేషన్‌కు రూ.1,860, పర్సనల్ వెరిఫికేషన్, నకలుకు రూ.2,190 ఫీజు సబ్జెక్టుకు చెల్లించాలని పేర్కొన్నారు. ఫలితాలను వర్సిటీ వెబ్ సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00



స్థానిక పోరుకు.. మాస్టర్ ప్లాన్





ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, చదలవాడ అరవిందబాబు, జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సైదాకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే యరపతినేని

(5వ పేజీ తరువాయి)

ఆధిపత్యాన్ని స్థానిక స్థాయిలో మరింత బలపరుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న టీడీపీ, పల్నాడు జిల్లాను కీలక రాజకీయ కేంద్రంగా ఎంచుకుని 'సమన్వయ శంఖారావం'కు నాంది పలికింది. ఈ క్రమంలో గురువారం రాత్రి గుంటూరులోని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నివాసంలో జరిగిన కీలక భేటీ స్థానిక ఎన్నికల యుద్ధానికి టీడీపీ ఇచ్చిన రాజకీయ శంఖారావంగా మారింది. పల్నాడు జిల్లాకు చెందిన కీలక నేతలు ఒకే వేదికపైకి చేరి, రాబోయే స్థానిక ఎన్నికలను ప్రధాన అజెండాగా సమగ్రంగా చర్చించారు. ఈ భేటీలో ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, జీవీ ఆంజనేయులు, భాష్యం ప్రవీణ్, జూలకంటి బ్రహ్మారెడ్డి, చదలవాడ అరవిందబాబు, జిల్లా అధ్యక్షుడు షేక్ జానీసైదా తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎన్నికల్లో విజయానికి కీలకమైన కిందిస్థాయి నిర్మాణంపై అధిష్ఠానం సూచనల మేరకు నేతలు దృష్టి సారించారు. బూత్ కమిటీల పునర్వ్యవస్థీకరణ, క్రియాశీల కార్యకర్తల గుర్తింపు, యువత, మహిళల భాగస్వామ్యం పెంపు గ్రామ, మండల స్థాయిలో పార్టీ చైతన్యం పెంపు వంటి అంశాలపై కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారని సమాచారం.



యరపతినేని నివాసంలో సమావేశమైన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, జీవీ ఆంజనేయులు, భాష్యం ప్రవీణ్, జూలకంటి బ్రహ్మారెడ్డి, చదలవాడ అరవిందబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు షేక్ జానీ సైదా

వర్గ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి

పోరాటాలకు కేంద్రమైన జిల్లాలో ఈసారి ముందుగానే అంతర్గత విభేదాల సర్దుబాటుపై దృష్టి పెట్టిన అధిష్ఠానం సూచనల మేరకు నేతలందరూ యరపతినేని ఇంట్లో భేటీ అయ్యారు. జిల్లాలో పరిపాలన మెరుగుపరచడంపైనా చర్చ జరిగినట్లు సమాచారం. ప్రజాసమస్యల పరిష్కారంలో వేగం పెంచడం, అధికార యంత్రాంగాన్ని బాధ్యతాయుతంగా పనిచేయించే దిశగా చర్చలు తీసుకునే అంశంపై నేతలు చర్చించారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష వైఖరిని ఎదుర్కొనేందుకు టీడీపీ కౌంటర్ వ్యూహంపై చర్చించారని తెలిసింది.

ముందుకు వచ్చిన యరపతినేని..

పార్టీకి సంబంధించి ఏ కార్యక్రమమైనా తన దైన ముద్ర వేసే సీనియర్ ఎమ్మెల్యే యరపతినేని మరోసారి ముందుకు వచ్చారు. స్థానిక స్థాయిలోని పరిస్థితులపై లోతైన చర్చలు, నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలను చర్చించేందుకు ప్రతీ నెలా ఒక ఎమ్మెల్యే ఇంట్లో జిల్లా స్థాయి నేతలతో భేటీలు నిర్వహించాలని అధిష్ఠానం తాజాగా ఆదేశించింది. ఈ క్రమంలో గురువారం రాష్ట్రంలోనే మొట్టమొదటగా పల్నాడు జిల్లా నేతల భేటీకి యరపతినేని ముందడుగు వేశారు. గత అనుభవాన్ని ఉపయోగించి నేతలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పల్నాడు నుంచి ప్రారంభమైన సమన్వయ సమావేశాలు విజయవంతమైతే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేసే అవకాశముందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి.

యరపతినేనికి అభినందనలు..

యరపతినేని ఏర్పాటు చేసిన విందుకు పార్టీ జిల్లా అధ్యక్షుడితో కలిసి ముందుగా వచ్చిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్వీట్లతో యరపతినేనికి శుభాకాంక్షలు చెబుతూ... అన్నా మంచి ఆలోచన చేశారు అని అభినందించారు. మమ్మల్ని మళ్లీ పాత జిల్లాగా కలపండి... అప్పుడు అందరం కలుసుకునే అవకాశం ఉంటుందని ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఉండాలి నరసరావుపేటకు మారండి అని ఎమ్మెల్యే అరవిందబాబు యరపతినేనికి సూచించారు. వామ్మో... ఇన్ని కెమెరాలా అంటూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు యరపతినేని ఇంటికి వచ్చిన మీడియా ను చూసి ఆశ్చర్య పోయారు.

400 కిలోల గంజాయి ధ్వంసం

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని 18 పోలీస్‌స్టేషన్లలో.. 106 ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను గురువారం ధ్వంసం చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ సూచన మేరకు మొత్తం 400.607 కిలోల నిషేధిత పదార్థాలను డ్రగ్ డిస్పోజల్ కమిటీ పరిశీలించి, ఎన్‌డీపీఎస్ చట్టం-1985 ప్రకారం ధ్వంసానికి అనుమతినిచ్చింది. పల్నాడు జిల్లా యడ్లపాడు సమీపంలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థ వద్ద నిర్వీర్యం చేశారు. ఏఎస్పీ (అడ్మిన్) రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ పర్యావరణ ఇంజినీర్ ఎండీ నజీనా బేగం పాల్గొన్నారు.



గంజాయిని పరిశీలిస్తున్న ఇంజనీర్ నజీనా బేగం, ఏఎస్పీ రమణమూర్తి

హజ్ యాత్రికుల భద్రతకు ప్రాధాన్యం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



హజ్ యాత్రికులతో కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్ తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్ర ప్రతి ముస్లిం భక్తుడి జీవితంలో అత్యంత పవిత్రమైనదని, వారికి అన్ని సదుపా యాలు, భద్రతా ఏర్పాట్లు కల్పిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ పేర్కొన్నారు. హజ్ యాత్రికులతో పొన్నూరు రోడ్డులోని ఎం.కన్వెన్షన్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారి ద్దరూ పాల్గొన్నారు. యాత్రికులకు ఎమ్మెల్యే నసీర్ గొడుగు, ఇతర సామగ్రితో కూడిన కిట్‌లను అందజేశారు. గతంలో హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారని, ఈ ఏడాది నుంచి గన్నవరం నుం చి వెళ్లేలా ఏర్పాట్లు చేశామని వారు పేర్కొన్నారు. విజయవాడను ఎంబార్కేషన్ పాయింట్‌గా ఏర్పాటు చేయడంతో యాత్రికులకు ప్ర యాణ సౌలభ్యం కల్పించామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నా యుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేసిందని తెలిపారు. ప్రతి యాత్రికుడికి రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ నుంచి మదీనాకు నేరుగా చార్టర్ విమాన సర్వీసులు విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. గన్నవరం హజ్ శిబిరంలో రిజిస్ట్రేషన్, వసతి, భోజనం, తాగు నీరు, ప్రార్థన స్థలాలు, పారిశుధ్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రత్యేక బస్సుల సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

అర్బన్ చాలెంజ్ ఫండ్.. రూ.450 కోట్లు?

● కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుకు జీఎంసీ ప్రయత్నం ● డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్న ఏపీయూఐఏఎంఎల్

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అర్బన్ చాలెంజ్ ఫండ్‌కు ఎంపికయ్యేందుకు నగరపాలక సంస్థ ముమ్మరంగా ప్రయత్నిస్తుంది. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.450 కోట్లు వచ్చే అవకాశం ఉంది. దీంతో జీఎంసీ సూచనల మేరకు ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్షన్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఏపీయూఐఏఎంఎల్) అనే సంస్థ డీపీఆర్‌లను సిద్ధం చేస్తోంది. ఈ డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. చాలెంజ్ ఫండ్ నిధుల ద్వారా నగరంలో కోర్ సిటీలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టవచ్చని అధికారులు ఆలోచన. లాలాపేట, అరండల్‌పేట, పాత బస్టాండు, మార్కెట్ ఏరియా, నాజ్ సెంటర్, రైలుపేట, కొత్తపేట తదితర ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, తాగునీటి సరఫరా మెరుగుదల, రోడ్లు, జంక్షన్లను విస్తరించి మోడల్‌గా ఆయా ప్రాంతాలను తీర్చిదిద్దరున్నారు.

సీలింగ్ భూముల క్రమబద్ధీకరణకు మరో అవకాశం

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సీలింగ్ భూములను క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. సీలింగ్ భూముల అనుభవదారులు ఈ ఏడాది డిసెంబరు 31 లోపు జేసీ కార్యాలయంలో దరఖా స్తులు దాఖలు చేయవచ్చ న్నారు. 150 చదరపు గజా ల వరకు అన్ని అర్హతలు కలిగిన వారికి ఉచితంగా డీ పట్టా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో బీపీఎల్, ఏపీఎల్ అనే వ్యత్యాసం ఉండదన్నారు. 2019 మే ఒకటో తేదీకి ముందు రిజిష్టర్ అయిన డాక్యుమెంట్‌లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

మిర్చియార్డు సమాచారం
(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	1,02,633
అమ్మకాలు	1,06,470
నిల్వ	22,654

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	22800
నెంబరు. 5	13500	22000
273	----	----
341	14000	21500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13500	20500
షార్క్-1	-----	----
బ్యాడిగి	14500	22500
దేవనూరు డీలక్స్	15000	22000
ఆర్మూరు	13000	19300
334	----	----
నెంబరు. 5	----	----
273	----	----
341	----	----
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	----	----
బ్యాడిగి 355	----	----
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	11000

మెడికల్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోండి


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెడికల్ మాఫియాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఎంహెచ్‌వో విజయలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు ఉల్లంఘిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. వైద్యానికి వచ్చే వారికి అవసరం లేని పరీక్షలు, చికిత్సలు చేయించి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కొన్ని మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తుమందులు, అబార్షన్ మాత్రల విక్రయం జరుగుతోందని ఆరోపించారు. లైసెన్స్ లేకుండా కొన్ని మెడికల్ షాపులను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మెడికల్ స్టోర్‌లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో జంగాల చైతన్య, మరియాదాస్, అరుణ్, రాజేష్ తదితరులు ఉన్నారు.

వాసవి క్లాత్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

గుంటూరుకార్పొరేషన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వాసవి క్లాత్ మార్కెట్‌లో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. షాపుల నిర్వాహకుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపకసిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో పెద్దగా నష్టం వాటిల్లకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణంగా భావిస్తున్నారు.

మండలి కృష్ణారావు సేవలు ఆదర్శనీయం

● హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల శేషసాయి


మాట్లాడుతున్న జస్టిస్ ఆకుల శేషసాయి, వేదికపై మండలి బుద్ధప్రసాదు తదితరులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజం కోసం తన జీవితాన్ని అంకితమిచ్చిన నిజమైన త్యాగమూర్తి మండలి కృష్ణారావు అని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల శేషసాయి కొనియాడారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మహా పురుషుడు మండలి నాటిక ప్రదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 1977లో సంభవించిన దివిసీమ ఉప్పెన సమయంలో తన కాళ్లకు గాయాలైన లెక్కచేయక మండలి కృష్ణారావు వందలాది క్షతగాత్రులను కాపాడి పునరావాసం ఏర్పాటు చేశారని గుర్తుచేసుకున్నారు. వారి సేవలను, జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి నేతలు ప్రజాసేవలో తరించాలని పేర్కొన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదు మాట్లాడుతూ తన తండ్రి మండలి కృష్ణారావు గాంధేయవాదిగా నిరాడంబర జీవితాన్ని కొనసాగించారని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే తన ప్రధాన ధ్యేయమని అన్నారు. ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ కార్యదర్శి రామచంద్ర రాజు అధ్యక్షత వహించిన సభలో నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, డాక్టర్ గజల్ శ్రీనివాస్, బొమ్మిడాల కృష్ణమూర్తి, లింగంశెట్టి ఈశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, వల్లంరెడ్డి లక్ష్మణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాసరి రాజామాస్టారు

చలివేంద్రం ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని నెహ్రూనగర్ కూడలిలో మున్సిపల్ కార్పొరేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మంచి నీటి చలివేంద్రాన్ని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాష్టారు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమములో కూటమి నాయకులు యర్రగోపు నాగేశ్వరావు, గుడిపల్లి వాణి, శ్రీను, శిఖా వాసు, పాలకాయల వెంకట్, త్రిపుర, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఏఈఎల్సీ ఎన్నికలు నిర్వహించాలి..

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి (ఏఈఎల్సీ) ఎన్నికలను తక్షణమే నిర్వహించి, సంస్థను గాడిలో పెట్టాలని రెవరెండ్ డేవిడ్ నెల్సన్ బాబు, రాజ్‌కుమార్, నవకుమార్, మోజెస్ విజ్ఞప్తి చేశారు. లాడ్జి సెంటర్‌లోని ఏఈఎల్సీ ప్రధాన కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొన్ని నెలలుగా ఏఈఎల్సీలో ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ లేకపోవడంతో నిర్వహణ బాధ్యతలు సక్రమంగా సాగడం లేదని అన్నారు. దీంతో అనేక పరిపాలనా పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. పాస్టర్ల సస్పెన్షన్, బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సంస్థను సమర్థవంతంగా నడిపించేందుకు ప్రెసిడెంట్‌పై ఉన్న బాధ్యతల దృష్ట్యా వెంటనే ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్లు, పాస్టర్లు, మాజీ ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి ఎస్పీ సత్కారం

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలం పోలీస్ శాఖకు సేవలందించి పదవీ విరమణ పొందిన పలువురు పోలీసు సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం పోలీస్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐలు మాదల నాగేశ్వరరావు, సంషుద్దీన్ షరీఫ్, కృష్ణ నారాయణ, సాంబశివరావు, హెడ్ కానిస్టేబుళ్లు కరిముల్లా ఖాన్, రాజయ్యను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు రమణమూర్తి, ఏ.హనుమంతు, డీఎస్పీ అలహరి శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ సురేష్, ఇతర పోలీస్ సిబ్బంది, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో తాగునీటి పైపులు ఉండొద్దు


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సాయికాంత్ వర్మ

గుంటూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మురుగు కాలువల్లో తాగునీటి పైపులైన్లు ఉండకూడదని కలెక్టర్ సాయికాంత్‌వర్మ స్పష్టంచేశారు. జిల్లా తాగునీరు, పారిశుధ్య కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ గురువారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మురుగుకాల్వల నుంచి తాగునీటి పైపులైన్లు వెంటనే తొలగించాలని ఆదేశించారు. మురుగుకాల్వల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీలకు గురై అతిసార వంటి వ్యాధులకు గురైతే క్షేత్రస్థాయి సిబ్బంది, పర్యవేక్షక ఇంజనీర్లు బాధ్యత వహించాన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పర్యవేక్షించాలన్నారు. ఫీకల్ స్లడ్జి ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు అవకాశం ఉన్న గ్రామాల జాబితాను సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో కనీసం రెండు ఆదర్శ గ్రామాలను రూపొందించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో అన్ని సౌకర్యాలు సంపూర్ణంగా ఉండాలని, తద్వారా ఇతర గ్రామాల్లో మార్పు వస్తుందని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయి కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శంకర్, పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

● నగర కమిషనర్ మయూర్ అశోక్


పారిశుధ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయాల వారీగా పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. గురువారం ఏటి అగ్రహారం, రామిరెడ్డినగర్ ప్రాంతాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పలు ప్రాంతాల్లో పారిశుధ్యపనులు సరిగా జరగకపోవడాన్ని గమనించి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశా రు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రధాన రహదారులపై ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలని, ఖాళీస్థలాలను గుర్తించి అక్కడ జీఎంసీ బోర్డులను ఏర్పాటుచేయాలన్నారు. నగరంలో నిర్మాణవ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తున్న వారిపై భారీగా అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్ఎస్ సాంబయ్య, ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు. నగరాన్ని పోస్టర్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కమిషనర్ కోరారు. నగరంలో విచ్చలవిడిగా వాల్ పోస్టర్స్ అంటిస్తున్నారని, ఇక నుంచి అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి 12 బృందాలను నియమించామన్నారు. నగరంలో వాల్ పోస్టర్ల ప్రింటింగ్ నిషేధమని, ఫ్లెక్సీలు ప్రింట్ చేసేవారు తప్పనిసరిగా ప్రింటర్, ప్రింటింగ్ ప్రెస్ పేరు, వివరాలు నమోదు చేయాలని అన్నారు.

పదిలో సంక్షేమ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు

గుంటూరు (విద్య), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోని సాంఘిక సంక్షేమ, బీసీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టళ్ల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. జిల్లాలో 11 బీసీ సంక్షేమ హాస్టళ్లు ఉండగా ఆయా హాస్టళ్ల నుంచి 140 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో 127 (90.07 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరి వెల్లడించారు.

● పది ఫలితాల్లో సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్ల విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించారని డీడీ చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నుంచి 45 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 37 మంది ఉత్తీర్ణులయ్యారని అన్నారు. అదేవిధంగా మంగళగిరి, దుగ్గిరాల హాస్టళ్ల నుంచి 23 మంది హాజరుకాగా 19 మంది, తెనాలి డివిజన్లో మొత్తం 42 మంది పరీక్షకు హాజరుకాగా 33 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ హాస్టళ్లు, గురుకులాల నుంచి 68 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 58 మంది ఉత్తీర్ణులయ్యారని గిరిజన సంక్షేమ శాఖ అధికారి మురళి వివరించారు.

పది ఫలితాల్లో కార్పొరేషన్ స్కూల్ విద్యార్థుల సత్తా

గుంటూరు(విద్య), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కార్పొరేషన్ హైస్కూళ్ల విద్యార్థులు పది పరీక్షల ఫలితాల్లో సత్తాచాటారు. గుజ్జనగుండ్లలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో 89 శాతం ఉత్తర్ణత నమోదుకాగా, వెంగళరావునగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో 88 శాతం, భారత్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో 87 శాతం ఉత్తీర్ణత నమోదయింది.

చిన్నారుల్లో ధైర్యసాహసాలు పెంపొందాలి

● ఎమ్మెల్యే గళ్లా మాధవి


చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో భక్తితో పాటు ధైర్యసాహసాలు పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. గుంటూరులోని సెయింట్ మాథ్యూస్ నార్త్ ప్యారిస్ చర్చిలో గురువారం నిర్వహించిన వెకేషన్ బైబిల్ స్కూల్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ, వెకేషన్ బైబిల్ స్కూల్ వంటి కార్యక్రమాలతో చిన్నారుల్లో ఆధ్యాత్మిక విలువలు పెంచడమే కాకుండా, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఎస్.జోహన్ బాబురావు, ఎస్సీ సెల్ నేత జొన్నలగడ్డ ఉదయ భాను పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం


పూర్ణాహుతిలో హాజరైన భాష్యం రామకృష్ణ, తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): శారదాకాలనీ 27వ లైనులో వేంచేసి ఉన్న శ్రీ మహాలక్ష్మమ్మ ఆలయ జీర్ణోద్ధరణ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా నాలుగు రోజులుగా ప్రత్యేక హోమాలు నిర్వహించగా గురువారం విగ్రహ పునఃప్రతిష్ఠ, కలశస్థాపన, పోతురాజు ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సంతర్పణ జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి లడ్డూ వేలంపాట నిర్వహించగా రూ. 42వేలకు ఓ భక్తుడు దక్కించుకున్నారు. కార్యక్రమానికి తూర్పు ఎమ్మెల్యే నసీర్, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, ఏపీ ఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, మాజీ కార్పొరేటర్‌లు గోళ్ళ ప్రభాకర్, ఎన్.బాలాజీ హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు రావి రత్తయ్య, పెద్ద మహాలక్ష్మయ్య, గొడుగులూరి సుబ్బారావు, వెంకటనారాయణ ఆధ్వర్యంలో జరిగిన క్రతువును సదాశివం, అనిల్ పర్యవేక్షించారు.

తీవ్రమైన ట్రోల్స్‌ను అధిగమించి ఎదిగిన లోకేశ్

● మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర


మంత్రి లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెబుతున్న మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు నాట మరే ఇతర రాజకీయ నాయకుడు ఎదుర్కోలేనన్ని ట్రోలింగ్, విమర్శలు, ఎద్దేవాలు లోకేశ్ ఎదుర్కొన్నారని, వాటన్నింటిని దాటుకొని తనను తాను మలుచుకుంటూ తిరుగులేని శక్తిగా ఆయన అవతరించారని మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ.. కష్టపడిన వారికి కాలం మంచి ఫలితాలు ఇస్తుందని దానికి మంత్రి లోకేశ్ ఉదాహరణ అని అన్నారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్ బాధ్యతలు చేపట్టడంతో కార్యకర్తల్లో రెట్టింపు ఉత్సాహం నెలకొందని రవీంద్ర కొనియాడారు.

సంగడిగుంటలో మహిళ ఆత్మహత్య

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ వ్యాధి మందు బిళ్ళలు అధిక మోతాదులో మింగి సంగడిగుంటలో సబీరా ఖాన్ (33) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. లాలాపేట పోలీసుల వివరాలు ప్రకారం, సంగడిగుంటలోని అభినందన టవర్‌లో నివాసం ఉంటున్న సబీరా ఖాన్ పుట్టుక నుంచే మూర్ఛ వ్యాధితో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఏప్రిల్ 19న మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం సబీరాఖాన్ తన పడక గదిలోకి వెళ్లి మూర్ఛ వ్యాధి మాత్రలను అధిక మోతాదులో మింగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చెడు చేయాలని చూస్తే సహించం

● ఎమ్మెల్యే నసీర్


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఉపయోగపడే ఎలాంటి కార్యక్రమానికైనా తాము మద్దతుగా నిలుస్తామని, సైకో జగన్ ఆలోచనలకు అనుగుణంగా వ్యవహరిస్తే సహించేది లేదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ తేల్చి చెప్పారు. స్థానిక ఆనంద్‌పేట, ఐపీడీ కాలనీల్లో రూ.1.50 కోట్లతో డ్రెయిన్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం రోడ్ల మీదకు వచ్చి విమర్శలు చేస్తున్న నాయకులు గత పదేళ్లలో ఎక్కడ అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఆనందపేటలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు వెనకడుగు వేస్తున్న నేపథ్యంలో స్థానికులతో మాట్లాడి పనులు చేపట్టామని తెలిపారు. మంచి విషయాలు చెబితే తాము స్వీకరిస్తామని, ప్రజలకు హాని చేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. మోతీలాల్ నగర్ వాసుల విషయంలో ఎలాంటి రాజీ లేదని, వారికి పూర్తి మద్దతుగా నిలుస్తామని ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని స్పష్టం చేశారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

● బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య


పోస్టర్లును ఆవిష్కరిస్తున్న డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య, తదితరులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని రోమన్ క్యాథలిక్ చర్చి మేత్రాసనం పీఠాధిపతి బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య కోరారు. బ్రాడీపేటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ రక్షణ చట్టం హక్కులను హరిస్తూ సుప్రీంకోర్టు రాజ్యాంగ వ్యతిరేక తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పుతో దళిత క్రైస్తవుల్లో అభద్రతా భావం నెలకొందని, దీనిని పునఃసమీక్షించాలని కోరారు. భవిష్యత్తులో దళిత క్రైస్తవులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా రద్దు చేయాలని, దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలోనే ఉంచాలని కోరుతూ ఈ నెల 20న ఎల్ఈఎం స్కూల్ మైదానంలో బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభను క్రైస్తవ సంఘాలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ బాబురావు, దళిత, ప్రజా సంఘాల నాయకులు గద్దె రత్నశ్రీ, మధిర శేషయ్య, మద్దు ప్రేమజ్యోతిబాబు, జీఆర్ భగత్ సింగ్, ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ, నల్లపు నీలాంబరం, సాధు మల్యాద్రి పాల్గొన్నారు.

టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మహ్మద్ నజీర్‌కు సన్మానం


మహ్మద్ నజీర్‌ను సత్కరిస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమితులై గురువారం గుంటూరుకు విచ్చేసిన మహమ్మద్ నజీర్‌ను స్థానిక మాయాబజార్ వ్యాపారస్థులు, ముస్లిం ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. మాయాబజార్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, మహ్మద్ నజీర్ వ్యాపారం నిమిత్తం గుంటూరుకు నుంచి విశాఖపట్నం వెళ్లి అక్కడ టీడీపీలో అంచెలంచెలుగా ఎదిగారని కొనియాడారు. సభకు ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ సాహెబ్, జిల్లా నాయకులు ఎస్పీ జాద, మీరావలి, హాజీ షౌకత్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవారి జయంతి మహోత్సవాలు

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో వైభవంగా జరుగుతోన్న అమ్మవారి జయంతి మహోత్సవాలు గురువారం ముగిశాయి. ముగింపు వేడుకల సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ దేవస్థానాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో నిడమానూరు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొనకళ్ళ సత్యం, కోట శేషగిరి, జుజ్జూరు శ్రీనివాసరావు, జూలూరు హేమాంగదగుప్తా, అరవపల్లి శ్రీను, గోపవరపు చైతన్య పలువురు ప్రముఖులున్నారు.


అమ్మవారి పూజలకు హాజరైన ఎమ్మెల్యే నసీర్

● షిర్డీ సాయికి ప్రత్యేక అర్చన

పొన్నూరు రోడ్డులోని షిర్డీ సాయిమందిర్‌లో ఆలయ నిర్వాహకులు రావూరు లక్ష్మీనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, కాగడ హారతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అనంతరం వివిధ రకాల పూలతో ప్రత్యేక అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున సాయినాథుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ పెద్ద ఎత్తున జరిగింది.

జనగణన సమర్థవంతంగా నిర్వహించాలి


సిబ్బందికి కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో బండి శ్రీనివాసరావు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని గుంటూరు రూరల్ మండల ఎంపీడీవో, జనగణన అదనపు ఇన్‌చార్జి బండి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సిబ్బందికి జనగణన కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, జనగణనకు వచ్చిన సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. సేకరించిన వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని సిబ్బంది జాగ్రత్తగా ఉంటూ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి ఏఎస్‌వో శర్మ, ఏవో విద్యాసాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పదిలో విజేత స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో విజేత స్కూల్ విద్యార్థులు విజయదుందుభి మోగించారని డైరెక్టర్ శ్రీనివాసరావు గురువారంఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు 595, 594, 593, 591, 590 మార్కులతో సత్తా చాటారని వెల్లడించారు. అదే విధంగా 575పైగా మార్కులు 50మంది, 550 పైగా మార్కులు 120మంది, 500పైగా మార్కులు 200 మంది సాధించారని తెలిపారు. గణితంలో 100 మార్కులు 53 మంది సాధించారని వివరించారు. విద్యార్థులను డైరెక్టర్ సురేష్, ప్రిన్సిపల్ అరుణ తదితరులు అభినందించారు.

కెనడీ విద్యార్థుల విజయకేతనం


కిరణ్ నిత్యశ్రీ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో స్థానిక అరండల్‌పేటలోని కెనడీ పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించారని డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీవిద్య గురువారం ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు శ్రీ కిరణ్, నిత్యశ్రీ 588 మార్కులు సాధించినట్లు తెలిపారు. పరీక్షకు హాజరైన 77 మంది విద్యార్థులలో 570కి పైగా మార్కులు 20 మంది, 561 పైగా 27 మంది, 500కు పైగా మార్కులు 52 మంది సాధించారని వివరించారు. తెలుగు హిందీ గణితం సాంఘిక శాస్త్రం సబ్జెక్టుల్లో నూరు శాతం మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకులు సావిత్రి ప్రిన్సిపాల్ ఐజా కుమార్ తదితరులు అభినందించారు.

సెయింట్ లారెల్స్ విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న రవీంద్రబాబు తదితరులు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో స్థానిక ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్ఎం మీనాక్షి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు ఎం.శారద శ్రీ శర్వాణి 593, దేవిప్రియ 591, సుహాన ముస్కాన్ 586, షాఇస్తానా తబసుమ్ 584, హరిణి 583 మార్కులు సాధించారని వెల్లడించారు. విద్యార్థులను పాఠశాల కార్యదర్శి రవీంద్రబాబు, డైరెక్టర్ శేష కుమారి తదితరులు అభినందించారు.

సాయి ఆదిత్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో డైరెక్టర్లు మోదేపల్లి రవీంద్రబాబు తదితరులు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రింగ్ రోడ్‌లోని సాయి ఆదిత్య స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ మోదేపల్లి రవీంద్రబాబు, సూరే రామ్మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు తమ విద్యార్థులు 592, 590, 580పైగా మార్కులతో సత్తా చాటారని వివరించారు. 42 మంది 500పైగా మార్కులు సాధించారని వెల్లడించారు. పాఠశాలలో 99.9 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, ఏవో కృష్ణారావు, కోటి నాయక తదితరులు అభినందించారు.

ఐక్య పోరాటాలతోనే దళిత హక్కుల సాధన

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక కొత్తపేట సీపీఐ కార్యాలయంలో గురువారం జాలాది జాన్‌బాబు అధ్యక్షతన దళిత హక్కుల పోరాట సమితి జిల్లా రెండో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు జీవీ రాజు పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్బారావు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాలు గడిచినా దళితుల జీవన ప్రమాణాల్లో పెద్దగా మార్పులు రాలేదని, ఇంకా కుల వివక్ష, దాడులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జేవి ప్రభాకర్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, కోటా మాల్యాద్రి, నూతలపాటి చిన్ని తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.


● నూతన కమిటీ ఎన్నిక

అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిర్యాల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గుర్రంకొండ సత్యానందం, కార్యదర్శిగా బెజవాడ యాకోబు, సహాయ కార్యదర్శిగా పంతగాని మరియదాసు, కోశాధికారిగా తుడిమెల్ల వెంకటయ్యతో పాటు 10మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రమోషన్లపై ప్రశ్నలు

పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగోన్నతులపై వివాదం

- రోస్టర్‌కు పాతర, కనిపించని సీనియార్టీ జాబితా
- ఉమ్మడి జిల్లాలో పలువురికి అన్యాయం?



గుంటూరు జిల్లా పంచాయతీ రాజ్ వ్యవస్థలో కలకలం రేపుతున్న ఉద్యోగోన్నతుల వ్యవహారం కొత్త మలుపులు తిరుగుతోంది. గ్రేడ్-5 నుంచి గ్రేడ్-4కు 66 మంది పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన ప్రమోషన్లపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారికంగా జాబితా విడుదలైనప్పటికీ.. దాని వెనుక జరిగిన ప్రక్రియపై అనుమానాలు పెరుగుతూనే ఉన్నాయి.

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగోన్నతుల ప్రక్రియలో కీలకమైన రోస్టర్ విధానం సక్రమంగా అమలు కాలేదన్న ఆరోపణలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. నియమావళి ప్రకారం కేటాయించాల్సిన రిజర్వేషన్లు, కేటగిరీలు గందరగోళంగా మారిపోయాయని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని స్థానాల్లో అర్హతల కంటే 'అభిరుచులు' ప్రాధాన్యం పొందాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సీనియార్టీ జాబితా ఎక్కడ?

ఉద్యోగోన్నతుల్లో అత్యంత వివాదాస్పద అంశం సీనియారిటీ జాబితా లేకపోవడం. సాధారణంగా ఇలాంటి ఉద్యోగోన్నతులకు ముందు.. స్పష్టమైన సీనియార్టీ జాబితా విడుదల చేయాలి. అయితే ఈసారి అలాంటి ప్రక్రియ లేకుండానే నేరుగా ప్రమోషన్లు ప్రకటించడం అనుమానాలకు తావిస్తోంది. 'ఎవరు ముందు? ఎవరు తర్వాత?' అనే ప్రశ్నలకు అధికారిక సమాధానం లేకపోవడం ఉద్యోగుల్లో అసంతృప్తిని పెంచుతోంది.

బదిలీ ఉద్యోగి 'బ్యాక్‌డోర్' పాత్ర?


ఇంకా ఆశ్చర్యకర విషయం ఏమిటంటే ఇప్పటికే బదిలీ అయిన ఒక ఉద్యోగి ఈ మొత్తం ప్రమోషన్ ప్రక్రియలో కీలకంగా వ్యవహరించారని ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. అధికారికంగా సంబంధం లేకపోయినా, లోపల నుంచి ఫైళ్లను ప్రభావితం చేసి, ఉన్నతాధికారులను తప్పుదారి పట్టించాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే నిజమైతే, పరిపాలనా వ్యవస్థలోనే పెద్ద లోపం బయటపడినట్లే అవుతుంది.

పారదర్శకతపై పెద్ద ప్రశ్న

పదోన్నతుల ప్రక్రియ మొత్తాన్ని అత్యంత గోప్యంగా నిర్వహించారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా అనుసరించాల్సిన పద్ధతులు, నోటిఫికేషన్లు, అభ్యంతరాల ఆహ్వానం వంటి దశలు కనీసం కనిపించలేదని చెబుతున్నారు. ఇది ప్రమోషన్ ప్రక్రియ.. లేక ముందే నిర్ణయించిన జాబితా ప్రకటనా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

ప్లాన్డ్ సెలక్షనా..?

ఈ వ్యవహారం కేవలం ఉద్యోగుల మధ్య వివాదంగా మాత్రమే కాకుండా, జిల్లా పరిపాలనపై కూడా ప్రభావం చూపే అంశంగా మారింది. పారదర్శకత లేకపోతే భవిష్యత్తులో ఇలాంటి ప్రక్రియపై విశ్వాసం దెబ్బ తింటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్‌ల జాబితా వెంటనే నిలిపివేసి పునఃపరిశీలన జరపాలని విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం విడుదలైన జాబితాను తక్షణం నిలిపివేయాలని రోస్టర్, సీనియార్టీ అంశాలను పరిశీలించి, తప్పులు నిర్ధారణ అయితే కొత్త జాబితాను విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.



ఇక డిజిటల్ డోర్ నంబర్

- పట్టణాల్లో ఇళ్లకు కొత్త నంబరు ప్లేట్లు
- ప్రత్యేక క్యూఆర్ కోడ్‌తో సమస్త సమాచారం

సత్తెనపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో డిజిటల్ డోరు నంబర్లు రానున్నాయి. ఇంటింటికి డోరు నంబరును 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఐతే అవి అంతగా వినియోగంలోకి రాలేదు. దాని గురించి పట్టించుకోక పోవటంతో ఇళ్లకు ఏర్పాటు చేసిన డోరు నంబర్లు కన్పించడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ కొత్తగా డోరు నంబరు ఏర్పాటు ప్రక్రియ జరుగుతోంది. ఇందుకు మునిసిపల్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, సచివాలయాల సిబ్బందికి సర్వే అవగాహన కల్పించారు. దాదాపు 45 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రక్రియ ఇలా..

పురపాలక సంఘంలో వార్డు హద్దులు ముందుగా సిద్ధం చేసుకోవాలి. తర్వాత డోరు నంబరుకు సంబంధించి లాగిన్ ఇస్తారు. ఇందులో వివరాలను నమోదు చేయాలి. వార్డు సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ అడ్మిన్, ఎమ్యూనిటీలు బృందంగా ఇది నిర్వహించాల్సి ఉంటుంది. వీఆర్‌పీలోని డేటా లాగిన్ చేస్తే కన్పిస్తుంది. అందులో మార్పులు చేసుకోవచ్చు. యజమానికి పూర్తి సమాచారం అందులో ఉంటుంది. సర్వేలో దుకాణాలకు సంబంధించిన గ్రేడ్‌లను నమోదు చేయాల్సి ఉంటుంది.

ప్రత్యేక క్యూ ఆర్‌కోడ్

డిజిటల్ డోర్ నంబరు ప్లేటుపై ప్రతి ఇంటికి ఒక ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఉంటుంది. దానిని యజమాని స్కాన్ చేస్తే సమస్త సమాచారం కన్పిస్తుం ది. పుర మిత్రయాప్ కూడా వస్తుంది. దాని ద్వారా అన్ని రకాల సమాచారం తెలుసుకోవచ్చు. ఆస్తి, కుళాయి పన్ను, కరెంటు బిల్లు సమాచారం వస్తుంది. డోరు నంబరు ప్లేట్లు.. మూడు రంగుల్లో ఏర్పాటు చేయనున్నట్టు తెలుస్తోంది. పసుపు బోర్డు గృహ సముదాయాలకు, నీలం వాణిజ్య భవనాలకు, ఎరుపు ప్రభుత్వ భవనాలకు ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది.

పొగాకు రైతుల పరిస్థితి దారుణం

- కేంద్ర మంత్రి పెమ్మసానికి వినతి

చిలకలూరిపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు ఇబ్బందికరంగా సాగుతున్నాయని, ధరలు భారీగా తగ్గడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చిలకలూరిపేట ప్రాంతంలోని వర్జీనియా పొగాకు రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను గురువారం గుంటూరులో కలిసి తమ సమస్యలను విన్నవించారు. గతేడాది కిలో పొగాకు ధర రూ.285 నుంచి ప్రారంభమై రూ.356 వరకు పలికిందని, కానీ, ఈ ఏడాది రూ. 250 నుండి ప్రారంభమై ప్రస్తుతం రూ.200 లకు పడిపోయిందని తెలిపారు. గత 20 ఏళ్లలో లేని అత్యుత్తమ నాణ్యత కలిగిన పొగాకును పండించినప్పటికీ, వ్యాపారులు రకరకాల సాకులు చెబుతూ ధరలు తగ్గించి రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై పన్నులు 28 శాతం నుంచి 40 శాతానికి పెరగడం, స్మగ్లింగ్ సిగరెట్ల నియంత్రణ లేకపోవడం, ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల వల్ల షిప్‌మెంట్లు నిలిచిపోవడం వంటి కారణాలను వ్యాపారులు సాకులుగా చూపుతున్నారని రైతులు మంత్రికి వివరించారు. పొగాకు వేలం కేంద్రాలు కూడా రోజు విడిచి రోజు నిర్వహించడం వల్ల అమ్మకాల్లో జాప్యం జరుగుతోందని చెప్పుకొచ్చారు. దీనివల్ల పొగాకు బేళ్ల బరువు తగ్గి నాణ్యత దెబ్బతింటోందని తెలిపారు. రాష్ట్రంలోని గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, ఏలూరు, రాజమండ్రి నియోజకవర్గాల్లో పొగాకు రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, ఇతర పార్లమెంట్ సభ్యులతో చర్చించి ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య, ఆర్థిక శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. యాగంటి బొల్లారావు, కొల్లా రామారావు, మద్దుకూరి వాసు బాబు, దండా వీరయ్య, పోట్ల వెంకటరామయ్య తదితరులు కేంద్ర మంత్రికి వినతి పత్రం సమర్పించారు.



కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పొగాకు రైతులు

అట్టహాసంగా

- బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్- 2025 అవార్డు నేపథ్యంలో సీఎం విందు
- మంత్రులు, ఉద్యోగులు, ఉన్నతాధికారులకు సన్మానం
- ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా, మండల ఉద్యోగులకూ ఆహ్వానం

'డిన్నర్ విత్ రియల్ విన్నర్స్'

గుంటూరు(రాజధాని), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని ఏపీ సీఆర్డీఏ కార్యాలయం వేదికగా గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ విందు అట్టహాసంగా సాగింది. ఇటీవల ముంబై వేదికగా 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్- 2025' అవార్డును అందుకున్న నేపథ్యంలో..సీఎం చంద్రబాబు ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా, మండల స్థాయి ఉద్యోగులకు సైతం ఆత్మీయ విందు ఇచ్చారు.

దీనికి ముందు మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. చప్పట్లతో సీఎం చంద్రబాబుకు మంత్రులు, అధికారులు, ఉద్యోగులు స్వాగతం పలికారు. కార్యక్రమానికి మంత్రి పయ్యావుల కేశవ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. రాష్ట్ర విభజన, గత ప్రభుత్వంలో జరిగిన పరిణామాలను సమావేశంలో వివరించిన ఆర్థిక మంత్రి, సంస్కరణలనేవి సీఎం చంద్రబాబు డీఎన్‌ఏలోనే ఉన్నాయని కొనియాడారు. విద్యుత్, ఓపెన్ స్కై పాలసీ, టెలికాం రంగం, ఐటీ, డ్రిప్ ఇరిగేషన్, పీపీపీ వంటి రంగాల్లో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే సంస్కరణలు తెచ్చారని పయ్యావుల గుర్తుచేశారు. బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు రావడానికి టీమ్ ఏపీ పని తీరే కారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు కితాబిచ్చారు. మంత్రులు, అధికారులు, ఉద్యోగులే రియల్ విన్నర్స్ అని ముఖ్యమంత్రి కొనియాడారు.

● మంత్రి లోకేశ్ ప్రశంసలు

ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరును మంత్రి నారా లోకేశ్ వివరించారు. ప్రభుత్వంలో ఒక నిర్ణయం తీసుకున్న తరువాత దాన్ని అమలు చేసేందుకు మంత్రులు, అధికారుల వెంటపడి టాస్క్ పూర్తి చేయించే విధానాన్ని కొనియాడారు. పరిపాలనలోనూ.. రాజకీయాల్లోనూ ఎలాంటి ఇగోలకు పోకుండా పనిచేసే వ్యక్తి చంద్రబాబు అని ప్రశంశించారు. టీమ్ స్పిరిట్‌తో పని చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు చాలా సందర్భాల్లో 1995-1999 పాలన గురించి చెబుతారని, ఇకపై 2024- 29 పాలన గురించి చెప్పుకునేలా పని చేస్తామన్న లోకేశ్ చెప్పారు. మంత్రులు, అధికారులు ఒక టీమ్‌గా పనిచేసి లక్ష్యాలను సాధించేందుకు సిద్ధంగా ఉన్నామని లోకేశ్ స్పష్టం చేశారు. లక్ష్యాన్ని చేరుకున్న ప్రతీసారి మంత్రులకు ముఖ్యమంత్రి కొత్త లక్ష్యాన్ని నిర్దేశిస్తారని చలోక్తులు వేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, సత్యకుమార్, కందుల దుర్గేశ్, సీఎస్, డీజీపీ, కార్యదర్శులు, ఉద్యోగులతో కలిసి విందులో పాల్గొన్నారు. వారితో కలిసి భోజనం చేశారు.



కార్యక్రమానికి హాజరైన మంత్రులు, డీజీపీ

కాజా - చిన అవుటపల్లి ఎన్‌హెచ్-16 ఆర్ అండ్ బీకి

- డీపీఆర్‌ను సిద్ధం చేస్తోన్న ఎన్‌హెచ్ఏఐ

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వెస్టు బైపాసు రోడ్డు ప్రారంభం కావడంతో.. ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలో ఉన్న కాజా - చినఅవుటపల్లి సెక్షన్‌ని త్వరలోనే ఆర్‌అండ్‌బీకి స్వాధీనం చేసే ప్రక్రియ ప్రారంభమైంది. అంతకంటే ముందు రూ.200 కోట్ల అంచనా విలువతో మొత్తం సెక్షన్‌ని అభివృద్ధి చేయనుంది. ఇందులో భాగంగా రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. డీపీఆర్‌కి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపగానే ఒన్‌టైం డెవలప్‌మెంట్ కింద రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి రోడ్లు, భవనాల శాఖకు ఇచ్చేస్తారు. ఆ తర్వాత నుంచి ఈ రహదారి నిర్వహణ బాధ్యతలను ఆర్‌అండ్‌బీ చూసుకోవాల్సి ఉంటుంది. ఇలా ఎన్‌హెచ్‌ఏఐ నుంచి ఒక రహదారి తిరిగి రోడ్లు, భవనాల శాఖకు రావడం ఇదే ప్రప్రథమంగా అధికారులు చెబుతున్నారు.

కాగా రాబోయే రోజుల్లో విజయవాడ వెస్టు బైపాసు, పాత ఎన్‌హెచ్-16 సెక్షన్‌ని నిర్వహించాలంటే ఎన్‌హెచ్‌ఏఐకి ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారుతుంది. దీనిని పరిగణనలోకి తీసుకొన్న ఆ సంస్థ కాజా - చినఅవుటపల్లి సెక్షన్‌ని ఆర్ అండ్ బీకి స్వాధీనం చేయాలని నిర్ణయించింది.

మెరుగైన బోధనతోనే 'భాష్యం' అత్యుత్తమ ఫలితాలు

- చైర్మన్ భాష్యం రామకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పకడ్బందీ విద్యా ప్రణాళిక, మెరుగైన బోధన, నిష్ణాతులైన ఉపాధ్యాయుల కృషితోనే రాష్ట్రస్థాయిలో భాష్యం విద్యా సంస్థలు అత్యున్నత స్థాయి పదో తరగతి పరీక్ష ఫలితాలు సాధించినట్లు సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ వెల్లడించారు. గుంటూరు చంద్రమౌళినగర్ లోని మెయిన్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించడంతోపాటు ప్రాథమిక స్థాయి నుంచే పరీక్షలకు సన్నద్ధం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ఫలితంగానే రాష్ట్రస్థాయిలో తమ పాఠశాల విద్యార్థి జి.దినేష్ 598 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడని పేర్కొన్నారు. కె.సాయికార్తీక్ 597, ఎన్.వి.శ్రీశ్రావ్య 597, టి.లోకేష్ 597, బీఈ శార్వీ 596, బి. వి.యశశ్రీ 596, ఎం.మనోజ్ఞ 596, జి.లోహితాశ్రీ 596, జె.ఎస్.సాయి ఆదిత్య 596, కె.లాస్య 596 మార్కులు సాధించారని వెల్లడించారు. 590 మార్కులకుపైగా సాధించిన వారు 214, 580పైన 1,108, 570పైన 2,293, 550పైన 4,253, 500పైన 7,515 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులను భాష్యం చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు అభినందించారు.

పది ఫలితాల్లో నారాయణ జయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న జీఎం విజయభాస్కరరెడ్డి తదితరులు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని జీఎం వి. విజయభాస్కరరెడ్డి, డీజీఎం తార్నాక చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు 98.79శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచారని వివరించారు. విద్యార్థి బి.హేమచంద్ర 595 మార్కులు సాధించగా, వై.మిథున్ వెంకట్, టి. సంతోస్‌కుమార్, ఎం.బేగమ్‌పఠాన్ 594పైగా మార్కులు సాధించారన్నారు. 593 మార్కులకు పైగా ముగ్గురు, 592పైగా పదిమంది, 591పైగా 17మంది, 590పైగా 23 మంది మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను డీన్లు పడాల వల్లభరావు, కోటేశ్వరరావు, ఐ.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వవరావు, ప్రమీల కుమార్, రమాదేవి, సుభాని, శిరీష, సుహాషిని, కో-ఆర్డినేటర్ సీతారమయ్య తదితరులు అభినందించారు.

శ్రీ చైతన్య విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ అంజయ్య

గుంటూరు (విద్య), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.ఇందువదన, పలకలూరి స్వేచ్ఛ ప్రియదర్శిని 598 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ స్థానం కైవసం వివరించారు. 596 మార్కులకుపైగా ఎనిమిది మంది, 595పైగా పదిమంది మార్కులు సాధించినట్లు తెలిపారు. గుంటూరు జోన్‌లో 120 మంది విద్యార్థులు 595గా మార్కులు సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ కోఆర్డినేటర్స్ అభినందించారు.

పది ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ అఖండ విజయం




విద్యార్థులను అభినందిస్తున్న విజయభాస్కరరెడ్డి తదితరులు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని చైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు 597, 594 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారని వివరించారు. ముగ్గురు విద్యార్థులు 593, మరో ముగ్గురు 592 మార్కులు సాధించారని తెలిపారు. 580 మార్కులకుపైగా నలుగురు, 570కి పైగా 16, 560పైగా 21, 550పైగా 344, 540 పైగా మార్కుతో 423 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. గణితంలో 104 మంది 100 మార్కులు, 248మంది 95పైగా మార్కులు సాధించినట్లు వివరించారు. తెలుగులో 108 మంది 100 మార్కులు సాధించారని వెల్లడించారు. విద్యార్థిని విద్యార్థులను సంస్థల డైరెక్టర్ విజయ భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆరోన్‌రెడ్డి, ఇన్‌చార్జులు మనోజ్, భాస్కర్, జోసెఫ్‌రెడ్డి తదితరులు అభినందించారు.

కన్నీటితో ప్రార్థిస్తే.. కోరికలు తీరుతాయి


- కడప బిషప్ గాలి బాలి

నాదెండ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దేవుడిని కన్నీటి ప్రార్థిస్తే.. కోరికలు తీర తాయని కడప బిషప్ గాలి బాలి అన్నారు. మండలంలోని కనపర్రు బావి వద్ద గల బాల ఏసు పుణ్యక్షేత్రం 25వ తిరునాళ్ళ మహోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమష్టి దివ్య బలి పూజలో పాల్గొన్న బిషప్ గాలి బాలి భక్తులను ఉద్దేశించి సందేశాన్ని అందించారు. కష్టా ల్లో ప్రజల కోర్కెలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారమై బాల ఏసు పుణ్యక్షేత్రం విరాజిల్లుతోందన్నారు. తక్కువ కాలంలోనే అద్భుత మహిమలతో భక్తుల విశ్వా సాన్ని చూరగొని ఆలయం ప్రసిద్ధి చెందిందన్నారు. వ్యవస్థాపక గురువు ఫాదర్ నరిశెట్టి అల్ఫోన్స్‌రాజు ఆలయ మహిమలు, భక్తుల విశ్వాసం పొందుతున్న తీ రును వివరించారు. బాల ఏసు స్వరూపాన్ని తేరుపై ప్రాంగణంలో ఊరేగిం చారు. తరలి వచ్చిన భక్తులకు స్థానిక ఫాదర్ దాసరి జోజయ్య ఆధ్వర్యంలో ఆశీర్వాదం ఇచ్చారు. నాదెండ్ల పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మాట్లాడుతున్న కడప బిషప్ గాలి బాలి తదితరులు

ధర్మపథం



బౌద్ధం పల్లవించిన నేల


వైశాఖ పౌర్ణమి ఎంతో ప్రత్యేకమైన రోజు. గౌతమ బుద్ధుడు జన్మించిన రోజే కాదు, ఆయన జ్ఞానోదయం పొందినదీ, మహా పరినిర్వాణాన్ని పొందినదీ ఈ రోజే. ఈ పవిత్రమైన రోజును ప్రపంచవ్యాప్తంగా బౌద్ధులు 'వేసాక్' పండుగగా భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారు.

రాజకుమారుడైన సిద్ధార్థుడు జీవితంలో దుఃఖాలను చూసి, వాటిని సంపూర్ణంగా రూపుమాపాలని సంకల్పించాడు. సర్వ సౌఖ్యాలను పరిత్యజించి, తపోధ్యాన నిష్ఠలతో... బుద్ధ గయలో సాధన చేసి, చివరకు సమాధానాన్ని కనుక్కోగలిగాడు. బుద్ధునిగా మారాడు. లోకానికి అహింస, సత్యం, శాంతి, దయా మార్గాలను చూపించాడు. చతురార్య సత్యాలతో, అష్టాంగ మార్గం ద్వారా మనిషి ఉత్కృష్ట జీవితం ఎలా గడపాలో తను ఆచరించాడు, ఉపదేశించాడు.

పవిత్రమైన బుద్ధ జయంతి రోజున మనం మనలోని కోపం, ద్వేషం, అసూయలను వదిలిపెట్టాలి, ప్రేమ, దయ, సహనంతో జీవించడానికి ప్రయత్నించాలి. పేదలకు సహాయం చేయాలి. ఇతరులకు సంతోషం కలిగించాలి. అదే బుద్ధుడికి నిజమైన నివాళి.

జ్ఞానపిపాసి బావరి...

ప్రాచీన కాలంలో ఆంధక దేశంగా విఖ్యాతి పొందిన ఈ తెలుగు భూమి... బౌద్ధ ధర్మ చరిత్రలో ఒక దివ్య అధ్యాయంగా నిలిచింది. ఈ నేల బుద్ధుని బోధలను ఆహ్వానించడమే కాదు... వాటిని ఆత్మలో నిలుపుకొంది. తాత్త్విక వికాసానికి, ఆధ్యాత్మిక ప్రసారానికి కేంద్రబిందువయింది. గోదావరి తీరంలో తపస్సంపన్నుడైన బావరి మహర్షి నుంచి శూన్యతాతత్త్వాన్ని విశదీకరించిన నాగార్జునుడి వరకు... ఈ ప్రాంతం బౌద్ధంతో అంతర్లీనంగా అనుసంధానమయింది. బావరి కథ ఆ అనుబంధానికి తొలి సాక్ష్యంగా నిలుస్తుంది. గోదావరి నదీ తీరాన ఆశ్రమవాసిగా నివసించిన బావరి... జ్ఞానపిపాసతో నిండిన మహర్షి. బుద్ధుడు బోధి సంపూర్ణుడై వెలుగొందిన వార్త విని... తన శిష్యులను ఆయన సన్నిధికి పంపించాడు. వారు బుద్ధుని దర్శించి, బుద్ధ వాక్యామృతాన్ని ఆస్వాదించి, సత్య సాక్షాత్కారాన్ని పొందారు. ఈ ఘట్టం ద్వారా... బుద్ధుని జీవిత కాలంలోనే ఆంధక దేశానికి బౌద్ధ ధర్మ ప్రవాహం చేరినట్టు స్పష్టమవుతుంది. తరువాత ఈ ప్రాంతం బౌద్ధ సంస్కృతికి పుష్టిని ఇచ్చిన పుణ్యభూమిగా పరిణమించింది. కృష్ణా, గోదావరి నదుల సస్యశ్యామల తీరాలు సంపన్న జీవన విధానాన్ని ప్రసాదించి... విహారాలు, స్తూపాలు, చైత్యాల నిర్మాణానికి దోహదపడ్డాయి. అమరావతి, నాగార్జున కొండ, ధూలికట్ట లాంటి క్షేత్రాలు నేటికీ ఆ వైభవానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. అక్కడి శిలాశాసనాలు, శిల్ప కళాకృతులు, విహారావశేషాలు... ఇవన్నీ కలిసి బౌద్ధం ఈ నేలపై ఎంతగా విస్తరించిందో మౌనంగా వివరిస్తున్నాయి.



ఆంధక దేశంలోని విహారాలు ప్రార్థనాలయాలుగానే కాకుండా... జ్ఞాన కేంద్రాలుగా, తాత్త్విక సంభాషణలకు వేదికలుగా వికసించాయి. వాణిజ్య మార్గాల సామీప్యం ఈ ప్రాంతాన్ని శ్రీలంక, దక్షిణాసియా దేశాలతో అనుసంధానించింది, బౌద్ధ ధర్మాన్ని సముద్రాలు దాటి విస్తరింపజేసింది. అమరావతి శిల్ప కళలో బుద్ధుని జీవగాథలు, జాతక కథలు సజీవ చిత్రాల్లా ఆవిష్కృతమై, దర్శనార్థులను ధ్యాన ముగ్ధుల్ని చేస్తాయి. ఆ శిల్ప రేఖల్లో తత్త్వం పలుకుతుంది. ఆ కళలో కరుణ నిండుగా కనిపిస్తుంది.

నాగార్జునుడి 'శూన్యతా' సూత్రం

ఈ ఆధ్యాత్మిక వేదికపై ప్రకాశించిన మహా మేధావి నాగార్జునుడు. ఆయన మహాయాన బౌద్ధంలో మాధ్యమిక తత్త్వానికి రూపకల్పన చేసి... 'శూన్యత' అనే సూత్రాన్ని లోతుగా ప్రతిపాదించాడు. సర్వ ధర్మాలకూ స్వతంత్ర రూపం లేదని, పరస్పరాధారితత్వమే సత్యమనీ ఆయన బోధించాడు. ఈ తాత్త్విక దృక్పథం బౌద్ధాన్ని మరింత విశాలంగా, లోతుగా విస్తరింపజేసింది. ఆయన శిష్యుల్లో ఆర్యదేవుడు లాంటి ఆచార్యులు కూడా ఈ తత్త్వ జ్ఞానాన్ని మరింత ప్రచారం చేశారు.

మళ్ళీ మళ్ళీ జన్మించడమే దుఃఖం

ఈనాడు కొందరు బౌద్ధాన్ని వారు నమ్మిన సిద్ధాంతాలతో జోడించి... తదనుగుణంగా బుద్ధుడి బోధనలను వ్యాఖ్యానించడం విచారకరం. అసలు బుద్ధుడు ఏ విషయాలను వివరించాడో తెలుసుకోకుండా... సామ్యవాది అని కొందరు అంటే, మరికొందరు వర్ణ వ్యవస్థను నిర్మూలించడానికి మాత్రమే అవతరించిన సామాన్య సమాజోద్ధారకుడిగా వర్ణించడం శోచనీయం. బౌద్ధం ఆచార ప్రధానమైనది. వ్యక్తి నైతిక సదాచారాలతోనే మోక్ష మార్గంలోకి ప్రవేశించగలుగుతాడని బుద్ధుడు వివరించాడు. దుఃఖ నిరోధమే నిర్వాణం. 'దుక్ఖా జాతి పునప్పునంఖ' (మళ్ళీ మళ్ళీ జన్మించడమే దుఃఖం) అన్న బుద్ధుడి తాత్త్వికోపదేశమే శంకరుల ద్వారా 'పునరపి జననం పునరపి మరణం' అనిపించింది. బౌద్ధ సాహిత్యం సంస్కృత, పాళీ భాషలలో సమృద్ధమై విలసిల్లింది. కాని నేడు రెండు కారణాలవల్ల ఆ అద్భుత సాహిత్యం మరుగునపడింది. అందులో మొదటిది... ఇంత విశాలమైన సాహిత్యాన్ని చదివే నాథులే లేరు, రెండోది... ఈ అద్భుత సాహిత్యాన్ని చదవకుండానే ఇది నాస్తికమని, సనాతన విరుద్ధమని భావించడం. ఇది దురదృష్టకరం. బుద్ధుని బోధనలను అందరూ చదివి తీరాలి.

● ఆచార్య చౌడూరి ఉపేంద్రరావ్,
జేఎన్‌యు, న్యూఢిల్లీ, 98189-69756

నేడు బుద్ధ జయంతి

సహజయోగ

శరణం గచ్ఛామి

మానవ పరిణామ క్రమంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తిగా, ఒక గొప్ప అవతారంగా గౌతమ బుద్ధుణ్ణి సహజయోగ స్థాపకురాలు శ్రీమాతాజీ నిర్మలాదేవి అభివర్ణించారు. మానవ శరీరంలోని ఆజ్ఞాచక్రానికి కుడివైపున ఉండే బుద్ధుడు మనలోని అహంకారాన్ని నియంత్రించే శక్తి. మనల్ని ఆలోచనారహితమైన, నిర్విచారమైన స్థితికి ఆయన తీసుకువెళ్తాడు.

మనుషులకు ఉన్న అతి పెద్ద సమస్య 'అహంకారం' అని బుద్ధుడు గుర్తించాడు. 'అన్ని పనులను నేనే చేస్తున్నాను' అని అహంకారంతో మనం అనుకున్నప్పుడు... అది మన సూక్ష్మ శరీరంలోని పింగళా నాడిని, మన మెదడును ప్రభావితం చేస్తుంది. అంతే కాదు... 'మన కోరికలే మన దుఃఖానికి కారణం' అని కూడా బుద్ధుడు చెబుతాడు. ప్రాపంచికమైన విషయాల మీద మనం విపరీతమైన కోరికలు పెంచుకున్నప్పుడు... మన చిత్తం ఎప్పుడూ బాహ్యపరంగానే ఉంటుంది. కోరికలను విడిచిపెట్టినప్పుడే చిత్తం లోపలికి మళ్ళుతుంది. తద్వారా మనలోని కుండలినీ శక్తి జాగృతం అవుతుంది. జీవనంలో మధ్యేమార్గం ఉత్తమం. అంటే అతిగా విలాసాల్లో మునిగిపోకూడదు. అలాగని శరీరాన్ని హింసించే కఠినమైన సాధనలు చేయకూడదు. జీవితంలో సమతుల్యతే ఆధ్యాత్మికమైన ఎదిగుదలకు పునాది. అది బుద్ధుడు చూపించిన మార్గం. బుద్ధుడు అవతార పురుషుడు. మానవునిగా పుట్టి, సత్యాన్ని అన్వేషించడం ద్వారా మనకు మార్గదర్శిగా నిలిచాడు. ఆయన బోధనలు కేవలం మేధస్సుకు సంబంధించినవి కాదు... అవి హృదయపూర్వకమైన కరుణతో కూడుకున్నవి.

మూడు సూత్రాలు... అంతరార్థాలు

బౌద్ధ మతంలో మూడు ముఖ్యమైన సూత్రాలు లేదా మంత్రాలు ఉన్నాయి. వాటిని 'బుద్ధ స్తోత్రం' అని కూడా అంటారు. అవి: బుద్ధం శరణం గచ్ఛామి, ధమ్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి. వాటి అంతరార్థాన్ని తెలుసుకుందాం. మొదటిది: బుద్ధం శరణం గచ్ఛామి. 'నేను బుద్ధుణ్ణి శరణు వేడుకుంటున్నాను' అనేది సాధారణమైన అర్థం. కాగా... ఇక్కడ 'బుద్ధ' అంటే జాగృతి చెందిన స్థితి లేదా జ్ఞానోదయం పొందిన ఆత్మ.... అంటే 'నాలోని ఆత్మను నేను శరణు వేడుకుంటున్నాను' అని అర్థం. రెండోది: ధర్మం శరణం గచ్ఛామి. 'నేను ధర్మాన్ని శరణు వేడుకుంటున్నాను' అనేది సాధారణ అర్థం. 'ధర్మం' అంటే కేవలం మతం కాదు. అది మనలోని సమతుల్య స్థితి. మన సూక్ష్మ శరీరంలోని నాభీ చక్రానికి సంబంధించినది మానవుడు ధార్మికతతో ఎలా జీవించాలో తెలిపే అంతర్గత నియమమే అర్థం. మనం ధర్మబద్ధంగా ఉన్నప్పుడే కుండలినీ శక్తి పైకి ప్రవహిస్తుంది. కాబట్టి 'నేను విశ్వజనీనమైన ధర్మాన్ని, నాలోని సమతుల్యతను శరణు వేడుకుంటున్నాను' అనేది దీని అంతరార్థం. మూడోది: సంఘం శరణం గచ్ఛామి. అంటే 'నేను సంఘాన్ని, సామూహికతను శరణు వేడుకుంటున్నాను' అని అర్థం. ఇక్కడ 'సంఘం' అంటే సామూహిక చైతన్యం. ఇది విశుద్ధ చక్రానికి సంబంధించినది. మనం ఒంటరిగా కాకుండా, అందరితో కలిసి ఉన్నప్పుడే ఆధ్యాత్మికంగా మన ఎదుగుదల పరిపూర్ణమవుతుంది. 'నేను సాధువుల లేదా సత్యాన్ని కోరేవారి సమష్టి చైతన్యాన్ని శరణు వేడుకుంటున్నాను' అని దీని అర్థం. సూక్ష్మంగా చెప్పాలంటే... బుద్ధం: మీలోని అహంకారాన్ని విడనాడి జ్ఞానాన్ని పొందడం. ధమ్మం: మీ జీవితంలో క్రమశిక్షణను, సమతుల్యతను పాటించడం. సంఘం: అందరిలోనూ దైవత్వాన్ని చూస్తూ... సమష్టిగా ఎదగడం. బుద్ధుణ్ణి ఆరాధించాలంటే కేవలం మంత్రాలను ఉచ్చరించడం మాత్రమే కాదు... వాటిని అనుభూతి చెంది మనలో అన్వయించుకోవడం చాలా ముఖ్యం. అలా అన్వయించుకోవడం ద్వారా ఒక వ్యక్తి సంపూర్ణమైన ఆధ్యాత్మిక ఉన్నతిని పొందగలడని శ్రీమాతాజీ నిర్మలాదేవి వివరించారు.

రాజ్యం వదిలి అన్వేషకుడై...

శాక్యవంశానికి చెందిన యువరాజు సిద్ధార్థుడు. అన్నిటినీ రాజభోగాలను, రాజ్యాన్ని, కుటుంబాన్ని విడిచి వెళ్ళడం సామాన్యమైన విషయం కాదు. కానీ ఆయనలో మొదటి నుంచీ ఏదో తపన ఉండేది. కటిక దరిద్రంలో ఉన్న పేదవాడు, మరణించడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తి, మరణించిన వ్యక్తిని శ్మశానానికి తీసుకు వెళ్ళడం.. ఈ దృశ్యాలు ఆయనలో అంతర్మథనం కలిగించాయి. 'మనుషులు ఇన్ని బాధలు, కష్టాలు పడుతున్నారు. వాటన్నిటికీ కారణమేమిటి? వారు ఎంత ఘోరంగా ఎందుకు జీవిస్తున్నారు? ఈ మానవ జీవితానికి అర్థం ఏమిటి?' అనే ప్రశ్నలకు సమాధానాల కోసం అన్వేషణ ప్రారంభించాడు. చివరకు తనను తాను తెలుసుకోవడం వల్లనే ఆత్మసాక్షాత్కారం సాధ్యమని తెలుసుకున్నాడు. బోధి వృక్షం కింద విశ్రమించినప్పుడు... అప్రయత్నంగా జ్ఞానోదయం అయింది. సిద్ధార్థుడు... గౌతమ బుద్ధుడు అయ్యాడు. "ఆధ్యాత్మిక ఉన్నతి సాధించడానికి ఘోర తపస్సులు, మూఢాచారాల ఆచరణ అవసరం లేదు. మనకు బంధరాహిత్యం ఉండాలి. అది అంతర్లీనంగా ఉండాలి "అని బోధించాడు సహజయోగ సాధకులు తమ నిత్య ధ్యాన కార్యక్రమంలో... తమ కుడి ఆజ్ఞాచక్రంలో ఉన్న బుద్ధుణ్ణి ధ్యానిస్తూ... బుద్ధుని లక్షణాలైన నిరంహంకారాన్ని, క్షమాతత్వాన్ని స్థిరపరుచుకొనే ప్రయత్నం చేస్తారు. బుద్ధ జయంతిని ప్రపంచ వ్యాప్తంగా... సామూహికంగా జరుపుకొంటారు.

బుద్ధుని జీవితంలో క్షమా గుణానికి సంబంధించిన ఒక అద్భుతమైన ఘటన ఉంది. ఒకసారి ఒక వ్యక్తి ఆయన దగ్గరకు వచ్చి... ఏ కారణం లేకుండానే ఆయనను దూషించాడు. బుద్ధుడు ఏమాత్రం చలించకుండా "నీవు ఇంకా ఏమైనా చెప్పాలనుకుంటున్నవా?" అని అడిగాడు. ఆ వ్యక్తి ఆశ్చర్యపడి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. మరుసటిరోజు తన తప్పు తెలుసుకొని వచ్చి బుద్ధుడి పాదాల మీద పడి "నన్ను క్షమించండి" అని వేడుకున్నాడు. అప్పుడు బుద్ధుడు "నిన్నటి నీవు వేరు. ఈ రోజు పశ్చాత్తాపంతో ఉన్న నీవు వేరు. నీవు చేసిన పనికి బాధపడడానికి నిన్నటి బుద్ధుడు కూడా ఈ రోజు లేడు. 'నిన్న' అనేది గతించింది. ప్రవహించే నదిలో నీరు ఎలా శాశ్వతం కాదో... కాలం కూడా అలాంటిదే. క్షణక్షణానికీ మారిపోతూ ఉంటుంది. కాబట్టి గడచిపోయినదాని గురించి చింతించకు" అని చెప్పాడు. మన హృదయంలో కోపం లేదా పగ పెంచుకుంటే మన ఆజ్ఞాచక్రం అంటే నుదురు భాగం మూసుకుపోతుంది. అప్పుడు కుండలినీ శక్తి పైకి ప్రవహించలేదు. 'బుద్ధుడిలా నేను అందరినీ హృదయపూర్వకంగా క్షమిస్తున్నాను' అనుకోవడం వల్ల మనలోని అహంకారం కరిగిపోతుంది. మన శ్శాంతి లభిస్తుంది.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
పరమ పూజ్యశ్రీ మాతాజీ
నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్,
తెలంగాణ

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కందుల సులోచనారాణి వచ్చేసింది!



తలపై ఆకులతో నిండిన పెద్ద బుట్ట, చేతిలో మరికొన్ని ఆకులు, టిఫెన్ క్యారియర్.. దుమ్ముతో నిండిన కాలిబాటలో నడుస్తూ కందుల సులోచనారాణి వచ్చేసింది. శర్వానంద్ హీరోగా సంపత్‌నంది దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'భోగి' చిత్రంలో పల్లెటూరి యువతి కందుల సులోచనారాణి పాత్ర పోషిస్తున్న అనుపమ పరమేశ్వరన్ లుక్‌ను గురువారం విడుదల చేశారు. మోదుగ ఆకులతో ఆకు పళ్లెం తయారు చేస్తూ జీవనం సాగించే సులోచన పాత్రలో అనుపమ చక్కగా ఒదిగిపోయారు. గంగా అనే తుఫాన్ లాంటి పాత్రకు ఆత్మలా నిలిచే సులోచన 'భోగి'లో కీలకంగా ఉంటుంది. ఇప్పటికే రాజమహేంద్రవరం, రంపచోడవరం, మారేడుమిల్లి ఫారెస్ట్ ప్రాంతాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. త్వరలో హైదరాబాద్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. 1960ల నాటి నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో సాగే ఈ యాక్షన్ డ్రామా, పీరియాడికల్ ఫిల్మ్‌లో డింపుల్ హయతి మరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆగస్టు 28న 'రక్షాబంధన్' సందర్భంగా విడుదలవుతున్న ఈ చిత్రానికి కేకే రాధామోహన్ నిర్మాత.

హరిణిగా మంజుల మనవరాలు



దర్శకుడు ఎమ్ఎస్ రాజు దర్శకత్వంలో శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిరిస్తున్న చిత్రం 'అగధ'. తాజాగా ఈ సినిమా నుంచి కీలక అప్డేట్ వచ్చింది. తెలుగు, తమిళ భాషల్లో వందలాది సినిమాల ద్వారా ప్రేక్షకులను అలరించిన సీనియర్ నటి మంజుల మనవరాలు జోవికా విజయ్‌ను ఈ సినిమా ద్వారా పరిచయం చేస్తున్నారు. ఇందులో ఆమె హరిణి అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఆమె పాత్ర చాలా శక్తిమంతంగా ఉన్నట్లు తెలుస్తోంది. 'దేవీ' సినిమాతో మంజుల కూతురు వనితను కూడా ఎమ్ఎస్ రాజు పరిచయం చేయడం గమనార్హం. వీఎఫ్ఎక్స్ ప్రధానంగా రూపొందుతున్న 'అగధ' ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని మేకర్స్ తెలిపారు.

సందేశాత్మక 'దూరదర్శన్'



సువిక్షిత్, గీతికా రతన్ జంటగా కార్తికేయ కొమ్మి తెరకెక్కించిన చిత్రం 'దూరదర్శన్'. 'కలిపింది ఇద్దరినీ' అనేది ఉపశీర్షిక. వారాహ మూవీమేకర్స్ బ్యానర్‌పై జయశంకర్ రెడ్డి ఎం, పాటిమీది సంతోశ్ నిర్మించారు. ఈ నెల 15న విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్తికేయ కొమ్మి మాట్లాడుతూ 'తల్లిదండ్రులతో పాటు యూత్‌కు మంచి సందేశం ఇచ్చే చిత్రమిది' అని అన్నారు. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన నటుడు జెమినీ సురేశ్ మాట్లాడుతూ 'మీ అందరి మనసులను తాకే చిత్రం 'దూరదర్శన్'. ఈ సినిమాను చూసేటప్పుడు పల్లెటూరిలో విహరించిన అనుభూతి కలుగుతుంది' అని చెప్పారు.

అమ్మోరు దిగినాది



డిఫరెంట్ కంటెంట్‌తో రా అండ్ రస్టిక్‌గా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'అనకాపల్లి'. విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రానికి కథ, స్ర్కీన్‌ప్లే అందించడమే కాకుండా దర్శకుడు నక్కిన త్రినాథరావు ఓ ముఖ్య పాత్ర కూడా పోషించారు. ఖగేశ్ తమ్మినేని దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'అనకాపల్లి' చిత్రం నుంచి తాజాగా 'అమ్మోరు దిగినాది' అంటూ సాగే జాతర సాంగ్ విడుదల చేశారు. మంగ్లీ గాత్రం, శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ, గ్రాండియర్‌గా పాటను తెరకెక్కించిన తీరు ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాను జూన్ 5న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు కంద్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన వెల్లడించారు.

విడుదలకు సిద్ధమైన కీర్తి ఎంబీబీఎస్



మలయాళ నటి భావన టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'హంట్'ను తెలుగులో 'డాక్టర్ కీర్తి ఎంబీబీఎస్' పేరుతో విడుదల చేస్తున్నారు. షాజీ కైలాస్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని గోపాలకృష్ణ దొండపాటి సమర్పణలో స్వర్ణ క్రియేషన్స్ బ్యానర్‌పై స్వర్ణకుమారి దొండపాటి, ఎమ్ విశ్వనాథ్ రెడ్డి విడుదల చేస్తున్నారు. ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో స్వర్ణకుమారి దొండపాటి, ఎమ్ విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంలోని భావోద్వేగాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి' అని చెప్పారు.

కరిష్మా కపూర్ సంతానానికి ఊరట



దివంగత వ్యాపారవేత్త సంజయ్ కపూర్ ఆస్తులను పరిరక్షించాలని, విక్రయించరాదని ఢిల్లీ హైకోర్టు గురువారం ఆదేశించింది. ఇది ప్రముఖ నటి కరిష్మా కపూర్ సంతానానికి ఊరట కలిగించేలా ఉంది. రూ.30వేల కోట్ల ఎస్టేట్‌కు యజమాని అయిన సంజయ్ కపూర్ గత ఏడాది జూన్‌లో లండన్‌లో మరణించారు. ఆస్తుల విషయమై ఆయన మూడో భార్య ప్రియా సచ్‌దేవ కపూర్, రెండో భార్య అయిన కరిష్మా కపూర్ సంతానం మధ్య వివాదం నెలకొంది. మొత్తం ఆస్తుల వివరాలను ప్రియా కపూర్ వెల్లడించలేదని పేర్కొంటూ కరిష్మా పిల్లలు కియాన్, సమీరా కోర్టును ఆశ్రయించారు. దాంతో ఆస్తులను విక్రయించకూడదంటూ ప్రియా కపూర్‌ను కోర్టు ఆదేశించింది. సంజయ్ కపూర్ బ్యాంకు ఖాతా నిర్వహణపైనా ఆంక్షలు విధించింది.

సిట్‌కు మరో రెండు నెలల గడువు

- గ్రూపు- 1 అక్రమాల కేసులో హైకోర్టు ఆదేశం
- ఇదే చివరి గడువు.. పొడిగింపు ఉండదని స్పష్టీకరణ
- దర్యాప్తు ఇలాగేనా?..గోప్యత అక్కర్లేదా అని ఆగ్రహం

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు పూర్తి చేసి నివేదిక సమర్పించేందుకు ప్రత్యేక పోలీసు బృందానికి (సిట్) హైకోర్టు మరో రెండునెలల సమయం ఇచ్చింది. మరోమారు గడువు పొడిగించబోమని తేల్చి చెప్పింది. తదుపరి విచారణను జూన్ 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మ ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. అప్పీళ్లపై విచారణలో సిట్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. "దర్యాప్తు పురోగతిపై వివరాలను కోర్టు ముందు ఉంచాం. ఫైనల్ రిపోర్ట్ వేసేందుకు మరో రెండునెలల గడువు కావాలి." అని అభ్యర్థించారు. ధర్మాసనం స్పందిస్తూ... దర్యాప్తులో గుర్తించిన వివరాలను గోప్యంగా ఉంచకుండా కోర్టు ముందు ఎలా పెడతారని సిట్‌ను ప్రశ్నించింది. కేసు దర్యాప్తు చేసేది ఇలాగేనా అని నిలదీసింది. కోర్టు ఆదేశాలతో సిట్‌కు నేతృత్వం వహిస్తున్న సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్, ఇతర అధికారులు మధ్యాహ్నం భోజన విరామం అనంతరం ధర్మాసనం ముందు హాజరయ్యారు. ధర్మాసనం వారితో మాట్లాడింది. అధికారులు చెబుతున్న కారణాలతో సంతృప్తి చెందామని, గడువు పెంచుతున్నామని ప్రకటించింది.

'ఎస్సీ హోదా' రద్దుపై నేడు తుది విచారణ

- తొలి విచారణకు హాజరు కాని పాస్టర్ ఆనంద్

బాపట్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ఆనంద్ ఎస్సీ సర్టిఫికెట్ రద్దు అంశంపై శుక్రవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్ వేదికగా తుది విచారణ జరగనుంది. ఏప్రిల్ 18నే తొలి విచారణ జరగ్గా, నేడు జరిగేదే చివరిదని కమిటీ ఛైర్మన్, జాయింట్ కలెక్టర్ భావన తెలిపారు. క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా వర్తించకపోవడంతో పాటు వారు పెట్టే అట్రాసిటీ కేసు కూడా చెల్లదని గతేడాది ఏప్రిల్ 30న హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఈ ఏడాది మార్చి 24న సమర్థించింది. అయితే హైకోర్టు విస్పష్టంగా తీర్పునిచ్చినా కూడా ఎస్సీ హోదా రద్దుపై తాత్సారం జరుగుతోందని పిటిషనర్ అక్కల రామిరెడ్డి మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఏప్రిల్ 24న విచారణ జరగ్గా, తదుపరి విచారణ జూన్ 16కు వాయిదా పడింది. వీటన్నింటి మధ్య జేసీ సారథ్యంలోని స్క్రూటినీ కమిటీ ఎస్సీ హోదా రద్దుపై శుక్రవారం తుది విచారణ జరపనుంది. ఏప్రిల్ 18న జరిగిన తొలి విచారణకు పాస్టర్ ఆనంద్ హాజరు కాలేదు. శుక్రవారం జరిగే విచారణకు ఆయన హాజరై తన వాదనను కమిటీ ముందు వినిపిస్తారా, లేదా అనేది తేలాల్సి ఉంది. ఈ విచారణ పూర్తయిన తర్వాత కమిటీ తీసుకునే నిర్ణయం కలెక్టర్ వద్దకు చేరనుంది. ఆయన దానిని పరిశీలించి రూల్ ప్రొసీజర్ ప్రకారం నిర్ణయం తీసుకోనున్నారు. అయితే తుది నిర్ణయం వెలువడడానికి కనీసం ఇంకో నెల రోజులు పట్టే అవకాశం ఉందని రెవెన్యూ యంత్రాంగం చెబుతోంది.

కుప్పం విమానాశ్రయ భూసేకరణకు పచ్చజెండా

- హైకోర్టు తీర్పులో జోక్యానికి నిరాకరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పం విమానాశ్రయ నిర్మాణానికి న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. భూసేకరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏపీ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ.. పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. కుప్పం విమానాశ్రయం కోసం సుమారు 150 ఎకరాల భూసేకరణ చేస్తూ జిల్లా కలెక్టర్ జారీ చేసిన నాలుగు నోటిఫికేషన్లు చట్టబద్ధమేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. విమానాశ్రయం అనేది ప్రజా ప్రయోజనానికి సంబంధించిన అంశమని, భూసేకరణను నిలిపివేయడం కుదరదని హైకోర్టు గతంలో తేల్చిచెప్పింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ చక్రధర్ రెడ్డితో పాటు మరో 29 మంది ఏప్రిల్ 16న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. భూమి అనుకూలతపై సరైన ఆధారాలు లేవని, నిబంధనలకు విరుద్ధంగా భూసేకరణ సాగుతోందని వాదించారు. ఈ పిటిషన్లపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేసింది. పెండింగ్‌లో ఉన్న ఇతర అనుబంధ దరఖాస్తులన్నింటినీ పరిష్కరించినట్లు పేర్కొంది.

ఢిల్లీ కోర్టులో రఘురామకు ఊరట

- బ్యాంకుల రుణ ఎగవేత కేసులో బెయిల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల రుణ ఎగవేత కేసులో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఊరట లభించింది. రెండో నిందితుడిగా ఉన్న ఆయనకు గురువారం బెయిల్ మంజూరు చేసింది. కేసు దర్యాప్తు సమయంలో రఘురామను అరెస్టు చేయని అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. రూ.50వేల పూచీకత్తు సమర్పించాలన్న నిబంధన విధించింది. నిందితులుగా ఉన్న మరో నలుగురికీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్ 15 వేల పేజీలకు పైగా ఉంది. దీంతో ఈ భారీ పత్రాలను పరిశీలించేందుకు సమయం కావాలని నిందితుల తరపు న్యాయవాదులు కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన న్యాయస్థానం, తదుపరి విచారణను జూలై 6కు వాయిదా వేసింది. నిందితుల కంపెనీల లిక్విడేషన్ (ఆస్తుల విక్రయ ప్రక్రియ) ఏ దశలో ఉందో పూర్తి వివరాలను సమర్పించాలని సంబంధిత అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు గత ఆదేశాల మేరకు రఘురామ గురువారం వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యారు.

రాష్ట్రానికి రూ.1500 కోట్ల 'ఉపాధి' నిధులు

- ఈ ఏడాది ఫిబ్రవరి వరకు బిల్లులు క్లియర్
- ఏప్రిల్‌లో రాష్ట్రంలో 3 కోట్ల పని దినాలు కల్పన
- మే నెలకు 6 కోట్ల లేబర్ బడ్జెట్ మంజూరు

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు కేంద్రం నుంచి గురువారం రెండు శుభవార్తలు అందాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పథకంలో మెటీరియల్ పనులకు సంబంధించి బకాయిలు చెల్లించేందుకు నిధుల మంజూరుతోపాటు.. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఎంపవర్ కమిటీ మే నెలకు సంబంధించి రాష్ట్రానికి 6 కోట్ల పని దినాలకు లేబర్ బడ్జెట్‌ను మంజూరుచేస్తూ మరో తీపి కబురు అందించింది. ఉపాధి హామీ పథకంలో దేశంలోని శ్రామికులకు ఏప్రిల్ నెలలో 6.34 కోట్ల పని దినాలు కల్పిస్తే.. వీటిలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే 3.05 కోట్ల పనిదినాలు కల్పించారు. దీంతో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మన రాష్ట్ర అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. శ్రామికులకు ఈకేవైసీ చేయడంలోనూ ఏపీ ముందున్నదని, ఏప్రిల్ నెలలో ఎన్ఎంఎంఎస్ యాప్ ఉపయోగిస్తూ అత్యధికంగా కూలీలకు పనులు కల్పించారని ప్రశంసించారు.

ఫిబ్రవరి నాటికి చేపట్టిన బిల్లులన్నీ క్లియర్

కేంద్ర ప్రభుత్వం మెటీరియల్ నిధులు రూ.1123.15 కోట్లు మంజూరు చేసింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ వాటా 25 శాతం సుమారు రూ.374.38 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో సుమారు రూ.1500 కోట్ల మెటీరియల్ నిధులు వెండర్ల అకౌంట్లలో జమచేస్తారు. దీంతో గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు చెల్లించాల్సిన బకాయిలన్నీ క్లియర్ అవుతాయి. బిల్లుల చెల్లింపులతో ఉపాధి పథకం ద్వారా చేపట్టే పనులు వేగవంతం కానున్నాయి. దీంతోపాటు అడ్మిన్ నిధులను కూడా రూ.69.01 కోట్లు మంజూరు చేశారు. రాష్ట్ర వాటా మరో రూ.23 కోట్లు చెల్లిస్తే మొత్తం రూ.92 కోట్లు సిబ్బంది జీతాలకు ఖర్చు చేసుకునే అవకాశముంది. కాగా రాష్ట్రవ్యాప్తంగా మెటీరియల్ నిధులతో చేపట్టిన మినీ గోకులాలకు గ్రీన్ చానల్‌లో బిల్లులు చెల్లించాలని పాడి రైతులు కోరుతున్నారు.

ప్రధానికి పెమ్మసాని కృతజ్ఞతలు

న్యూఢిల్లీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు రూ.1192.16 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధుల్లో మెటీరియల్ కంపోనెంట్‌కు రూ.1123.15 కోట్లు, అడ్మిన్ కంపోనెంట్‌కు రూ.69.01 కోట్లు విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ఉపాధి అవకాశాలను విస్తరించడంలో కేంద్ర నిధులు కీలక పాత్ర పోషిస్తాయని పెమ్మసాని అన్నారు. లక్షలాది మంది గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తూ, వారి జీవనోపాధిని బలోపేతం చేస్తాయన్నారు.

కృష్ణా జలాలను 66:34 నిష్పత్తిలోనే పంచాలి

తెలంగాణ అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోండి

- కృష్ణా బోర్డుకు ఆంధ్రప్రదేశ్ స్పష్టీకరణ
- 16 ప్రాజెక్టులపై ఆ రాష్ట్రం జారీ చేసిన జీవోపైనా అభ్యంతరం
- వచ్చేవారం బోర్డు భేటీ జరిగే అవకాశం!

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిపై తెలంగాణ అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులను నిలుపుదల చేయాలంటూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి ఆంధ్రప్రదేశ్ విన్నవించింది. గురువారం జరగాల్సిన బోర్డు సమావేశం.. తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో వాయిదాపడిన సంగతి తెలిసిందే. ఇది వచ్చే వారం జరిగే అవకాశముంది. రెండు రాష్ట్రాలూ తమ తమ ఎజెండాలను కేఆర్ఎంబీకి పంపాయి. వీటిపై చర్చించాలని పట్టుబట్టాయి. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తమకు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల చొప్పున 66:34 నిష్పత్తిలో కృష్ణా జలాలను విడుదల చేయాల్సిందేనని ఏపీ తన ఎజెండాలో విస్పష్టంగా పేర్కొంది. తెలంగాణ చేస్తున్న డిమాండ్ మేరకు అధికంగా నీటిని కేటాయించడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. 'ట్రైబ్యునళ్ల ఆదేశాలు, 11వ షెడ్యూల్ అనుమతులు లేకుండా తెలంగాణ కృష్ణా నదిపై అక్రమ నిర్మాణాలు చేపడుతోంది. సుంకిశాల ఇన్‌టేక్ వద్ద అక్రమ ఎత్తిపోతలకు సిద్ధమైంది. డీపీఆర్‌ను కూడా సిద్ధం చేస్తోంది. ఈ పథకాన్ని ముందుకు సాగకుండా నిలువరించాలి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి 90 టీఎంసీలు వాడేందుకు సైతం సిద్ధమైంది. కృష్ణా ట్రైబ్యునల్-2 ముందున్న ఈ ప్రాజెక్టును కొనసాగించకుండా ఆ రాష్ట్రాన్ని నిలువరించాలి. కేఆర్ఎంబీ పరిధిలోని కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి ఇప్పటికే అధికారికంగా 25 టీఎంసీలు కేటాయింపులున్నాయి. అదనంగా ఇంకో 15 టీఎంసీలను అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తోంది. నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని అక్రమంగా నిర్మించి లక్ష ఎకరాలకు సాగునీరందించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే పరిపాలనా ఆమోదం తెలుపుతూ ఉత్తర్వు కూడా జారీ చేసింది. కేంద్ర జలశక్తి మంత్రి నేతృత్వంలోని ఎపెక్స్ కౌన్సిల్ అనుమతుల్లేని ఈ ప్రాజెక్టును నిలువరించాలి. పులిచింతల దిగువన కృష్ణా నది కుడివైపున వాజేపల్లి గ్రామం వద్ద రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకాన్ని అక్రమంగా నిర్మించేందుకు సిద్ధమైంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడితే.. ఏపీకి 75 శాతం డిపెండబిలిటీ కింద నికర జలాల్లో కోత పడుతుంది. మున్నేరు (ఖమ్మం) వద్ద కొత్త పథకాలను నిర్మించేందుకు తెలంగాణ చేస్తున్న ప్రయత్నాలనూ నిలువరించాలి. గూడెందొడ్డి, రాళంపాడు రిజర్వాయర్ల కింద నెట్టెంపాడు ద్వారా అదనంగా 25 టీఎంసీలను అక్రమంగా తరలించేందుకు చేస్తున్న ప్రయత్నాలనూ అడ్డుకోవాలి. 16 నీటి ప్రాజెక్టులకు పరిపాలనా ఆమోదం తెలుపుతూ ఆ రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన 34వ నంబరు ఉత్తర్వుపైనా మాకు అభ్యంతరాలున్నాయి' అని ఏపీ స్పష్టం చేసింది.

తెలంగాణ ఎజెండా ఇదీ..

పోలవరం-నల్లమల సాగర్ అనుసంధాన పథకం ద్వారా ఏపీ అనధికారికంగా రోజుకు రెండు టీఎంసీల చొప్పున 200 టీఎంసీలను తరలించేందుకు ప్రయత్నిస్తోందని బోర్డుకు పంపిన తన ఎజెండాలో తెలంగాణ ఆరోపించింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కొత్తగా నిర్మించే ప్రాజెక్టులకు ఎపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందాలని.. అది లేకుండా పనులు చేపట్టేందుకు వీల్లేదని ఏపీకి బోర్డు స్పష్టం చేయాలని సూచించింది. పోతిరెడ్డిపాడు ద్వారా బేసిన్ ఆవలకు నీరు తరలించకుండా నిరోధించాలని కోరింది. రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ప్రీ-డీపీఆర్ దశలోనే నిలిపేశామని ఏపీ చెబుతున్నప్పటికీ అక్కడ పనులు జరుగుతున్నాయని తెలిపింది. వాస్తవ స్థితిగతులను బోర్డు స్పష్టం చేయాలని పేర్కొంది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఏపీ అనధికారికంగా ప్రాజెక్టులను అక్రమంగా కడుతోందని, దీనిపై బోర్డు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆక్షేపించింది.

పోలవరం రెండో దశపై నేడు స్పష్టత!

ఢిల్లీలో విస్తృతస్థాయి సమావేశం.. సీఎస్ సాయిప్రసాద్ హాజరు

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పోలవరం తొలిదశ పనులు తుది అంకానికి చేరుతుండడంతో.. 45.72 మీటర్ల ఎత్తున 194.6 టీఎంసీల గరిష్ఠ నీటి నిల్వ కోసం ప్రాజెక్టు రెండో దశను పట్టాలెక్కించే కార్యాచరణకు కేంద్రం సిద్ధమైంది. దీని కార్యాచరణపై శుక్రవారం ఢిల్లీలో కీలక సమావేశం నిర్వహిస్తోంది. కేంద్ర జలశక్తి కార్యదర్శి వీఎల్ కాంతారావు నిర్వహిస్తున్న ఈ భేటీకి జలవనరుల శాఖ బాధ్యతలు కూడా చూస్తున్న రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ హాజరవుతున్నారు. కేంద్ర జలసంఘం, కేంద్ర పర్యావరణం-అటవీ శాఖ, కేంద్ర భూసేకరణ, సహాయపునరావాస శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), వాప్కోస్, సీఎస్ఎంఆర్ఎస్ అధికారులతో జరిగే ఈ సమావేశంలో జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు కూడా పాల్గొననున్నారు. రెండో దశపై ఈ సందర్భంగా పూర్తి స్పష్టత వస్తుందన్న విశ్వాసాన్ని జల వనరుల శాఖ వ్యక్తం చేస్తోంది. తొలిదశలో 41.15 మీటర్ల కాంటూరు పరిధిలో 38,060 నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లింపు దాదాపు ముగింపు దశకు వచ్చింది. రెండో దశలో మొత్తంగా 1,06,006 నిర్వాసిత కుటుంబాలకు గాను ఇంకా 67,946 మందికి భూసేకరణ పరిహారం, సహాయ పునరావాస కార్యక్రమాలు అమలు చేయాల్సి ఉంది. ఈ భూసేకరణపై లక్ష్యాలను నిర్దేశించాలని.. సహాయ పునరావాస కార్యక్రమాల అమలుకు నెలవారీ టార్గెట్లు విధించాలన్న యోచనలో తాము ఉన్నట్లు ఇటీవల ఢిల్లీలో జరిగిన భేటీలో సాయిప్రసాద్‌కు కాంతారావు స్పష్టం చేశారు. కేంద్ర ప్రాజెక్టుగా పోలవరం నిర్మాణ బాధ్యతలను నిరంతరం పీపీఏ పర్యవేక్షించాలి. ఈ బాధ్యతను పీపీఏ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ వాప్కోస్‌కు అప్పగించింది. అయితే వాప్కోస్ ఈ బాధ్యతలను సీరియస్‌గా నిర్వర్తించడంలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో.. ప్రాజెక్టు కీలక దశకు చేరుకున్న సమయంలో ఆ సంస్థ పూర్తి పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలని కాంతారావు ఆదేశించారు ఇప్పటికే కొత్త డయాఫ్రం వాల్ పూర్తయింది. దానిపై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులు ఆరంభమయ్యాయి. ఇవి వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. వచ్చే మార్చినాటికే పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థకు సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. ఈసీఆర్ఎఫ్ డ్యాం పూర్తయితే ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు మార్గం సుగమవుతుంది. అయితే దానికి ముందుగా.. 45.72 మీటర్ల కాంటూరు పరిధిలోని నిర్వాసితులందరికీ పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇంకోవైపు.. ముంపు సమస్య పరిష్కారానికి కూడా కాంతారావు చర్యలు తీసుకుంటున్నారు. ఒడిసా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలతో కలిసి సంయుక్త సర్వేలు జరపాలని, వాటి అనుమానాలను, అభ్యంతరాలను నివృత్తి చేయాలని కేంద్ర జల సంఘాన్ని ఆదేశించారు. అలాగే పోలవరం ప్రాజెక్టుపై స్టాప్ వర్క్ ఆర్డర్‌ను పూర్తిగా ఎత్తివేసేందుకు కూడా ఆయన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.